ISSN No:2581-7477

# సాహిత్యప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 1 సంచిక - 10 జూలై - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



ఫొటోలు: ఎస్.ఎస్.బి. గేరా - 9492922492

# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం


## కరోనా వేళలో మూడు అంశాలు

కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు లాక్‌డౌన్ కఠినంగా సుదీర్ఘంగా అమలు చేసినప్పటికీ దేశంలో పాజిటివ్ కేసులు, మరణాలు పెరుగుతున్నాయే గాని తగ్గడం లేదు. అయిదు లక్షల పాజిటివ్‌లు, పదిహేను వేలకు పైగా మరణాలతో భారత దేశం ఇప్పుడు ప్రపంచంలో అమెరికా, బ్రెజిల్‌ల తర్వాత వైఫల్య జాబితాలో మూడో స్థానంలో వుండటం ఎంతైనా ఆందోళన కలిగించే అంశం. ఈ కేసులలో 85 శాతం 8 రాష్ట్రాల్లోనే వుండగా అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా వుండటం మరింత తీవ్రమైన విషయం. ప్రజారోగ్య వ్యవస్థ పటిష్టత, పరీక్షల పెంపుదల, ఐసొలేషన్, చికిత్స తదితర జాగ్రత్తల విషయంలో మరెంతో జాగ్రత్త తీసుకోకపోతే పరిస్థితి ఇంకా క్షీణిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వలస కార్మికుల వెతలు పూర్తిగా తీరకపోగా ఇతర కార్మికులు, ఉద్యోగుల భద్రతకూ, జీతాలకూ కూడా ముప్పు ఏర్పడిన స్థితి. దేశ ఆర్థిక స్థితి అధ్వానంగా మారింది. ఈ అనుభవాల తర్వాత లాక్‌డౌన్ ఒక్కటే తారక మంత్రంగా భావించక కచ్చితమైన సమగ్రమైన విధానాలతో కరోనాను నిరోధించాల్సిన అవసరముంది.

◆ ◆ ◆

ఈ సమయంలో పిల్లల పరీక్షలు, బళ్లు, కాలేజీల పరిస్థితి అయోమయంగా మారింది. కొన్ని పరీక్షలు రద్దు కాగా మరికొన్ని త్రిశంకు స్వర్గంలా వున్నాయి. ఇక ఆన్‌లైన్ పాఠాలే ప్రత్యామ్నాయమన్నట్టు హడావుడి చేయడం కూడా అనేక ప్రశ్నలకు దారితీస్తున్నది. మరోవంక ప్రైవేటు టీచర్లు జీతాల్లేక వీధిన పడుతున్నారు, తలిదండ్రులపై ఆర్థిక భారంతో పాటు పిల్లల బడిచదువులకు బాధ్యత మీద పడుతున్నది. దీనిపై లోతైన చర్చ చేయవలసి వుంది,

◆ ◆ ◆

ఇంత తికమక సమయంలో సామూహికంగా ఇంగ్లీషు మీడియంకు మార్చేస్తే పిల్లల పరిస్థితి పెనం మీద నుంచి పొయిలోకి పడినట్టవుతుంది. కనుక  ఈ ఏడాది వరకైనా దాన్ని వాయిదా వేయడం శ్రేయస్కరం.

◆


ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు

ఎవరో వస్తారని – మీనాక్షి శ్రీనివాస్..................... 5
ఐశ్వర్యం – గన్నవరపు నరసింహమూర్తి............... 20
పెద్దమ్మాయి – ఆర్.సి. కృష్ణస్వామి రాజు.............. 42
విధ్వంస దృశ్యం – రాచపూటి రమేష్.................. 61

## కవితలు

కనిపించని శత్రువు – మాల............................. 9
తెగిన గాలిపటం!! – అనిత దావత్...................... 9
చివరి వసంతం – సునీత గంగవరపు.................. 13
త్రిభుజాలు – గిరిప్రసాద్ చెలమల్లు...................... 13
నేలతల్లి ఆలోచనలో పడింది
– కర్లపాలెం హనుమంతరావు..................... 19
అక్షరాల మది – జవేరియా............................ 19
నిశ్శబ్దంగా! – నిఖిలేశ్వర్.............................. 24
ఆపన్న హస్తం – మెట్టా నాగేశ్వరరావు................. 24
ఓసారిలా చూడవూ.. – పక్కి రవీంద్రనాథ్............ 29
నలుపు కలలు – పద్మావతి రాంభక్త.................... 29
మార్పు – సమీర్.......................................... 32
కరివేపాకు అమ్మి... – డా॥ జోస్యుల కృష్ణబాబు...... 33
ప్రస్థానం – గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి..................... 36
60 – జి – పొన్నాడ సత్యప్రకాశరావు.................. 41
పాత్రలు – సంకటి మహేశ్వరయ్య....................... 41
ట్రెండీ తంత్రం – నందిరాజు విజయ్‌కుమార్......... 44
చావని బతుకు కోసం – డా॥ సిద్దెంకి యాదగిరి...... 45
నిశ్శబ్ద యుద్ధం – మూన్................................. 49
నమ్మకం – తిరునగరి శ్రీనివాసస్వామి................. 49
క్షమించు తల్లీ! – ఆది ఆంధ్ర తిప్పేస్వామి............. 55
వాంగ్మూలం – సుద్దాల వినోద్‌కుమార్................. 60
నేర్చుకున్న పాఠం – వంజరి రోహిణి.................. 64

## వ్యాసాలు

సాహిత్య ప్రస్థానం జూన్ 2020 పురస్కారాలు........ 9
రంగనాయకమ్మ ఇంటర్వ్యూ
– గోవిందరాజు చక్రధర్ ........................ 10
మౌనాన్ని మాట్లాడిస్తున్న కవి
– డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి............. 14
కథలు రాయడం ఎలా? – సాహిత్య పరిచయం
– పెనుగొండ లక్ష్మీనారాయణ .................. 25
ప్రకృతి అడుగుజాడల్లో పయనిస్తున్న కవి
– అంపశయ్య నవీన్ ............................ 30
చర్చల మార్గం క్షేమదాయకం – తెలకపల్లి రవి....... 34
కదిలించే కవితాధార – వొరప్రసాద్.................. 37
నిఖిలేశ్వర్ ఇంటర్వ్యూ – కె. ఆనందాచారి............. 46
మనకాలపు గాంధీలు, నెల్సన్ మండేలాలు, మార్టిన్‌లు
– గోపాలకృష్ణ గాంధీ ............................ 50
నీవు లేవు నీ పాట ఉంది
– డా॥ కాళిదాసు పురుషోత్తం..................... 52
ప్రజాస్వామ్యం ముసుగుతీసి చూపిన కథలు
– వల్లభాపురం జనార్దన.......................... 56
హృదయ భాష విచ్చుకోవాలి –ఎమ్వీ రామిరెడ్డి....... 58
సాహిత్యం – సామాజిక చైతన్యం: అంతర్జాల సదస్సు
– యడవల్లి శ్రీనివాస రావు....................... 65

ISSN No: 2581 - 7477
సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !
రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000/ ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ

# ఎవరో వస్తారని

- మీనాక్షి శ్రీనివాస్
9492837332



**తూ**రుపు దిక్కు ఎర్రబారి సూర్యుని ఆగమనాన్ని సూచిస్తోంది. చుట్టూ కొండలూ, ఎన్నెన్నో వన్నెల హరితం, కనుచూపుమేరా తివాచీ పరచి ఆహ్వానం పలుకుతోందా అన్నట్లున్న అరకు లోయలోకి దుమ్ము రేపుకుంటూ పల్లెవెలుగు బస్సు వచ్చి ఆగింది. ‘ అరకు..అరకు ‘ కండక్టర్ అరుపుతో, ఆ అందాలని ఆస్వాదిస్తున్న ఓ యువకుడు ఉలిక్కిపడి, దిగడానికి ఉద్యుక్తుడయ్యాడు.

‘అబ్బా! ఏమిటో ఈ జనం, అన్నింటికీ తొందరే, ఎక్కేటప్పుడు తోసుకున్నారూ అంటే అర్ధం ఉంది, సీట్ దొరకదేమో అని, మరి దిగేటప్పుడూ అదే తోపులాట, వీళ్ళని మార్చడం ఎవరికీ సాధ్యం కాదు.’ నవ్వుకుంటూ దిగాడా కుర్రాడు.

“ రై .. రై ” ఈల ఊదుతూ, సరిపోదన్నట్లు బస్ రేకుల మీద కొట్టాడు కండక్టర్ .. బస్ వెళ్ళిపోయింది.

ఆరడుగుల పొడుగూ, గ్రీకు శిల్పం లాంటి దేహ ధారుడ్యం, ఉంగరాల జుట్టూ, చురుకైన చిన్న చిన్న కళ్ళూ, ముదురు నీలం జీన్ పాంట్, లేత నీలపు టీ షర్ట్ తో, భుజాన వేలాడుతున్న లాప్ టాప్ బేగ్, చేతిలో లెదర్ సూట్కేస్‌తో దిగాడు.

తను పుట్టి పెరిగిన నేల చూడబోతున్నానన్న ఆనందంతో ఒళ్ళంతా పులకించింది. తమ తండా సుమారు ఏడెనిమిది మైళ్ళుంటుంది. మామూలుగా అయితే ఉషోదయపు అందాలను చూస్తూ నడవచ్చు,, కానీ ఇల్లు చేరాలన్న తొందర ఆటో ఎక్కేలా చేసింది. వానలు పడుతున్నాయేమో .. మట్టి రోడ్డంతా రాళ్ళూ, గుంటలతో గుర్రమెక్కినట్లే, ఎగిరెగిరి పడుతున్నాడు.

ఇదే నిండు గర్భిణీ కనక ఎక్కితే దార్లోనే ప్రసవం ఖాయం. నవ్వుకున్నాడు. అంతలోనే పదిరోజుల క్రిందట వార్తా పత్రికలో చదివిన వార్త గుర్తొచ్చి మనసు భారమై, బాధతో మూలిగింది. తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నారు కనుక సరే, లేకుంటే? ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా మారదా ఈ పరిస్థితి? మారరా ఈ మనుషులు? మారవా వీళ్ళ బ్రతుకులు? ఒక్కసారిగా ..అప్పటిదాకా ఉప్పొంగిన ఆనందం మీద నీళ్ళు జల్లినట్లైంది. చెయ్యాలి .. తనవాళ్ళందరికీ ఏదో మంచి చెయ్యాలి .. వాళ్ళ బ్రతుకుల్లో వెలుగులు తేవాలి.

చుట్టూ చూస్తూనే అతను మనసులో తను అనుకున్న కార్యాచరణ మరోసారి వల్లె వేసుకున్నాడు.

“అన్నా! ఇక్కడి నుండి బండి పోదన్నా, దారి మరీ పాడైంది మొన్నటోనలకి” ఆటోతో బాటు ఆలోచనలకు కూడా బ్రేక్ పడింది.

“అవునా! ఎందాకా వచ్చాం? అబ్బో ఇంకా చాలా దూరమే నడవాలే, సర్లే .. ఇంద” డబ్బులిచ్చేసి కిందకు దిగేడు.

దారంతా బురద, నీళ్ళు .. ఒక్కసారి నిట్టూర్చి .. పేంట్ పైకి లాగి, చెప్పులు చేత్తో పట్టుకుని నడక మొదలెట్టాడు. ఎప్పటిలానే ఇంటికంటే ముందు గానుగ చెట్టు వీధిలో ఉన్న ‘వీరన్న తాత’ ఇంటికెళ్ళాడు. అప్పటికే ఎవరో అమ్మ పెట్టిన ఇడ్లీ తిని .. అరుగు మీద కూచుని లొల్లాయి పదాలు పాడుకుంటున్నాడు .. డెబ్బైఏళ్ళు పైబడ్డ ఆ తాత.

"ఏం తాతా, బాగున్నావా? నన్ను గుర్తు పట్టేవా?" పక్కగా కూర్చుంటూ అడిగాడు.

నుదుటికి చెయ్యి అడ్డం పెట్టుకుని "ఎవురూ .. సూపు సరిగా ఆనటం లేదు బాబూ .. పోల్చుకోలేకున్నా" వణుకుతూన్న స్వరంతో

"నేను తాతా 'వీరడిని, మల్లి కొడుకుని" అంటూ తను తెచ్చిన బిస్కట్ పేకట్స్ అతనికిచ్చాడు.

"ఆర్నీ .. నువ్వా మనవడా! అడ్డెడ్డే! చాన ఒత్తరైపోనావ్, గురుతు పట్టలా .. నీ సదువైపోనాదా? మీ అమ్మ, అయ్య ఒకటే ఎదురుసూత్తన్నారు నీ కోసం .. ఇదేనా రాడం?" అతనిని ఒళ్ళంతా తడుముతూ ఆప్యాయంగా పలకరించాడు.

"అవును తాతా, బస్ దిగుతూనే రివాజుగా నీ కాడకే కద వచ్చేది .. సరే! మళ్ళీ కలుస్తా, వస్తా." అంటూ బయలుదేరాడు.

చుట్టూ చూస్తూ అడుగులు వేసాడు .. 'ఈ మాటు తనొచ్చి సుమారు నాలుగేళ్ళ పైనే అయింది, ప్రపంచమంతా ఎంతో ముందుకు పోతున్నా .. ఈ ఊళ్ళు మాత్రం మారవు' గుండెలోంచి వేడి నిట్టూర్పు తన్నుకొచ్చింది. ఇల్లు చేరాడు. తనకోసమే ఎదురు చూస్తున్న తల్లీ, తండ్రీ ఒక్క సారిగా వాటేసుకున్నారు.

'ఆర్నీ .. దొరబాబులాగున్నావురా, ఏటి నా కన్నా ఎత్తరిగున్నావ్" తండ్రి గర్వంగా అన్న మాటలకి

"ఉండేస్ .. నా బిడ్డకి దిట్టి పెట్టమాక" అంటూ ప్రేమగా బిడ్డని తడిమింది మల్లి, కళ్ళారా సూసి మురిసిపోయారిద్దరూ.

తను ఆ రోజు వస్తున్నట్లు సావాసగాళ్ళకందరికీ ముందే చెప్పడంతో, ఊరు చివర మిట్ట దగ్గర అనుకున్నట్టే మూడింటికల్లా మిగతా కుర్రాళ్ళతో సహా చేరారు. కాసేపు ఆనందాన్నీ, కబుర్లనీ కలబోసుకున్నారు. అప్పటికే కుర్రకారంతటినీ చైతన్య పరచి, తాము చేయవలసిన పనులు వారికి పదేపదే చెప్పి, ఒక పద్దతి ప్రకారం కొన్నేళ్ళుగా అన్ని ఇళ్ళ నుంచీ నెలకింత అని వసూలు చేసి పెట్టి ఉంచిన చిన్న చిన్న మొత్తాల జమ వివరాలు తెలుసుకున్నాడు. తాము అనుకున్నది సాధించగలరన్న నమ్మకం కలిగింది.

"చూడండి .. నా చదువు పూర్తయింది, మంచి ఉద్యోగం కూడా వచ్చేసింది .. చేరడానికింకో రెండు నెలలు గడువుంది .. ఆ లోపు మనం చెయ్యాల్సింది చాలా ఉంది. మీరంతా నా మాట వింటామనీ, మనసుపెట్టి చెప్పింది చేస్తామనీ ముందుగా నాకు మాటివ్వండి. అయితే అంతకు ముందుగా నేనో షార్ట్ ఫిల్మ్ చూపెడతా, జాగ్రత్తగా చూడండి .. అప్పుడు చెబుతా నేను మీకు అదెందుకు చూపించానో .. సరేనా?" బేగ్ లోంచి లాప్-టాప్ తీసాడు., అంతా కుతూహలంగా చూస్తున్నారు .. షో మొదలైంది.

◆◆◆

"ఓరి అప్పన్నా! నీ పెళ్ళానికి నెప్పులొత్తన్నాయంట, ఆడ నీ తమ్ముడు నీ కోసం ఎతుకుతాన్నాడు" కొండ రొప్పుతూ అన్నాడు.

" ఏటి! ఇప్పుడు నెప్పులు రాడమేటి? ఇంకా నెల మీన పదేను రోజులున్నాది కదా! అలగంటే నే లగెత్తి ఇంటికి పోతానని అడావుడి సేత్తన్నారేమో! మావా .. బేగీ ముక్కెయ్, ఈ పాలి ఆట నాదె " అంటా ఆటలో పడిపోయాడు.

" ఓర్నీ తల్లి తాడు తెగా! సెపుతుంటే ఇనుకోవేటి .. అక్కడ నీ పెళ్ళాం నెప్పులతో గిలగిల్లాడతా ఉంటే, ఇక్కడ నువ్వు తీరుబడిగా ఆటేటీ? అక్కడ ఇంటోవోళ్ళంతా ఓ .. తెగ గాబర అడిపోతన్నరు. టయానికి కామందుగోరి ట్రాటర్ బండీ, జీపన్నా నేదు .. ఉందుంటే కాళ్ళూ, గడ్డం ఒట్టుకునన్నా బతిమాలో, బామాలో తెచ్చుకునేటోళ్ళం. ఓ పక్క ఎడతెరిపినేకండా కురుత్తున్న వోనలకి .. ఉన్న ఆ కాత్త మట్టి రోడ్డూ కొట్టుకపోనాది ..ఇప్పుడేటి దారో అర్దమవ్వుతలా. ఆడింది సాలు గానీ ఇక నెగసే " కసిరాడు కొండ.

"ఏటి కొండన్నా! నిజంగానేనేటి, నేనింకా నువ్ పరాసికాలాడవనుకున్న, ఆరి దేవుడా! ఇపుడేటి దారి! "చేతిలో ఉన్న చీట్ల పేక అక్కడ పడేసి లేచి ఇంటివైపు పరిగెత్తాడు. 'ఇదిగో కొండన్నా కూతంత తోడు రా! సిమ్మాద్రప్పన్నా ఈ గండం గట్టెక్కించు, పుట్టే బిడ్డకి నీ పేరే ఎట్టుకుంటా." పరిగెడుతూనే మొక్కేసుకున్నాడు..

ఇల్లు చేరే సరికి చుట్టుపక్కల ఆడంగులంతా అక్కడే ఉన్నారు, ఎరుకల సాని దేవుడిపై భారం వేసి తన ప్రయత్నం తను చేస్తోంది. నిండు గర్భిణీ మల్లికి ఇంకా పదహారో ఏడు, బక్కపలచగా ఉన్న ఆ పిల్లలో ఇంత బాన కడుపు తప్ప మరేది కనిపించడం లేదు.. తొలిచూలు .. పెళ్ళయి ఇంకా ఏడాది కూడా కాలేదు. అరిచి అరిచి సొమ్మసిల్లిపోతోంది. ఆ అరుపులకి అక్కడున్న అందరి గుండెలూ జారిపోతున్నాయి.

ఎరుకలసాని కారుతున్న చెమటలతో బయటకొచ్చింది "నాబం నేదు, ఆసుపత్రికి పోవాల్సిందే, బిడ్డ అడ్డం తిరిగేసినాది, మామూలు కానుపు కట్టం, ఆపరేసను సేసి తియ్యాల్సిందే" ఒక్క సారిగా వాళ్ళంతా గొల్లుమన్నారు.

"అలగనమాకోలప్పా, మల్లి నాకు నేకనేక పుట్టిన బిడ్డ, అబ్బరంగా పెంచీసినాను. అది సదువుకుంటానమ్మా, ఇప్పుడే

పెళ్ళొద్దంటే, ఆల్ల అవ్వ పానం మీదికొచ్చిసినాదని, ఈ మనువైతే కల్లెదురుంగనే ఉంటదనీ సేసినా, అదింకా ఆడే పాడే పనికూన. ఇప్పుడదో కూనకి జల్మనియ్యనేక కట్టపడతాంది, చచ్చి నీ కడుపున బుడతా, ఏదో దారిసూడమ్మీ. ఇప్పుదేడకి తీసుకుపోవాలి? అంత సందేదున్నాది" ఏడుస్తూ అమాంతం కాళ్ళమీద పడిపోయింది మల్లి తల్లి. .

"అయ్యయ్యో! ఏటాపిచ్చిపని, నాకు మాత్రం దాన్నలా ఒగ్గీడం సరదానేమన్నా? ఇక్కడున్న సానామంది ఇళ్ళల్లో నేనేకదా కానుపులు సేసింది. కానుపు కట్టమైనాది .. ఇంకా ఈడనే కూసుని పానం మీకి తేడమెందుకని సెపుతున్నా! ఏదో దారి సూడాల, బొట్టిని గాని సంపీసుకుంతామా?" మగాళ్ళకేసి చూస్తూ అంది.

"డొంకదారినబోయినా ఐదారు మైళ్ళ దూరం ఉంటది, ఇప్పుడు ఓనలేకున్నా, తెల్లోర్లూ కురిసిందేమో, బుడమేరు పోటెత్తుతోంది, ఏటి సెయ్యడం?" చేతులు నలుపుకుంటూ, ఏడుపునాపుకొంటూ అన్నాడు మల్లి తండ్రి.

"మావా! ఇదేటిదీ, నెలన్నర ముందే నెప్పులేంటి?" అయోమయంగా అన్నాడు అప్పన్న మాట తడబడుతుండగా.

"తప్పుడు లెక్కలో ఏమో! అమాశ, పున్నం లెక్కలేగదా! ఇప్పుడదా ముక్కెం .. ఆసుపత్రికెట్టపోవాల్నో అదాలోసించు ముందు .." కసిరింది ఎరుకలసాని.

"ఏటి ఆలోసించేది! బొట్టిని డోలీల మోసుకపోదారి . ముందొకలెల్ళి రోడ్డుకాడికి నూటా ఎనిమిది బండి వచ్చేతట్టు సూడండి. అసలింత వానలో ఆ డాక్టరమ్మ ఉంటదో లేదో, కానీండి .. అన్నిటికి ఆ దేవుడే ఉన్నాడు." గుండె నిబ్బరం చేసుకుని ఒక లావుపాటి కర్ర తెచ్చాడు రాములు. దానికి చీర మడతలేసి రెండుకొసలూ గట్టిగా కట్టారు .. ఉండుండీ అరుస్తున్న మల్లిని అందులోకి చేర్చి ఇద్దరు మొగాళ్ళు భుజాలకెత్తుకున్నారు. బయలుదేరిననప్పటినుంచీ అడుగు మోపడం కష్టమై, జర్రు జర్రున జారుడు. ఆ కుదుపులకి మల్లి ఒకటే అరుస్తోంది. పక్కనున్న గానుగ చెట్టు వీధికొచ్చేసరికి, అక్కడ ఇంటి అరుగుమీద కూచుని లొల్లాయి పదాలు పాడుకుంటున్న వీరయ్య , వాళ్ళను చూస్తూనే పరుగు పరుగునొచ్చేసాడు "ఏటైంది? ఏటైంది?" అంటూ.

" ఇప్పుడు నీకు కతంతా సెప్పే టైం లేదుగానీ, మమ్మల్ని పోనీ" అంటూ విసుక్కున్నాడు అప్పన్న.

"అది కాదేహే ..ఆడబిడ్డ అట్టా నెప్పులడిపోయి అరుత్తుంటే ఏటి సేత్తన్నారు .. ఆసుపత్రిదాకా ఇట్టానే మోసుకుపోతారా ఏటి? ఎంత బేగెల్లిపోచ్చినా మూడు నాలుగు గంటలడతది .. నా మాటినండి, నేనో దారి సేసినా .. అందులోంచెడితే ఆసుపత్రికి బేగ ఎల్లిపోచ్చు .. కానీ ఆ దారి సిన్నగుంటది, ఈ పిల్లనిట్ట మోసుకుపొయ్యేంత జాగా ఉండదు, అందుకే ఓరన్న పరిగెత్తుకపోయి డాక్టరమ్మనీ, నూటా ఎనిమిది బండినీ అట్టుకొస్తే నయంగుంటది. బేగ పారొచ్చేటోళ్ళెవరున్నారు? ఆ .. ఒరే .. బుడ్డోడా! నువ్ ఎల్లిపోరారా, నువ్వైతే బేగ లగెత్తుతవ్ తూనీగలెక్క, పోరా .. పోయి డాక్టరమ్మనట్టుకొచ్చి మల్లినీ, పిల్లనీ కాపాడి పున్నెం కట్టుకో"

" ఓరి పిచ్చోడా, నీ పిచ్చి మాటలినడానికిదా సమయం తప్పుకో, మమ్మల్ని పోనీ" కసిరి తోసేసాడు రాములయ్య.

"నా మాటినండి .. మల్లినీడనే ఇంట పడుకోబెట్టి, ఒరే .. తూనీగా! నువ్వు పోయి అక్కడోరుంటే ఆరిని తోలుకురా .. ఆ దారి ఇరుగ్గుంది, నేకుంటే మల్లినే అట్టుకు పోచ్చు, ఆలీసం సేబాకండి .. ఓరి తూనీగా! నువ్వన్నా సెప్పురా! ఈళ్ళెవరూ నా మాట నమ్మడం లేదు, ఆలీసం సేసి మల్లి పానాల మీదకి తేకండిరా" తూనీగ అన్న కుర్రాడి చేతులట్టి బతిమలాడుతున్న వీరయ్య తాతని అంతా అపనమ్మకంగా చూసేరు.

" అవునన్నా! యీరన్న తాత సెప్పేది నిజమే, నేనోపాలి ఆ దారిగుండా యెల్లిపోయొచ్చేసినా .. అందులోంచి ఎడితే గమ్మున ఎల్లిపోరాచ్చు" హుషారుగా చెప్పాడు తూనీగ. అందరూ ముఖముఖాలు చూసుకున్నారు.

ముందుగా తేరుకుంది ఎరుకల ఎంకమ్మే "అలగైతే .. అదే మంచిదిగదా, ఇంకా మబ్బులుమబ్బులుగున్నె, దారిమద్దెన ఓనడినా కట్టమే, ఎటు కాకుండ పోతం .. నువ్ పోరా, 'కానొరే ఆడు సిన్నాడు, ఆడు సెబితే, ఆడి మాటనమ్మి ఒవ్వరైన వత్తారంతావా?" అంతలోకే సందేహం వెలిబుచ్చింది ఎంకమ్మ.

"నీకెందుకవ్వా, నే సెప్పితీసుకొత్తాగా" హుషారుగా అన్నాడు..

"పద పద, మల్లిని లోనికి తీసికెళ్ళండి, కాసిని ఏడేడి గంజి తాపించండి. ఓర్చుకో తల్లీ, డాక్టరమ్మ వస్తాది, నీకేం కాదు" అంటూ ధైర్యం చెప్పాడు వీరయ్య తాత.

రెండు గంటల్లో సరంజామాతో అంబులెన్స్ లో ఓ డాక్టరమ్మా, ఓ నరుసుపిల్లా వచ్చేసారు తూనిగ్గాడితో సహా. వీరన్న తాత ఇంటనే ఫోర్సెప్స్ సాయంతో బిడ్డని బయటికి తీసారు, మల్లికి కొంచెం కుట్లు పడ్డా, తల్లీ బిడ్డా క్షేమంగా బ్రతికి బయటపడ్డారు.

"మా బిడ్డని బ్రతికించిన బగమంతుడు నువ్వే'నంటూ

వీరన్న కాళ్ళ మీద పడిపోయారు. మల్లయితే కన్నీళ్ళతో తాత చెయ్యి పట్టుకుని 'నా బిడ్డకి నీ పేరేడతా తాతా' అంటూ ఏడ్చేసింది." అలగెలగా! ఆ సిమ్మాద్రి అప్పన్నకి మొక్కీసినా, ఆ తండ్రి పేరేట్టాల" అంటూ కొడుకుని చేతిలోకి తీసుకుని మురిసిపోయాడు అప్పన్న.

"సిమ్మాద్రవన్నే వీరన్న రూపాన నీ పెళ్ళాం బిడ్డల్ని కాసేసినాడెస్, ఆడు ' వీర సిమ్మాద్రి" అని కళ్ళొత్తుకుంటూ అడిగాడు కొండ

" తాతా! అక్కడ ఆ దారుందని నీకెట్ట ఎరుకైందీ? "

"అదా! అది ఎప్పటినుంచో నే తవ్వుకొచ్చినా, ఇప్పటీ మల్లి లానే, నా పెళ్ళాం మల్లమ్మ నిండు గర్భిణీ , ఇట్టాగే ఓన .. ఊరూ ఏరూ ఏకమై, ఏటి సెయ్యాలో దిక్కు తోచక తోపుడు బండీ మీదేసుకుని తోసుకుంటా పొయ్యా. ఎంబడి వచ్చినోళ్ళు సానా పయత్నం సేసినారు కానీ పొలిమేర దాటకుండనే నెప్పులెక్కువై, రగతం ఎల్లువై పానాలిడిసింది .. పానానికి పానమైన పెళ్ళాం, లేక లేక కడుపున బడ్డ బిడ్డా అలా అర్ధాంతంగ పోయినాక నాకు బతుకుమీదె ఎగటు పుట్టె, దేనికింక బతకాలా! అని రోజు పొగిలి పొగిలి ఏడ్చేటోన్ని. వోట్ల కోసం ఎంటబడే మారాజులందరినీ దేబిరించినా, ఎలచ్చన్లప్పుడనే గాదు మామూలప్పుడు గూడ మమ్ముల్ని మనుషులుగ సూడండయ్యా, ఓరి పానం మీకొచ్చినా వైద్దెం నేదు, పావంచికంతో మాకు సంబందం నేదు .. ఇదెక్కడన్నాయం అయ్యా? అని మొరెట్టుకున్నా, ఓ పాలి ఎలచ్చన్ల ముంగట డొంకల్ని కొట్టేపించి మట్టి దారేసినారు .. రెండు ఓనలదేతలికి అదట్టనే కొట్టుకుపోనాది. ఆళ్ళెవరో ఏయుకపాతే పోనీ, ఇది మనోనరం, ఆ కొండని దొలుసుకుంటాపోతే పక్కూరికి దగ్గరలో దారవుతదీ' అని అందరిని బతిమిలాడినా ఓరు ఇనలే, నవ్వుతాలుగ తీసిపారేసినారు, ఆ రోజు నుంచీ కొన్నాళ్ళు పిచ్చోని లెక్క తిరిగినా. నాకొకటే యావ .. ఎట్టన్నా' ఆ కొండని దొలిచి దారి సెయ్యాలా' అని ఆ రోజునుంచీ కొంచెం కొంచెంగ తవ్వుకుంట పోయినా .. ఊరోళ్ళు ఒకళ్ళిద్దరు సూసినా అది పిచ్చోడి సేస్టగానే లెక్కేసి వదిలేసారు. ఈ రోజు తొరగ కబురంది డాట్రమ్మ రానాకి అదే దారయ్యింది. నా మాటిని ఇప్పటికన్నా పదిమంది పోగై ఆ దారి పెద్దది సేస్తే .. మనకోరి సాయం, దయా అక్కరనే..." బక్కచిక్కి ఒంటూపిరితో ఉన్న వీరయ్య మాటల్లోని నిజం, ఎప్పుడో పాతికేళ్ళనాటి ఆ గతం తామందరికీ ఇప్పుడెందుకు చూపించాడో కూడా వారందరికీ అర్ధం అయింది.

◆◆◆

"అలా బతికి బట్ట కట్టిన ఆ 'వీర సింహాద్రి' నేనే. చెట్లంటా, పుట్లంటా తిరుగుతూన్న నన్ను కామేశం మాష్టారు గురుకుల పాఠశాలలో చేర్చారు. మా అమ్మ తనకు తీరని కోరికగా మిగిలిపోయిన ' చదువు ' కనీసం నాకైనా రావాలని, ఏడ్చి మొత్తుకుని, నాన్నతో గొడవపడి ఆ పాఠశాలలో చేర్చడం జరిగింది. చిన్నప్పటినుంచీ ఈ కథ మా అమ్మనోట ఎన్నిమార్లు విన్నానో, ఎప్పుడూ అనేది నువ్వు బాగా చదువుకుని గొప్పోనివై మన ఈ బతుకుల్ని మార్చాలిరా అని. బాగా చదువుకున్నా. మనకి స్వరాజ్యం వచ్చి ఇన్నేళ్ళైనా ఈ కథ పునరావృతం అవుతూనే ఉంది. గిరిజన ప్రాంతాలూ, మారుమూల పల్లెలూ బాగుపడలేదు సరికదా కుళ్ళు రాజకీయాలతో, నాగరికత మోజుతో ఇటు స్వచ్ఛతనీ, ప్రశాంతతనీ కోల్పోయి 'రెంటికీ చెడ్డ రేవడి' లాగైపోయాయి.

విష జ్వరాలకీ, ముంపులకీ, ఇలా బిడ్డల్ని కనే క్రమంలో సరైన సమయానికి ఆసుపత్రి చేరే దారిలేక చేతులపైనా, డోలీల్లోనూ మోసుకెళ్ళే ' (న్యూస్ ఐటంస్ ) ' వార్తలుగా' గా మిగిలిపోయాయి. అది మారాలి .. అలా మార్చుకునే శక్తి మనకుందని మనకు తెలియాలి, ఆ దిశగా అడుగులు పడాలి. మన కనీస అవసరాలకోసం మనమే నడుం కట్టాలి. మనకున్న ఏకైక అవకాశం ' చదువు ' దాన్ని అందిపుచ్చుకుని మనల్ని మనం ఉద్ధరించుకుంటూ, మన వాళ్ళనీ, ప్రాంతాలనీ కూడా బాగు చేసుకోవాలి.

ఏళ్ళ క్రితం ఓ చదువూ సంధ్యా లేని వానికున్న పట్టుదలా, స్ఫూర్తి మనకు లేవు. ఉంటే ఆ దారి ఇలా అసంపూర్తిగా మిగిలిపోయి మూసుకుపోయేది కాదు. కష్టం వస్తే ఆ క్షణం స్పందించడం, ప్రాణాలు పోతే పరిహారాలందుకోవడం. అంతేనా? మన సమస్యలకు శాశ్వత పరిష్కారం అంటూ ఏం లేదా? ఆ దిశగా అడుగులు వేద్దాం. వాటికి కావలసిన అనుమతులన్నీ కలక్టర్ గారి ద్వారానే తీసుకున్నా, ప్రభుత్వ సాయం కూడా అందుతుంది, ఎవరో వచ్చి చేస్తారని ఏళ్ళ తరబడి ఎదురు చూడడం మూర్ఖత్వం. చేయి చేయి కలిస్తే సాధించలేనిదంటూ ఏం లేదు. మనూరే కాదు .. మన్యంలో అందరినీ కూడగట్టుకుని, ప్రకృతిని పాడు చేయకుండా, బడి, వైద్యం, తారురోడ్, తాగునీరులాంటి కనీసావసరాలను తీర్చుకుందాం." కంగున మోగింది అతని స్వరం ఆ కొండల్లో.

" అవును .. మాటల్లో కాదు చేతల్లో చూపుదాం" ఆ బాస ముక్తకంఠంగా ప్రతిధ్వనించింది. ◆

## సాహిత్య ప్రస్థానం జూన్ 2020 పురస్కారాలు

**అమ్మకేమైంది?**
కథకు: రూ.500/-
రచయిత: చేలిక రాజేంద్రప్రసాద్

**లాక్‌డౌన్ కాలం**
కవితకు : రూ. 500/-
రచయిత : ఆవుల చక్రపాణి యాదవ్

కథకు కల్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం
కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం, చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.

**- ఎడిటర్**

## కనిపించని శత్రువు

కరోనా కవిత

**- మాల**

సరిహద్దుల్లో శత్రువు కనిపిస్తాడు..
కంచె వేసి నిలవరించొచ్చు
యుద్ధం చేసి తుద ముట్టించొచ్చు
కానీ.. నువ్వు...
కంటికి కనపడవు
ఎటువేపు నుంచి దాడి చేస్తావో తెలీదు
ప్రపంచం మొత్తాన్నీ.. ఒక్క వేటుతో
రెక్క తెగిన పావురం 'లా మార్చేసావ్
ఆత్మీయుల్ని ఆదరంగా స్వాగతించలేం
ఏ 'వేదన'యినా...అయినవాళ్లతో
పంచుకోలేం
సర్వం ధారపోసిన అమ్మకి సైతం
తలకొరివి పెట్టి ఋణం తీర్చుకోలేం
అన్నీ తానై పెంచిన నాన్న పాడెని సైతం
భుజానికెత్తుకోలేం....
గుక్క పట్టి ఏడ్చే కన్న బిడ్డని సైతం
గుండెకు హత్తుకుని ఓదార్చలేం
సీతాకోక చిలుకల్లా ఎగిరే చిన్నారులంతా
కిటికీ చువ్వల్లోంచి ఖైదీల్లా చూస్తుంటే..
కాయకష్టం చేసుకునే శ్రమజీవులంతా
ఏ పనీ దొరక్క పస్తులుంటూ
కన్నీటి జాగారం చేస్తుంటే
పాలప్యాకెట్లు కూడా '
అణు బాంబు'లా
భయపెడుతుంటే
క్షణమొక యుగంలా........
అసలు... ఏం పాపం చేశామని..
నువ్విలా
మా స్వేచ్ఛనీ, సంతోషాన్నీ,
నిర్భయత్వాన్నీ
అన్నిటినీ కాలరాస్తున్నావ్? !
కరోనా...!
జల్దీ చలేజావోనా...!!
ఫిర్ కభీ నహీ ఆనా...!!!

## తెగిన గాలిపటం!!

కవిత

**- అనిత దావత్**
9394221927


అమ్మ జన్మనిస్తే
నాన్న ఆ జన్మకు సార్థకత
చేకూర్చుతాడు
మనకు నడక నేర్పి
నడవడికను సరిదిద్దుతాడు
తన భుజాలమీద ఎత్తుకుని
అందుకోవాల్సిన శిఖరాల
అంచులను చిన్నప్పుడే చూపుతాడు!

ఓటమిని ఓడించడమెలాగో
విజయాలను పాదాక్రాంతం
ఎలా చేసుకోవాలో నేర్పుతాడు
ఓర్పు మనిషిలో ఎంతటి
మార్పు తెస్తుందో చెప్పడానికి
తానే ఒక పాఠంగా మారుతాడు!

మన ప్రగతికి తొలిమెట్టుగా నిలిచి
ఎక్కిన మెట్లను మరిచిపోయిన
సంతానాన్ని మౌనంగా క్షమిస్తాడు!
బాధను గుండెల్లో దాచుకొని
బాధ్యతను భుజాన వేసుకుని
బిడ్డల జీవితాలకు వెలుగుబాట
పరుస్తాడు!!

పిల్లల ఆశల గాలిపటాలకు
దారమై నిలిచిన నాన్న
వృద్ధాప్యంలో ఆధారం దొరక్క
తెగిన గాలిపటమై
ఎండిన ఏ కొమ్మకో
రెపరెపలాడతాడు!!





# సామాజిక రోగాలు తిరగబెట్టకుండా నివారించే సిద్ధాంతం అది!

## - రంగనాయకమ్మ

ఇంటర్వ్యూ: గోవిందరాజు చక్రధర్

♦ ***ఏయే ప్రభావాలు, అనుభవాలతో ఈ రంగనాయకమ్మ తయారయ్యారు?***

■ ఏ రచయిత అయినా, తన చిన్నతనపు ప్రభావాల తోటే, అనుభవాల తోటే, ప్రారంభమవుతారని నా అభిప్రాయం. నా విషయంలో కూడా అలాగే జరిగినట్టు వుంది. కానీ, ఆనాటి భావాలూ, కొన్ని రాతల తర్వాత కలిగిన భావాలూ, పూర్తిగా ఒకటే కాదు. 20ఏళ్ళ జీవిత కాలం వరకూ, 'నాస్తికత్వం' అనే మాట నాకు తెలీదు. ఆ తర్వాతే, కందుకూరి వీరేశలింగంగారి ఆత్మకధలో తర్కాలు చూసినప్పటినించే ఆ ప్రశ్నలు ప్రారంభం అయ్యాయి– అనుకుంటాను. ఆ రచయిత భక్తుడే. నాలో, తర్కమేగానీ, భక్తి నిలబడలేదు. ఆ తర్వాత, 'మార్క్సిజం', నాస్తిక భావాల దగ్గిరే ఆగిపోని వ్వకుండా, వాటితో పాటు, సమాజంలో వున్న 'శత్రువర్గభావాల్ని' తెలుసుకునే దృష్టినిచ్చింది. ఈ ప్రభావాలే చెప్పగలను.

♦ ***స్వేచ్ఛాజీవులైన మీరు మార్క్సిజం అనే ఒక 'గుంజకు కట్టేసుకోవడం' వల్ల మీ స్వేచ్ఛా ఆలోచనా ప్రవాహానికి అవరోధం కావడం లేదా?***

మీరు, ఇలా అన్నారు: 'మార్క్సిజం' అనే ఒక గుంజకు కట్టుకోవడం వల్ల మీ స్వేచ్ఛా ఆలోచనా ప్రవాహానికి అవరోధం కావడం లేదా?– అని. 'మార్క్సిజం' అనే ఆ గుంజే 'సత్యం' అనుకోండీ! 'సత్యం' చుట్టూ తిరగడంవల్ల, తప్పు ఆలోచనలు పోయి, మంచి ఆలోచనలు ఏర్పడతాయి కదా? మీ దృష్టిలో, 'మార్క్సిజం' 'సత్యం' కాదనుకుందాం. మీరు 'సత్యం' అనుకున్న దాన్ని దేన్ని అయినా చెప్పండి! అప్పుడు, ఆ సత్యం చుట్టూ తిరగవలిసిందే కదా? ఒకవేళ మీరు, 'ఏదో ఒకే సత్యం వుంటుందని నేననుకోను. వేరువేరు సత్యాలు వుంటాయి' అంటారా? – అవి అన్నీ సత్యాలే అయితే, అటు వంటివి అన్నీ ఒకే సత్యంలో భాగాలే అవుతాయి కదా? లేకపోతే, అవి వేరు వేరు సత్యాలైతే, వాటి మధ్య ఒకదాన్ని ఒకటి తిరస్కరించే వైరుధ్యాలు వుంటాయి కదా? ఏదైనా నాలుగైదు సత్యాల్ని, చూపించండి. 2, 3 సత్యాల్ని అయినా నిర్ణయించుకుని మీరే ఆలోచించండి! 'సత్యం' అనేది, ఒకటే వుంటుందా? ఎన్ని రకాలుగా అయినా వుంటుందా? – ఇదీ అసలు చర్చించ వలిసిన విషయం.

♦ ***మీ విశ్వాసాలతో, నమ్మకాలతో మీరు వ్యక్తిగతంగా కోల్పోయిందేమిటి? బాధపడిందేమిటి? సమాజానికి జరిగిందేమిటి?***

■ నా విశ్వాసాల్లో, నమ్మకాల్లో, ప్రధానమైన విషయాలు: 'ప్రకృతి' విషయాల్లోగానీ, 'సమాజపు' విషయాల్లోగానీ, హేతుబద్ధ దృష్టే. ఒకరు, 'నేను అలా వున్నా'నని చెప్పు కోవడం కాదు, ఇతరులు తెలుసుకోవాలి. నా విశ్వాసాలు, హేతుబద్ధ తర్కం వేపు మారితే, వ్యక్తిగతంగా పోయిందేం వుంటుంది? తల్లిదండ్రులనించీ, బంధువులనించీ, దేనినించీ పోయిందేమీ లేదు. తెలుసుకున్న మంచి గ్న్యానంవల్ల, బాధ ఎందుకు

వుంటుంది. సంతోషమే వుంటుంది గానీ? సమాజానికి జరిగిందేమిటి అంటారా? నా భావాల మార్పు వల్ల, సమాజానికి ఏదో జరిగిపోయింది – అంటానా? 'శత్రువర్గాల సమాజం' మారిపోయే తర్కాన్ని చెప్పింది మార్క్సు, ఎంగెల్సులు. అయినా, దాని వల్ల 'సమాజంలో మార్పు జరిగిపోయింది' అంటానా? 'జరుగుతుంది' అనాలి. నా భావాలన్నీ ఆ మార్పు కోసమే.

♦ *వాలామంది రచయితలు మధ్యలోనే అస్త్ర సన్యాసం చేశారు. మీరు మాత్రం ఇన్ని దశాబ్దాలుగా నిర్విరామంగా రాస్తూనే ఉన్నారు. కారణాలు?*

■కొందరు రచయితలు, మధ్యలో రాయడం మానేస్తే, దాన్ని 'అస్త్ర సన్యాసం'గా భావించ కూడదు. ఎవరి సమస్యలు ఎలా వున్నాయో, తెలియని విషయం అది. నేను రాస్తూనే వుండడానికి కారణం, మొదట్లో అయితే, అది కొంత ఆసక్తే. నేను బైటి వుద్యోగంలో లేను. ఇంటి పనులు కూడా నా ఒక్కదాని మీదే ఆధారంగా వుండవు. ముఖ్యంగా, 'మార్క్సిజం' తెలిసిన తర్వాత, దాన్ని గురించి చెప్పకుండా, ముగించడం ఇప్పట్లో వుండదు. పాఠకులెందరో వాళ్ళ సమస్యల గురించి చెప్పుకుంటారు నాకు. అవన్నీ సమాజంలో చర్చించ వలిసిన విషయాలే. వాళ్ళు చెప్పిందే చెప్పినట్టు, రచనగా ఏర్పడదు. కానీ, వాళ్ళ సమస్య తెలిస్తే, అది ఒక రచనకి ఆధారం అవుతుంది. ఏ రచయిత అయినా, ఎంత కాలం అయినా, రాయగలరు. రాయడానికి, అన్ని విషయాలు వున్నాయి. ప్రచురించే పత్రికలు ముఖ్యం. లేదా, పుస్తకాల్ని ప్రింటు చేయడం ముఖ్యం. ఈ అవకాశాలు నాకు మొదటి నించీ వున్నాయి. కారణాలు నాకు తెలీదు. నా రాతలు ఆగిపోవలిసిన ఇబ్బంది ఇప్పటికీ రాలేదు. కాబట్టే రాస్తున్నాను.

♦ *చలం చివరి రోజుల్లో రమణాశ్రమంలో చేరారు. కొ.కు. కమ్యూనిజం నుంచి కాషాయం వైపు మళ్ళారంటారు. వయసుతోపాటు రంగనాయకమ్మలో కూడా ఇలాంటి మార్పులేమైనా మొదలయ్యాయా?*

■రంగనాయకమ్మ రాసిన పుస్తకాలు చదివినవాళ్ళూ, చదివి అర్థంచేసుకున్న వాళ్ళూ, అడిగే ప్రశ్న కాదు ఇది. నా రాతల్ని అర్థం చేసుకునివుంటే, ఈ సందేహం రాదు. అసలు ఒక వ్యక్తి, తనకు సరైన భావాలుగా అనిపించిన వాటినే భావిస్తే, అవి నిజంగా సరైనవే అయితే, ఆ వ్యక్తి, ఎప్పటికీ వెనక్కి తిరగడు. చలం అయితే, మొదటినించీ నాస్తికుడు కాదు. కొన్ని తర్కాలు చేసిన రచయిత, అంతే. కాబట్టి తర్వాత కూడా ఆయన తన నమ్మకాలనే స్థిరం చేసుకున్నారు. రమణ భక్తుడయ్యాక కూడా స్త్రీ–పురుషుల సమానత్వం గురించి ఆయన భావాలు మారలేదు. మీరు చెప్పిన రెండో రచయిత, 'దెయ్యాలూ – దేవతలూ కూడా భౌతికవాదమే. అలా అర్థం చేసుకోవాలి' అంటూనే, రెండో వేపు 'కమ్యూనిజం' అంటూ వుంటే, అతన్ని చలంతో సమానం చేసి పోల్చడం తప్పు! చలంలో, వైరుధ్యంలేదు. కానీ, ఆ రెండో రచయితలో వున్నదంతా వైరుధ్యమే. నా సంగతి అంటారా? మీరే నిర్ణయించుకోండి! నన్నడక్కూడదు.

♦ *మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిన వ్యక్తులు, రచయితలు?*

■కందుకూరీ, గురజాడా, శ్రీపాదా, చలమూ, – వీరే నాకు ప్రధానం. మూర్ఖత్వపు విషయాల మీద తర్కాలు వుండా లనేది, వారినించీ నేర్చినది. 'సమానత్వం' విషయాలు కూడా కొన్ని. అది ఎలా సాధ్యమో వారు స్పష్టంగా చెప్పిన విషయాలు లేవనుకోండీ.

♦ *భావి తరాలకు మీరు ఎలా గుర్తుండాలను కుంటున్నారు?*

■ *'నన్ను గుర్తు పెట్టుకోవాలని' అనుకుంటే, గుర్తుపెట్టుకుంటారా?* వాళ్ళకి నచ్చితే గుర్తు పెట్టుకుంటారు, లేకపోతే లేదు. అయినా, ఒక మనిషిని స్నేహితులు గుర్తు పెట్టుకున్నా, ఎన్నాళ్ళు పెట్టుకుంటారు? వాళ్ళు బ్రతికి వున్నన్నాళ్ళే కదా? వాళ్ళేపోతే, ఇంకెలా గుర్తు పెట్టుకుంటారు? అయినా, గుర్తుపెట్టుకోవలిసింది, 'భావాల్ని!' ఆ భావాల్ని ఇచ్చిన మనిషి లేకపోయినా, ఆ భావాల్ని గుర్తుపెట్టుకుంటే, ఆ మనిషిని గుర్తుపెట్టుకున్నట్టే. 'శత్రు వర్గసమాజం'లో, మంచి భావాలు ఇచ్చినవాళ్ళని, కొందరు, ఆ భావాల మీద ప్రేమతో గుర్తు పెట్టుకుంటే, కొందరు, ఆ భావాల మీద ద్వేషంతో గుర్తు పెట్టుకోవచ్చు.

♦ *ఇప్పటికీ మీరు మార్క్సిజమే 'సర్వరోగనివారిణి'గా భావిస్తున్నట్లున్నారు?*

■'సర్వరోగనివారిణి' అంటే, ప్రకృతిలో, అన్ని రోగాలనూ నివారించే ఒకే 'మందు' వుండదు. కానీ, 'సమాజం'లో వున్న సమస్యలకైతే 'సర్వరోగనివారిణి' అయిన సిద్ధాంతం వుంది. అదే మరి, మార్క్సిజం! ఇది ఏమిటో తెలిస్తేనే, దాన్ని 'సర్వరోగ నివారిణి' అనగలం. ఇప్పటికే కాదు, ఎప్పటికీ మార్క్సిజం

సర్వరోగనివారిణే. ఎందు కంటే, సామాజిక రోగాలు తిరగబెట్టకుండా నివారించే సిద్ధాంతం అది!

**♦నాటి భావ కవిత్వం, అరసం – విరసం ఉద్యమాలూ, దళితవాదం, స్త్రీ వాదం, వగైరాలన్నీ, ఆయా కాలాల ప్రజల ఆకాంక్షల, సామాజిక పరిస్థితుల ప్రతిరూపాలనుకోవచ్చా? ఈ బ్రాండెడ్ సాహిత్యంతో కలిగిన ప్రయోజనాలు?**

■ఏ నాటి ఉద్యమాల్ని అయినా, ఆనాటి సమాజంలో జరగవలిసిన మార్పులు జరగాలనే లక్ష్యంకోసం సాగేవిగానే భావించవచ్చు. అయితే, ఆ ఉద్యమ కారులకు, ఆ మార్పుల కోసం హేతుబద్ధమైన అవగాహన వుందో లేదో, అది ముఖ్యం. మీ ప్రశ్నకు కొంత పొడుగు జవాబు అవసరం కావచ్చు.

'భావకవిత్వం' అనేది, పాత సాంప్రదాయ కవిత్వంనించీ భిన్నంగా, కొత్త కాలానికి తగ్గట్టు, రూపంలోనూ, విషయంలోనూ, మార్పు ఏదో వచ్చినట్టుగా నాకు కనిపిస్తుంది. దేవుళ్ళనీ, మహిమల్నీ వదిలి, ప్రేమా, విరహం, శృంగారం, దేశభక్తీ, సంఘ సంస్కరణా, ప్రకృతివర్ణనా, మొదలైనవాటిని కవి, తన భావాలతో వ్యక్తం చేసినట్టు. బ్రిటీషు పెట్టుబడిదారీ పాలన ప్రభావంతో వచ్చింది కావచ్చు, భావకవిత్వం. భావకవులు ఎక్కువగా తమ సొంత గొడవలే రాసుకున్నారన్నట్టు, ఆ కవిత్వాన్ని 'ఆత్మాశ్రయ కవిత్వం' అని కొందరు అంటారు. కొన్నిసార్లు, ఆ కవిత్వాల్ని అర్థమయ్యేవి కావంటారు. అందుకే 'పెళ్ళిచేసిచూడు' సినిమాలో, ఒకపాటలో, "భావకవులవలె, ఎవరికి తెలియని ఏవో పాటలు పాడాలోయ్" అని చక్కని పాట వుంటుంది.

'అరసం' అంటారా? రష్యాకి, సోషలిస్టు దేశంగా పేరున్న కాలంలో, సోషలిజం, కార్మికులూ, కర్షకులూ, కష్టజీవులూ– అంటూ అప్పటికిలేని కొన్ని అభ్యుదయభావాల్ని ప్రచారంచెయ్యడానికి ఏర్పడ్డ సంఘం, అభ్యుదయ రచయితల సంఘం. ఇది, అప్పుడున్న కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకత్వంలో నడిచిన సంస్థ. ఆ రోజుల్లో చాలా మంచి భావాల పుస్తకాలు వచ్చాయి. సోషలిజం, కమ్యూనిజం అనే కొత్త ఆలోచనలు జనాలకు ఎంతో కొంత పరిచయం అయ్యాయి, అవి తగినంతగా కాకపోయినా. రష్యా బలహీన పడి, ఇక్కడి ఉద్యమాలూ బలహీనపడ్డాయి. చైనా సాంస్కృతిక విప్లవం ప్రభావంతో, 'నూతన ప్రజాతంత్ర విప్లవం' అనీ, 'దీర్ఘ కాలిక సాయుధ పోరాటం' అనీ – కొత్త నినాదాలు ప్రచారంలోకి వచ్చాక, 'విరసం' ఏర్పడిందనుకోవచ్చు. దోపిడీ, అసమానత్వం లాంటి సమస్యలు, ఎప్పటికంటే తీవ్రంగావున్న దశలో, నక్సల్బరీ ఉద్యమం వల్ల, ఒక రకమైన "విప్లవ" భావాలు బాగా ప్రచారం అయ్యాయి.

వాటిని 'విరసం', ఎటు వంటి విమర్శా లేకుండానే, మార్క్సు – ఎంగెల్సుల రచనలతో సంబంధం లేకుండానే, యాంత్రికంగా అనుకరించినట్టే అనిపిస్తుంది. చెరబండరాజు రాసిన 'పోలీసుపాటా', వంగపండుప్రసాదరావు రాసిన 'ఎర్రజండా' పాటేగాక అనేక పాటలూ, గద్దర్ రాసిన కొన్ని పాటలూ, మరికొందరు రాసిన కొన్ని పాటలూ– చాలా శక్తివంతంగా వుంటాయి.

కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడడం వల్లే, దళితవాదం, స్త్రీవాదం వంటివి తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. అప్పటిదాకా కమ్యూనిస్టులుగా, విప్లవకారులుగా తమని చెప్పుకున్న కొందరు, దళిత ఉద్యమకారులుగా, స్త్రీ వాదులుగా మారారు. ఆ వాదాలతో చెయ్యగలిగిందేమీ లేదు. కమ్యూనిజాన్ని 'ఫ్యాషన్'గా భావించినవాళ్ళకి, ఆ ఫ్యాషన్ పాతపడినట్టే కనపడి, కొత్త ఫ్యాషన్లను వెతుక్కున్నారు. దళితవాదుల దృష్టి ఎంత సేపూ రాజ్యాంగయంత్రంలో (ప్రభుత్వంలో) చోటు సంపాదించడం మీదా, రిజర్వేషన్ల కొనసాగింపు మీదా, వుంటుంది. అంతేగానీ, 'దోపిడీ వ్యతిరేక దృష్టి' వుండదు. స్త్రీ వాదులు, బూర్జువా ఆస్తి సంబంధాలనుగానీ స్త్రీ–పురుషుల మధ్యవున్న అసమాన శ్రమ విభజననుగానీ పట్టించుకోరు. పురుషాధిక్యత (పేట్రియార్కీ) అని పదేపదే వల్లించినా, దానికి వున్న 'మూలాల' మీద, దృష్టిపెట్టరు. లైంగికత, బహిష్టు, గర్భధారణా, లైంగిక స్వేచ్ఛా వంటి వాటి గురించి కవిత్వాలు రాసి, అన్నిటినీ ధిక్కరించినట్టూ, ఎటువంటి దాపరికమూ, సంకోచమూ లేనట్టూ, ప్రకటించడం చేశారు, చేస్తారు. కానీ, ఇంటాబైటా వున్న అసమాన శ్రమవిభజన మాటే ఎత్తరు. అమలులో వున్న రాజ్యాంగాన్ని 'దోపిడీ రాజ్యాంగం'గా గుర్తించరు.

అందుకే దళితవాదానికీ, స్త్రీ వాదానికీ, యూనివర్సిటీలలో 'గౌరవనీయ' స్థానాలు దొరుకుతాయి. 'దళిత్ స్టడీస్' అనీ, 'విమెన్ స్టడీస్' అనీ, అలా కొన్ని అధ్యయన కేంద్రాలు కూడా ఏర్పడ్డాయి. – మీ ప్రశ్నలో అంశాల కోసం, ఈ విషయాలు కొన్ని అయినా ప్రస్తావించక తప్పదు కదా?

***(ఆంధ్రజ్యోతి దినపత్రిక 15.06.2020)***

♦

## చివరి వసంతం

- సునీత గంగవరపు



అక్కడ..
ఆ ఆవరణలో వున్న తోట
ఎప్పుడూ నవ్వుతూ వుండేది
అతడి కళ్లలో ఆనందమై
కదులుతూ వుండేది
అద్భుతంగా అక్కడి పువ్వులు
విచ్చుకున్న పూట..
వెన్నెల కుప్పలు రాసిపోసినట్లుండేది
కొమ్మలకు కట్టిన రెమ్మల ఊయలలు..
ఆకుపచ్చని అలల్లా ఎగసిపడేవి
ఆ తోట మధ్యలో అతడు
ఒంటరిగా కూర్చొనేవాడు
మరపురాని తన వికృత గతాన్ని
అంతర్లీనంగా ప్రవహించే
నైరాశ్యపు చీకటిని
కాసేపు అలా..
కాలానికి వదిలేసి
అతడా పూల పరిమళాలతో
సహవాసం చేసేవాడు

గాలి వేసే వీలలను
కొత్త ఉత్సుకతతో ఆలకించేవాడు
పగిలిన మబ్బుల్లోంచి వడుస్తున్న
వాన చినుకులను
దోసిళ్లపట్టి స్వాగతించేవాడు
ఎక్కడో పోగొట్టుకున్న
వెలుగు ముక్కలను
అతడా మొక్కల పాదుల్లో
వెతుకుతుండేవాడు
ఏమయిందో..కానీ..
ఇప్పుడా తోట పూయడం లేదు
ఏ కొమ్మా పలకడంలేదు
నిన్నటి దాకా అలరారిన చివురు
గుబురులన్నీ
నేడు నిశ్శబ్దమై..నిశ్చేతనమై
తలలు వాల్చాయి

అయినా.. అతడు మాత్రం
అక్కడే వున్నాడు
చెంపకు చేయి ఆన్చి
దిక్కుతోచక..దిగులు దృక్కులతో
రేపటి వసంతానికై కలలు కంటూ
మసకవేకువ రాసిన మంచు గేయమై..
ఎర్రని గాయమై
అతడు ఆ పరిసరాల్లో నే
పరిభ్రమిస్తున్నాడు ♦

---

## త్రిభుజాలు

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201



త్రిభుజాలు ఎన్నిరకాలంటే
అవి సమబాహు సమ ద్విబాహు
విషమ బాహు అని వ్రాస్తే
మూడుకి మూడు మార్కులు
వచ్చినప్పుడు సంతోషమేసేది
నూటికి నూరు మార్కులు
సాధించే అవకాశం
లెక్కల్లోననే సరికి మక్కువ పెరిగింది
లెక్కలతో పాటు సాంఘిక
శాస్త్రమంటే వల్లమాలిన ప్రేమ
ఆ రెండూ చెప్పే మాష్టార్లంటే
ఎనలేని గౌరవం
సమబాహు విషమబాహు త్రిభుజ
లక్షణాలు వ్రాస్తుంటే సాంఘిక
శాస్త్రానికి అన్వయించుకునేది

అన్ని భుజాలు సమానమేననే
సమబాహు త్రిభుజంలో
సామ్యవాదం సాక్షాత్కరించేది


విషమబాహులో తలాతోకాలేని
చాతుర్వర్ణ వ్యవస్థ కన్పించేది
శీర్షం కేంద్రకంగా త్రిభుజ నిర్మాణం
చేస్తుంటే వర్ణవ్యవస్థ పునాదిని
కూలదోయాలన్పించేది
సమాజంపైన కూకోని శీర్షం
పెద్దభుజాన్ని సైతం శాసించటం
మింగుడుపడకపోయేది

త్రిభుజాన్ని ముక్కలు చేస్తుంటే
విషమ చతుర్భుజమే అగుపడేది
విషమ వ్యవస్థలో వున్నందుకేమో
ఆ గీతల్లో మా గీతలు చూసుకునేది
గీతలు మార్చే గీతాలు వ్రాసుకునేది
ఆ గీతాలకి బహుమానాలు రాకున్నా
చప్పట్లు మోగేవి
పెద్ద భుజబలమెక్కువ కదా !
భుజాలన్నీ ఏకమై శీర్షాన్ని
శీర్షాసనమేయిస్తే చూడాలని వుంది ♦

విశ్లేషణ

# మౌనాన్ని మాట్లాడిస్తున్న కవి

- డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి




సురగౌని రామకృష్ణ



*రామకృష్ణ నేటి సీమగొంతుక అది నిర్భయగొంతుక. భావం, భావుకత చెట్టపట్టాల్ వేసుకొని నడిచే కవిత్వం రాశాడు. పాఠకులకు అసక్తి కలిగించే కవిత్వశైలి ఆయనది. రామకృష్ణ కొత్తగొంతుక అయినా జంకుగొంకు లేని గొంతుక.*

***మౌనాన్ని***
***కుండలా బద్దలుకొట్టి***
***మాట్లాడటం నేర్చుకోవాలి***
***చరిత్రగుండెలపై***
***నువ్వొక చెరగని శిలాక్షరం కావాలి***
**(మౌనం మాట్లాడిన వేళ: పు 15)**

ఇ.రాఘవేంద్ర, పాలువ శ్రీనివాస్, కొత్తపల్లి సురేశ్, చింతాలక్ష్మీనారాయణ, కొండసాని రజిత, ఎ.ఎ.నాగేంద్ర, రాయపాటి శివయ్య, కొండా సురేఖ వంటివాళ్ళు ఇప్పటి అనంతపురం జిల్లా వచనకవులు. ఈ తానులో పోగే సురగౌని రామకృష్ణ. మా విద్యార్థులుగా ఉండి కవులైన వాళ్ళలో రామకృష్ణ ఒకరు. ఈయన తనతొలికావ్యం "మౌనం మాట్లాడినవేళ"ను ఇటీవల ప్రచురించాడు. ఈ కావ్యమంతా చదివితే నాకనిపించింది రామకృష్ణ ఒక నమ్మకమైన కవి అని. ఎందుకంటే వస్తువు విశ్వమంతా విస్తరించింది. ఈయనకు తాను కవిననే స్పృహ ఉంది. ప్రపంచంలోని అనేకాంశాలను వైవిధ్యభరితంగా వస్తువుచేసుకునే సాంస్కృతికవైశాల్యం రామకృష్ణకుంది. ఈయన ఇరుకు సందులలో ఇరుక్కుపోయిన కవికాదు. ప్రపంచబాధనంతా తనబాధగా భావించే సంస్కారముంది. తనబాధనే ప్రపంచబాధగా చేసే ప్రయత్నం ఈయన చేయలేదు. అనంతపురం జిల్లా కవిత్వక్షేత్రాన్ని విస్తరింపజేస్తున్న కవులలో రామకృష్ణ ఒకరు కావడం గుర్తించవలసిన అంశం.

**కవిత్వ దృక్పథం:** *ఏకవికైనా కవిత్వంపట్ల కొన్ని అభిప్రాయాలుంటాయి. వాటిని కొందరు అభివ్యక్తంచేస్తూ కొన్ని కవితలు రాస్తారు. కొందరు రాయరు. రాయకపోతే వాళ్ళ కవిత్వంలోని అంతర్గత ఆధారాలను బట్టి వాళ్ళ కవిత్వాభిప్రాయాలను అర్థంచేసుకోవాలి. కవిత్వంమీద కవిత్వం రాస్తే పేచీయేలేదు. రామకృష్ణ తనదృష్టిలో కవిత్వమంటే ఏమిటో నాలుగైదు కవితలలో చెప్పాడు. కవిత్వంపట్ల రామకృష్ణకు నమ్మకమేకాదు, గౌరవంకూడా ఉంది, కవిత్వానికీ సమాజానికీ ఉండే సంబంధం ఈ కవికి తొలిదశలోనే అర్థమైంది. కవిత్వం సాధించే ప్రయోజనం కూడా రామకృష్ణకు బాగాతెలుసు. కవికి కవిత్వానికీ ఉండే సంబంధం ఈయనకు ఇంకా బాగా తెలుసు.*

***కవికి***
***ఆత్మబంధువు అక్షరమే*** **(పు 26)**

అనగలిగాడంటే రామకృష్ణకు అక్షరశక్తి తెలుసునని అర్థం.

***పదాలు***
***అనాథలు అభాగ్యులు సామాన్యులు***
***కళ్ళల్లో ఆశల్ని వెలిగించే***
***దీపస్తంభాలు*** **(పు 26)**

కవిత్వం ఎవరిపక్షం వహించాలో కవి స్పష్టంచేశాడు. కవిత్వంపట్ల రామకృష్ణకు కాల్పనికమైన ఊహలు లేవు. ఆచరణాత్మకమైన అభిప్రాయాలే ఉన్నాయి.

***తరతరాలుగా***

*ఆకలి తీర్చినమట్టిని*
*మహాశిల్పంగా మలచిన కవిత్వం*
*దేశానికి అవసరం* **(పు 1)**

అంటూసమాజంలో కవి, కవిత్వాల అవసరమేమిటో చెప్పాడు రామకృష్ణ. మానవజీవితంలో కవిత్వం నిర్వహించే బహుముఖీనమైన పాత్ర ఏమిటో తెలిసిన కవి రామకృష్ణ. తన కవిత్వమెలాంటిదో ప్రకటించాడు. ఆ ప్రకటన పాఠకులకు ఆయన మీద విశ్వసాన్నే కాదు, గౌరవాన్ని కూడా కల్పిస్తుంది.

*కొండశిఖరాన పగిలిన నీటికుండ*
*పొర్లిపొర్లి స్వచ్ఛమైన నదీప్రవాహమైనట్లు*
*సన్నని చినుకుల దారంపోగులతో*
*భూమ్యాకాశాలను కలిపి*
*పల్చటి మంచుతెరలు కుట్టినట్లు*
*ఇదే నా కవిత్వం*
*ఇది నా కవిత్వతత్వం* **(పు 54)**

ఇది కవి పలికే ప్రగల్భం కాదు. కవితను తాను నిర్వచించుకోవడం.

**సమాజసందర్భనం:** కవికి తాను నివసించే సమాజం, తానుపుట్టిన దేశం – వీటిపట్ల, వీటి, తీరుతెన్నుల పట్ల ఒక అవగాహన ఉండాలి. ఈ అవగాహన ఆరాధనాత్మకంగా ఉంటూ జబ్బలు చరిచేదైతే అది పురాణమో, ప్రబంధమో అవుతుంది. ఈ అవగాహన విమర్శనాత్మకంగా ఉంటే ప్రగతిశీల కావ్యం అవుతుంది. రామకృష్ణకు తన సమాజంపట్ల తన దేశం పట్ల విమర్శనాత్మక దృక్పథమే ఉంది.

*ఇవాళ దేశం పరాయిదేశాల*
*కబేళాకు తరలించబడుతూంది*
*రేపటి తరానికి మిగిలేది*
*ఒట్టి ఎముకలగూడె* **(పు 50)**

దేశం వెలిగిపోతోంది, అంతాబాగున్నారు, ప్రజలుసంతృప్తిగా ఉన్నారు వంటి ఊకదంపుడు మాటల్ని కవి నమ్మి ఉంటే ఇలా అనలేడు. నిరంతరం మహిళలమీద ఎక్కడో ఒకచోట దౌర్జన్యం, హత్యాచారం జరుగుతుంటే మానవత్వం ఉన్నవాళ్ళు మనసమాజాన్ని నాగరిక సమాజమనరు. విమర్శనాత్మక దృక్పథంగల కవి అసలు అనలేడు. 'సర్వసత్తాక' రాజ్యంగా నిర్వచించుకున్న దేశం తాకట్టులో భారతదేశంగా మారిందని తరిమెలనాగిరెడ్డి నాలుగుదశాబ్దాల క్రితమే ప్రకటించారు. అదికాస్త ప్రపంచీకరణ పుణ్యమా అని అమ్మకానికి భారతదేశంగా తయారయింది. రామకృష్ణ ఈ తలక్రిందులు రాజనీతిని తీవ్రస్వరంతో ఖండించాడు. సభ్యసమాజం తలదించుకునే విధంగా మనదేశంలో స్త్రీలమీద జరుగుతున్న దాడులను రామకృష్ణ తీవ్రధ్వనిలో వినిపించాడు. పాలకుల నిర్లక్ష్యాన్ని ఆక్షేపించాడు.

*ఈ దేశంలో ప్రభుత్వాలుకూడా*
*బలిసినోడి కామానికి*
*మెత్తని పరుపులవుతున్నాయి* **(పు 48)**

**స్థానికత నుండి విశ్వజనీనతవైపు:** ఏకవికైనా ఒక స్థలం, ఒకకాలం ఉంటాయి. అక్కడి నుంచే కవి సమాజంతో సంభాషిస్తాడు. రామకృష్ణ అనంతపురం జిల్లా కవిగా తన ప్రాంతాన్ని నిరంతరం పీడిస్తున్న కరువు వంటి సమస్యలను కవిత్వీకరిస్తూనే, దేశమంతా సంభవిస్తున్న పరిణామాలను కూడా తనకవిత్వంలో నంలీనం చేసుకుంటూనే, అంతర్జాతీయంగా కూడా దృష్టిని సారిస్తాడు. ఇది సమగ్రమైన కవి లక్షణం.

రామకృష్ణ తన అమ్మానాన్నలు, తనిల్లు, తనఊరు, నుండి మొదలై తనభాష, తన ప్రాంత వ్యవసాయం, భారతదేశంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ విధానం వంటి వాటిమీదుగా సిరియాయుద్ధం వంటి అంతర్జాతీయ అంశం దాకా కవిగా విస్తరించాడు. ఇది సమగ్రకవి లక్షణం.

**స్వవిషయం:** ప్రపంచీకరణ మనదేశంలోకి ప్రవేశించి, అనేకరంగాలను చిందరవందర చేసింది. కవులను ఒక్కసారిగా తమ బాల్యంవైపు, తమఇంటివైపు, తమ్మైఊరివైపు, తమప్రాంతంవైపు తిరిగిచూసేట్టు చేసింది. మహామహా కవులంతా తమ కలాలను ఇటువైపు తిప్పారు. రామకృష్ణ ఈ తానులో పోగయ్యాడు. 'వెన్నెలనది' కవితలో బాల్యంలోకి తొంగిచూశాడు. తన బాల్యంలోని ముద్దులను సుద్దులను వర్ణించి

*పచ్చనిచెట్టుపై పాలపిట్టనై పరవశిస్తూ*
*ఎగరకుండా ఎదగకుండా మిగిలిపోయిన*
*బాల్యంలోకి*
*తిరిగి ఇప్పుడే వెళ్ళిపోవాలని ఉంది* **(పు 32)**

అని నోస్టల్జియాను ప్రకటించాడు. 'పిట్టగూడు' కవితలో తన గ్రామంలో ఉండే పాతఇల్లు పడిపోయినప్పుడు, ఆ యింటితో తనకుగల అనుబంధాన్ని నెమరువేసుకున్నాడు.

*దశాబ్దాల కాలం నుంచి పిలిచినా పలకని*
*మాయదారి వాన ఇప్పుడొచ్చి*
***మా కలల గూటిని నేలరాల్చిపోయింది* (పు 34)**

అని ఆవేదన పడ్డాడు కవి. ప్రపంచీకరణ తల్లిదండ్రులకు వారి సంతానానికి చదువుపేర, ఉద్యోగం పేర దూరం పెంచుతున్నది. దేశాల సరిహద్దులు దాటిస్తున్నది. ఈ పరిణామం కవులను అమ్మానాన్నల వైపు తిప్పింది. రామకృష్ణ తన అమ్మానాన్నలకు అందుబాటులో ఉన్నా, వాళ్ళమీది గౌరవంతో కొన్ని కవితలు రాశాడు, 'ఒక చిన్నఆశ', స్వప్నం ధ్వంసమైన ప్రతిసారి' వంటివి.

తన పాతఇల్లు మీదనే కాదు, తన ఊరి మీద కూడా రామకృష్ణకు ఎనలేని మమకారం. 'మాఊరినేస్తం'' కవితలో తన ఊరిని, తనబాల్యాన్ని కవి ఆవాహన చేసుకున్నాడు.

*బతుకు తెరువుకోసం*
*ఊరు విడిచిపోయిన ప్రతికాందిశీకునికి*
*డిఎన్ఏ టెస్ట్ నిర్వహించండి*
*తప్పకుండ అందరి మూలాలు పల్లెల్లో*
*భద్రంగా ఉంటాయి*
*నా జ్ఞాపకాల్లో మాత్రం*
*మాఊరు ఎపుడూ*
***ఒక సంస్కృతిలా ప్రవహిస్తుంది* (పు 36)**

**తాత్విక నేపథ్యం:** ప్రతికవికీ ఒక తాత్వికదృక్పథముంటుంది. అది రామకృష్ణకు కూడా ఉంది. ఇటీవల త్రిపుర శాసనసభకు జరిగిన ఎన్నికలలో కమ్యునిస్టుపార్టీ ఓడిపోయి, భారతీయ జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చిన వెంటనే అక్కడి మతోన్మాదశక్తులు లెనిన్ విగ్రహాన్ని పడగొట్టేశాయి. దానిని నిరసిస్తూ రామకృష్ణ 'సూర్యుడు ఎప్పుడూ నేలరాలడు' కవిత రాశాడు. భారతీయ సమాజంలో ఇప్పుడు సామాజిక న్యాయసూత్రం ప్రధాన చింతనాధారగా ఉంది. ఇది డా.బి.ఆర్.అంబేద్కర్ అందించిన సూత్రం. దళితబహుజన ఉద్యమానికి అంబేద్కరిజం తాత్వికతగాఉంది. రామకృష్ణ 'అతనొక సామాజికస్వప్నం' కవిత రాశాడు. ప్రపంచప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్త, శరీరాన్ని జయించిన మహావ్యక్తి స్టీఫెన్ హాకింగ్ ఇటీవల మరణించాడు. రామకృష్ణ 'నింగికెగసిన జ్ఞానకెరటం' కవిత రాశాడు. ఈ మూడు కవితలు రామకృష్ణలోని వర్గ, వర్ణ, శాస్త్రీయదృక్పథాలను నిర్వచిస్తూ, ఆయన తాత్విక నేపథ్యాన్ని ధ్వనిస్తున్నాయి. మార్క్సిజం, అంబేద్కరిజంల సమన్వయం రామకృష్ణ తాత్వికనేపథ్యమని దీనివల్ల అర్థమౌతుంది. తెలంగాణరైతాంగ పోరాటాన్ని 'వజ్రాయుధం' కావ్యంగా మలచిన సోమసుందర్ "ఒకవీరుడు మరణిస్తే వేనవేలు ప్రభవింతురు" అన్నాడు. రామకృష్ణ లెనిన్‌విగ్రహ విధ్వంసాన్ని నిరసిస్తూ ఇలా అన్నాడు.

*ఒక్క ఆకు నేలరాలితే*
*వేల ఆకులు చిగురించి*
*వసంతాన్ని పులముకుంటుంది*
*ఒక్క విగ్రహం నేలకూల్చితేనేం*
*కోట్లమెదళ్ళలో*
*మొలకెత్తిన విప్లవబీజాల్ని*
***ఏబుల్డోజరు పెకలించగలదు* (పు 5)**

ఈ కవిత చదువుతుంటే ''తలలు బోడులైన తలపులుబోడులౌనా" అన్న వేమన్న మాట గుర్తుకు వస్తుంది. డా.బి.ఆర్.అంబేద్కర్‌ను 'భారతీయ బౌద్ధుడు'అని నిర్వచిస్తూ, ఆయన ఉద్యమ జీవితాన్ని పులకరిస్తూ చిత్రించిన రామకృష్ణ

*ఒకచేతి చూపుడు వేలును*
*భావితరాలకు దిక్సూచిగా నిలిపి*
*మరో చేతిలో జ్ఞానదీపాన్ని మోస్తూ*
*నగరకూడళ్ళ మధ్య*
***నిలబడ్డ నిలువెత్తు రూపం* (పు 8)**

అని వర్ణించాడు. "విశ్వఆవిర్భావాల గుట్టు విప్పిన జ్ఞానకెరటం" అని హాకింగ్‌ను నిర్వచించాడు. రామకృష్ణకు ఇవాళ భారతీయకవికి ఎలాంటి తాత్వికనేపథ్యం ఉండాలో అలాంటినేపథ్యమే ఉంది. అది దేశీయమార్క్సిజం.

మార్క్సిజం, అంబేద్కరిజం రెండూ భౌతికవాదాలే. ఇవి మనిషిని చరిత్రనిర్మాతగా గుర్తించాయి. సమాజాన్ని మతానికి అతీతంగా, శాస్త్రీయంగా అవగాహన చేశాయి. రామకృష్ణ ఈ రెండువాదాలను సమన్వయించుకొని హాకింగ్‌ను స్మరించుకున్నాడు. అంతేకాదు ఈ నేపథ్యంగల కవి సాధారణంగా సైన్సువైపే మొగ్గుతాడు. శాస్త్రీయవాదాన్నే సమర్థిస్తాడు. రామకృష్ణ 'కాలచక్రం' కవిత రాశాడు. ఇందులో ప్రకృతిపరిణామాన్ని మనిషి ఆవిర్భావాన్ని, మానవవికాసాన్ని వస్తువుగా స్వీకరించాడు.

*రాళ్ళను పనిముట్లుగా మలిచిన మహాశిల్పి*
*రాళ్ళపై నిప్పును రాజేసిన రాతిమనిషి*
*కాలచక్రంపై పరుగెత్తడం నేర్చుకున్నాడు*

*కాంతిలా విశ్వమంతా వ్యాపించి*

*గాలిలా కాలమంతా విస్తరించాడు* **(పు 44)**

భౌతికవాదానికి అవసరమైన శాస్త్రీయదృష్టి జోడైతే ఆ కవి భౌతికవాద కవి అవుతాడు. రామకృష్ణ భౌతికవాద కవి. ఇప్పటికి అవసరమైన కవి.

**ప్రాంతీయం:** రామకృష్ణ రాయలసీమకవి. రాయలసీమ ప్రజాయుద్ధమంతా కరువుతో. కరువు రాయలసీమ ప్రజాసంబంధాలను, అక్కడి ప్రజా జీవితాన్ని శాసిస్తున్నది. వ్యవసాయం విఫలం, రైతులవలసలు, వ్యవసాయవృత్తులు ధ్వంసం, వ్యవసాయ కూలీల వలసలు, రైతుల ఆత్మహత్యలు – ఏ వెల్గులకీ ప్రస్థానం అని ప్రశ్నిస్తున్నాయి. రామకృష్ణ రాయలసీమ వ్యవసాయ సంక్షోభం మీద కొన్ని కవితలు రాశాడు. 'వలసవెళ్ళిన వసంతం', నదినేర్పిన తిరుగుబాటు', 'నిష్క్రమించిన సూర్యుడు' వంటి కవితలు రాయలసీమ నిర్దిష్టవాస్తవికతకు అద్దం పట్టుతున్నాయి. ఆత్మహత్య చేసుకున్న రైతును అస్తమించిన సూర్యుడుగా ఉపమించడం రైతుపట్ల కవికి గల నిబద్ధతకు నిదర్శనం. ఆ రైతు దైనందిన జీవితాన్ని కవి ఇలా వర్ణించాడు.

*సూర్యుడు*
*మబ్బులదుప్పటి తెరిచేలోపల*
*తొలిపొద్దై*
*వెలుగుపూలు పూయించి*
*ఒక భుజంపై నాగలిని*
*మరో భుజంపై దేశాన్ని మోస్తూ*
*పగలంతా చెమటై ప్రవహించి*
*రాత్రివెన్నెల్లా తిరిగివచ్చేవాడు*
*మట్టివాసనై* **(పు 63)**

రైతు జీవితంలో ఉదయం నుండి రాత్రిదాకా జరిగే పరిణామానికి కవి వేసిన బొమ్మ ఇది. ఇలాంటిరైతు మరణించడం రాజకీయ వ్యవస్థకు గౌరవం కాదు. ఉద్యమించే రైతులను చంపడం రాజకీయ అనాగరితకు సంకేతమే. ఇటీవల మహారాష్ట్రలో రైతులు తిరుగుబాటు చేశారు. తమిళ్ రైతులు ఢిల్లీలో రోజులతరబడి ధర్నాచేశారు. తెలంగాణలో రైతులు వందలమంది లోకసభ ఎన్నికలలో నామినేషన్లు వేశారు. ఇవన్నీ ఉద్యమాలే. రామకృష్ణ మహారాష్ట్ర రైతుల తిరుగుబాటును సమర్థిస్తూ "నది నేర్పిన తిరుగుబాటు". కవిత రాశాడు.

ప్రాంతీయరైతు నుండి జాతీయరైతు దాకా కవి ఆలింగనం చేసుకున్నాడు. మహారాష్ట్ర రైతు ఉద్యమాన్ని "స్వతంత్రభారతావనిలో చరిత్ర మరువని సరికొత్తసైనిక కవాతు" అని కవి ఉపమించి, దాని ప్రాధాన్యతను నొక్కి చెప్పాడు. కవి రైతుసమస్యకు మూలమేదో చెప్పాడు.

*పాలకుల నిర్లక్ష్యనీడలు పారి*
*మార్కెట్ల మాయాజాలంలో*
*దళారుల కనికట్టు మాటలతో*
*ఆశలు ఆవిరైపోయాక* **(పు 20)**

**జాతీయం:** రాయలసీమరైతు వలసలను, ఆత్మహత్యలను చిత్రించిన రామకృష్ణ మహారాష్ట్ర రైతుల తిరుగుబాటును కూడా చిత్రించి తన జాతీయస్పృహను చాటాడు. అదే ఒరవడిలో ఆయన అనేక జాతీయంశాలను కవిత్వంగా మలిచాడు. పూర్వప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జైజవాన్ జైకిసాన్ నినాదం చేశారు. రామకృష్ణ 'రెండు నయనాలమధ్య' కవితలో ఈ నినాదానికి కవిత్వరూపమిచ్చాడు. దేశరక్షణలో నిమగ్నమయ్యే సైనికుడు, దేశప్రజలకు తిండిపెట్టే రైతు – ఇద్దరినీ దేశానికి రెండు కళ్ళుగా కవి ఉపమించాడు.

*దేశమైనా దేహమైనా*
*సురక్షితంగా సుభిక్షంగా*
*పూలదారుల్లో నడవాలంటే*
*సైనికులు కర్షకులే దారిదీపాలు* **(పు 10)**

ప్రపంచీకరణ మన సమాజంలో ధనం పాత్రను ఇబ్బడిముబ్బడిగా పెంచింది. పెట్టుబడిదారీ వ్యవస్థను బలోపేతం చేసింది. దీంతో కొందరు ఆర్థికసంక్షోభంలో పడి విలవిలలాడుతుంటే, కొందరు ఆర్థిక నేరగాళ్ళు దేశాన్ని మోసంచేసి విదేశాలలో కులుకుతున్నారు. ఇదొక జాతీయసమస్య. రామకృష్ణ ఈ సమస్యను కొంతఆధ్యాత్మిక దశకుపోయి, వైరాగ్యచింతనతో తీవ్రంగా విమర్శించాడు. ధనసంపాదనే జీవితానికి సార్థకత అనుకొనేవాళ్ళను నివ్వెరపరుస్తూ

*తనపై చేరేది మాత్రం*
*మూడురాళ్ళే నని తెలిసినా* **(పు 13)**

అన్నాడు. తిండికి గతిలేని వాళ్ళు చేసే చిన్ననేరాలకు పెద్దశిక్షలు వేసే పాలకులు, వేలకోట్లరూపాయలు అప్పుజేసి, బ్యాంకులను మోసగించి విదేశాలలో తలదాచుకున్న వాళ్ళ విషయంలో అచేతనంగా ఉండడం గురించి.

*విధివంచితులే కాలప్రవాహంలో*
*ఒక్కపూట ఆకలికోసం దొంగగా మారాల్సివస్తుంది*
*ఎర్రతివాచీలపై కదిలే కాళ్ళకు సలాంకొట్టి*
*వేలకోట్ల వాళ్ళచేతుల్లో పెట్టి*
*సామాన్యుడి రక్తం పీల్చేస్తున్న*
*ప్రభుత్వాలు, బ్యాంకులు*
*దేశానికి టోపీపెట్టి*
*మననోట్లో మట్టికొట్టినోడు*
*విదేశాల్లో రాజభోగాలు పొందుతున్నా*
*ఏమిచేయలేని మగతనం*
*మనిషితనం లేని వెధవాయితనం మనది* (పు 13)

కవి రాజకీయ కంఠస్వరం ఎంత కరుకుగా ఉందో ఈ ఖండిక సూచిస్తున్నది.

దేశవ్యాప్తంగా మహిళలమీద జరుగుతున్న దౌర్జన్యాలను ఖండించని కవి ప్రగతిశీల కవి అనిపించుకోడు. రామకృష్ణ "నువ్వుమనిషివి కాదు నీకు ఇంకేదో పేరుంది" అనే కవితలో ఈ దుర్మార్గాన్ని తీవ్రంగా విమర్శించాడు. మానవ జీవితంలో స్త్రీ ప్రాధాన్యాన్ని చెప్పి, దుర్మార్గులైన మొగవాళ్ళు చేసే దుర్మార్గాలను కవి పాఠకుల దృష్టికి తెచ్చాడు. ఒకచిన్న కవితలో చాలా చరిత్ర చెప్పాడు కవి.

**అంతర్జాతీయం:** ప్రగతిశీల కవి అంతర్జాతీయవాది. ప్రపంచంలో ఏ మూల ఏ అనర్థం కనిపించినా, ఈ కవి స్పందిస్తాడు. రామకృష్ణ సిరియాలో సంభవించిన అంతర్యుద్ధంలోని హింసను 'నెత్తుటిక్రీడ'గా వర్ణించాడు. ఈ కవిత చదువుతుంటే రెండవ ప్రపంచయుద్ధంలోని విధ్వంసం మీద పికాసో వేసిన గుమేర్నిక అనే పెయింటింగ్ స్ఫురణకు వస్తుంది. ప్రగతిశీలకవి యుద్ధవిముఖుడు. శాంతికాముకుడు. అందుకే రామకృష్ణ ఇలా అన్నాడు.

*సామ్రాజ్యవాద గోడలకింద*
*అగ్రరాజ్యాల ఆధిపత్యపోరులో*
*సిరియా కునారిల్లుతోంది*
*నిజానికది యుద్ధం కాదు*
*మానవీయ విధ్వంసం* (పు 29)

విధ్వంసవర్ణన చేసిన కవి శాంతిసాధనకు పిలుపునిచ్చి తన ప్రగతిశీలతను చాటుకున్నాడు. రామకృష్ణ 'విశ్వగీతం'అనే కవిత రాశాడు. ఈ కవితలో కవి తన ఆత్మను ఆవిష్కరించాడు.

*విశ్వయవనికపై*
*రెపరెపలాడే కొత్తబావుటానై*
*భూగోళపు దేహంపై సుప్రభాతవేళ*
*నిత్యం వినిపించే విశ్వగీతానికి*
*సరికొత్తగొంతుకనై నే అవతరిస్తున్నా* (పు 60)

మనం ఎంత ప్రాదేశికంగా ఆలోచిస్తున్నా ప్రతి కవికీ ఈ విశాల దృక్పథం ఉండాలి.

రామకృష్ణకు తెలుగుభాషంటే మక్కువ ఎక్కువ. "అమృతం నింపుకున్న అమ్మభాష" రాశాడు. 'జలగీతం'లో నీటి సంరక్షణబాధ్యతను గుర్తుచేశారు.

ప్రగతిశీలకవి లక్షణాలలో చైతన్యప్రబోధం ప్రధానమైనది. సామాజిక అపసవ్యకర ధోరణులమీద ప్రజల్ని జాగృతం చేయడం ప్రగతి శీలకవి కర్తవ్యం. రామకృష్ణ ఈకర్తవ్యాన్ని నిర్వహించాడు. 'మౌనం మాట్లాడినవేళ', 'చీకటివాన', 'ఎడారిగొంతుకులు'వంటి కవితలు ఇందుకు నిదర్శనాలు. 'మౌనం మాట్లాడిన వేళ'లో కవి చాలా ఆవేశంగా ప్రతివాక్యాన్ని 'మాట్లాడాలి' అంటూ ముగించాడు.

*సంకెళ్ళు తెంచుకున్న*
*వేలవేల చేతులన్నీ*
*ఒక్కపిడికిలై మాట్లాడాలి* (పు 16)

ఈ కవితలో కవిగా రామకృష్ణ ఆవేశం కట్టలు తెంచుకుంది. రాయలసీమ హక్కులకోసం కూడా సమైక్య ఉద్యమానికి రామకృష్ణ పిలుపునిచ్చాడు.

*అస్తమించని సూర్యులై*
*అష్టదిక్కులనుంచి*
*ఉద్యమమై కదలాలి*

రామకృష్ణ నేటి సీమగొంతుక అది నిర్భయగొంతుక. భావం, భావుకత చెట్టపట్టాల్ వేసుకొని నడిచే కవిత్వం రాశాడు. పాఠకులకు అసక్తి కలిగించే కవిత్వశైలి ఆయనది. రామకృష్ణ కొత్తగొంతుక అయినా జంకుగొంకు లేని గొంతుక. మౌనాన్ని బద్దలు కొట్టే గొంతుక "మౌనం మాట్లాడిన వేళ" ఆయన కావ్యం.

*ఇక్కడ*
*నేలరాలిన భూమిపుత్రుడే*
*అక్కడ*
*ఆకాశం అంచున నిల్చిన*
*ఈ దేశపు ధ్రువతార* (పు 64)

◆

## నేలతల్లి ఆలోచనలో పడింది

- కర్లపాలెం హనుమంతరావు
918142283676

బువ్వ పెట్టే అవ్వ
గుక్క తడపకపోగా
అడపా దడపా
ఉప్పు నీటిలో కురిసి
అమ్మి కన్నీటిని కవ్విస్తున్నవి
అదేమని అడిగితే
ఆకాశం ఆదేశం ఇదేనని
గర్జిస్తున్నవి క్రిమబ్బులు

అందుకే..
స్వేదగీతాన్ని
ఆవిరి పల్లవిలో
అందాయని ముందే
నేరుగా ఆలపించి



దయాపూరిత నీలిమేఘాలు
నాలుగు యాచించుకుందామని
అవని ఆశారాగాన్ని పంపించింది!

రెక్కలు విప్పి ఎగిరొచ్చే
శ్రామిక చైతన్యగీతి చరణాలు
అలసట తీరే
కొత్త సాంత్వనరాగమేదీ
నీ రంధ్రం దగ్గరా శూన్యమేనని
ఉత్తుత్తి ఉరుములూ
పిడుగులూ.. తుప్పర్లు తప్పించి

కుండపోతగా అమృతం కురిపించే
అధికారం
ఆకాశం అధీనంలోనూ లేదన్న
గుట్టు ఆలస్యంగా బైటపడిపోయింది


ఎవరో వస్తారని .. ఏదో చేస్తారని
ఎదురు చూడడం .. మోసపోవడం
ఎన్నోసారి ఇదన్న
ఆలోచనలో పడింది
నేలతల్లి ముఖం
బీడు పడిన పొలంలా
పాలిపోయింది ♦

## అక్షరాల మది

- జవేరియా
9849931255

శాస్త్రీయమైన కొలతలతో
చతురస్రాకారంలో
భావితరాలకోసం నిర్మించబడిన
ఆ గదికున్న నాలుగు గోడలు
గజస్థంభాలుగా నిలబడి
మౌనంగా సంభాషించు కుంటాయి

అటు ఇటూ కదిలే
కిటికీ రెక్కలు కంటి రెప్పల్లా
కదులుతూ సైనికుడిలా
పహారా కాస్తున్నట్టు అదేపనిగా అందర్ని గమనిస్తుంటాయి



తలకు తగిలే వేడి, వాన నుండి కాపాడేందుకు ఏర్పరచిన
పైకప్పు మాటిమాటికి వంగి చూస్తూ
ఉడతల్లాంటి బుడతలను గొడుగై కాపాడుతుంది

సింహద్వారంలా రోజు తెరుచుకునే గది
తలుపులు ఒక్కొక్కరిని చిరునవ్వుతో రమ్మంటూ
చేతులు చాచి లోపలికి ఆహ్వానిస్తాయి

వరుసగా పేర్చిన చెక్క బెంచీలు
నేల మీది నెలవంకలను
తన ఒడిలో కూర్చోబెట్టుకొని విసుగులేకుండా
ప్రేమగా కథలను వినిపిస్తాయి

గోడ మీద అతకబడిన నల్లబల్ల మీదనుండి
రాలిపడే తెల్లని పుప్పొడి సరికొత్త ఆలోచనలకు
జీవం పోస్తూ పచ్చగా చిగురింప జేస్తాయి

స్వేచ్ఛగా విహరించే రంగురంగుల సీతాకోక చిలుకలు
ఒకే చోట పోగై అందమైన పూలవనాన్ని తలపిస్తుంటాయి

నోటికి విరామం లేకుండా మాట్లాడే
ఒక మధురమైన స్వరం
పాఠంగానో...గేయంగానో... మారి
శ్రవణానందాన్ని కలిగిస్తూ
మరో ప్రపంచంలోని తీసుకెళ్తుంది

నిత్యం సూర్యోదయంతో
పావనమైన ఆ పవిత్రమైన గది

పొద్దుగూకే సమయానికి చంద్రుడిని కాపలా ఉంచి
పక్షులతోపాటు గువ్వలను భద్రంగా ఇంటికి చేరుస్తుంది!! ♦

కథ



# ఐశ్వర్యం


గన్నవరపు నరసింహమూర్తి
7752020123


విమానాశ్రయంలో సువర్చలకి వీడ్కోలు పలికి కార్లో రైల్వేస్టేషన్‌కి బయలుదేరాను. అక్కడ విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కి మా ఊరు వెళ్ళాలి.

మా ఊరెళ్ళి అప్పుడే పదేళ్ళవుతోంది! ఎప్పుడో అమ్మ చనిపోయినపుడు వెళ్ళడమే... మళ్ళీ ఇన్నాళ్ళకు తమ్ముడి కూతురి పెళ్ళికి వెళుతున్నాను.

నెలరోజుల క్రితం మా తమ్ముడు శివరాం ఇంటికొచ్చి – పెండ్లికి రమ్మనమనీ మా కుటుంబాన్ని ఆహ్వానించడంతో ఈ రోజు వెళ్ళవలసి వస్తోంది.

అయితే ఈ పెళ్ళికి నా భార్య సువర్చల అమెరికా మా పెద్దకొడుకు కాశ్యప్ ఇంటికి వెళ్ళవలసి రావడంతో నేనొక్కడినే ఈ రోజు బయలుదేరాను.

నేను, తమ్ముడు శివరాం... ఇద్దరం చిన్నప్పట్నుంచీ విభిన్న మనస్తత్వం గల వ్యక్తులం. నాది దుడుకు స్వభావం అయితే వాడు నెమ్మదస్తుడు. నిదానమే ప్రధానం అన్నది వాడి సిద్ధాంతం.

అందుకే జీవితంలో నేను అంచెలంచెలుగా ఎదిగితే వాడు మాత్రం మా పల్లెలో టీచరుగా ఉద్యోగం చేస్తూ అలాగే ఉండిపోయాడు.

వాడు ఇంటర్లో ఆర్ట్స్ గ్రూపు తీసుకొని తరువాత బియ్యే చదివీ బిఈడీ చేసి టీచరైతే నేను సైన్స్ తీసుకొని ఎమ్సెట్ వ్రాసి ఇంజనీరింగ్ చదివాను.

నాన్నగారు నా ఇంజనీరింగ్‌కి ఫీజు కట్టనంటే నేను రెండు రోజులు పస్తుండి పంతం నెగ్గించుకున్నాను. అప్పుడు నాన్న ఎకరం పొలం అమ్మి నాకు ఫీజు కట్టి ఇంజనీరింగ్‌లో చేర్పించారు.

ఇంజనీరింగ్ తరువాత నా దశ తిరిగిపోయింది. నీటిపారుదల శాఖలో ఉద్యోగం... రెండు చేతులా సంపాదన.. దాంతోపాటు పేరు, పలుకుబడి.. ముగ్గురు పిల్లలు...

పెద్దవాడు కాశ్యప్.. ఇంటర్‌దాకా ఊటీలో చదివి ఆ తరువాత అమెరికాలో ఎమ్మెస్ చేసాడు. అమెజాన్‌లో ఉద్యోగం... సంవత్సరానికి రెండు కోట్ల జీతం

రెండవవాడు మహేష్... ఆస్ట్రేలియాలో ఎమ్బీయ్యే చదివాడు.. ఒక ఇంటర్నేషనల్ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నాడు. వాడి జీతం కూడా కోట్లలోనే...

మూడవది మా అమ్మాయి లహరి.. లండన్‌లో డాక్టర్ చదివి అక్కడే ప్రాక్టీస్ చేస్తోంది.

ఇక సువర్చల ఎప్పుడూ ప్రయాణాలతో బిజీగా ఉంటుంది.

రెండు సంవత్సరాల క్రితం కాశ్యప్ అమెరికా అమ్మాయిని

పెళ్ళి చేసుకున్నాడు. ఆమె లూసీ... అతని బాస్ కూతురే పెళ్ళి చేసుకున్న తరువాత మాకు చెప్పడంతో పెళ్ళికి వెళ్ళలేకపోయాము. ఆ విషయం నాకు బాధ కలిగించినా ఈ తరంలో అవి మామూలే అనీ సరిపెట్టుకున్నాను.

ఇక మహేష్ కూడా ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ తెలుగు కుటుంబానికి చెందిన శృతిని పెళ్ళి చేసుకున్నాడు. సంవత్సరంపాటు సహజీవనం చేసి ఈ మధ్యనే పెళ్ళి చేసుకున్నారు.. ఆమె తండ్రి ఓ పెద్ద వ్యాపారస్తుడు. పెళ్ళి చాలా బాగా చేసాడు. పెళ్ళి రెండు రోజులుండగా మాకు తెలియడంతో హడావిడిగా బయలుదేరాము.

కానీ అక్కడికి వెళ్ళిన తరువాత ఆడపెళ్ళి వారి ప్రవర్తన చూసి నాకు చాలా బాధ కలిగినా లోలోపలే అణుచుకున్నాను.

మేము వస్తున్నామని తెలిసినా కనీసం విమానాశ్రయానికి మహేష్‌తో సహా ఎవ్వరూ రాలేదు.

కనీసం కారు కూడా పంపలేదు.

నానా బాధపడి వాళ్ళింటికి వెళ్ళాము. అప్పటికే పెళ్ళి అయిపోయింది. ఆ తరువాత మాకు చాలా అవమానాలు ఎదురయ్యాయి.

మా వియ్యంకుడికెంతసేపూ అతని స్నేహితులూ చుట్టాలే తప్పా మమ్మల్ని పట్టించుకోలేదు. కోడలు శృతి కూడా మాతో పెద్దగా మాట్లాడలేదు. అందుకే అది పెళ్ళిలా మాకనిపించలేదు.

వాళ్ళ ప్రవర్తన చూసిన తరువాత అక్కడ ఒకక్షణం కూడా ఉండబుద్ధి కాలేదు. మర్నాడే ఇండియాకి వచ్చేసాము.

ఇక లహరి కూడా ఒక ఐర్లాండ్ వ్యక్తిని పెళ్ళాడింది... అది కూడా సహజీవనమేనట.

నేను హైదరాబాద్‌లో పని చేస్తున్న ఒక మంచి డాక్టర్ని చూసి దానికి చెబితే ఆమె నవ్వుతూ డాడీ! నేను లండన్‌లో చదువుకున్నాను. హైదరాబాద్ అబ్బాయితో ఎడ్జస్ట్ కాలేను. అయినా నేను నాకు కాబోయే భాగస్వామిని ఎప్పుడో ఎంచుకున్నాననీ, ప్రస్తుతం అతనితోనే సహజీవనం చేస్తున్నాననీ చెప్పడంతో నా మస్తిష్కం మొద్దుబారిపోయింది.

బాగా రాణిస్తారనీ ముగ్గుర్నీ విదేశాలలో చదివిస్తే వాళ్ళు చేసిన పని నాకు నచ్చలేదు. నాగరికతంటే వాళ్ళ దృష్టిలో విచ్చలవిడితనం...

కానీ నాకున్న పెద్ద పేరు వల్ల ఇవన్నీ ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి .... మేడిపండులా తయారైంది నా జీవితం...

ఇక్కడ సమాజంలో నాకు చాలా గుర్తింపు చాలా డబ్బుందనీ నాకందరూ గౌరవం ఇస్తున్నారు. హైదరాబాద్‌లో మూడిళ్ళు, విశాఖలో రెండు ఇవి కాక చాలా స్థలాలు, బంగారం, వెండి... ఎన్నో కార్లు...ఇలా వడ్డించిన విస్తరి నా జీవితం..

ఇక అందరూ నా పిల్లల గురించి గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు.

కానీ నా అంతర్మథనం వాళ్ళెవరికీ తెలియదు... నా మానసిక క్షోభ సమాజానికి చెప్పలేను.

ఇలా ఆలోచిస్తుండగానే నా కారు రైల్వేస్టేషన్‌కి చేరుకుంది. నేను వెళ్ళిన పావుగంట తరువాత విశాఖ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది.

తెల్లవారేసరికి రైలు మా ఊరికి దగ్గర్లోని స్టేషన్‌కి చేరుకుంది. అక్కడికి మా ఊరు ఇరవై కిలోమీటర్లు.

నేను రైలు దిగేసరికి ఎదురుగా మా తమ్ముడి కొడుకు మధు నా కోసం ఫ్లాట్‌ఫారం మీద ఎదురు చేస్తున్నాడు. నా కోసం రాత్రే వచ్చాడట వాడు. ఆ సమయంలో వాడినక్కడ చూడటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

◆◆◆

కారు మా ఊరి వైపు వెళుతోంది. కారులోంచి చూస్తుంటే మా ప్రాంతం అంతా మారిపోయినట్లు కనిపిస్తోంది. ఇది వరకు వర్షాలు లేక బీడులా కనిపించే పొలాలు ఇపుడు కనుచూపు మేరంతా పచ్చటి తివాచీలా కనిపిస్తున్నాయి.

కారు అద్దాలు కిందికు దించాను. ఒక్కసారిగా చల్లటి మలయమారుతం ఉక్కిరి బిక్కిరి చెయ్యసాగింది.

ఎదురుగా నీలాకాశం, దోబూచులాడే తెల్లటి మేఘాలు, సింధూరంలా మెరిసిపోతున్న తూరుపు, హరితవర్ణ పొలాలపై ఎగురుతున్న తెల్లటి కొంగల బారు... ఆ దృశ్యం మనోహరంగా ఉంది.

"ఏరా ! చదువైపోయిందా? ఇంతకీ ఏమిటి చదివావు? ఉద్యోగం?" ముందుసీట్లో కూర్చున్న మధుని అడిగాను.

"ఎమ్మెస్సీబిఈడీ చదివాను పెదనాన్న. క్రితం సంవత్సరం పక్క ఊరి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది" అన్నాడు మధు.

"నీకు కంప్యూటర్స్, ఇంజనీరింగ్‌లో చదువులిష్టం లేదా?

అవి చదివితే హాయిగా ఏ అమెరికాకో, ఆస్ట్రేలియాకో వెళ్ళేవాడివి కదా?"

"నాకు ఎమ్‌సెట్లో నూరులోపు రేంక్ వచ్చింది. నాన్నగారు ఇంజనీరింగ్‌లో చేరమన్నారు కూడా! కానీ నాకే ఇష్టంలేక చేరలేదు.

"ఇష్టంలేదా? కారణం?" ఆశ్చర్యపోతూ అడిగాను.

''నేను దూరంగా వెళ్ళిపోతే అమ్మా, నాన్నలు ఒంటరివారైపోతారు. అమ్మకి నాలుగేళ్ళ క్రితం కాలుకి ఆపరేషన్ అయింది. ఎవరో ఒకరి సహాయం కావాలి అమ్మకు ఇప్పుడు. అందుకే టీచరు ఉద్యోగం కోరుకున్నాను. పక్క ఊర్లోనే ఉద్యోగం.. రోజూ ఉదయాన్నే బైక్ మీద వెళ్ళి సాయంత్రం వచ్చేస్తాను. అందువల్ల అమ్మకి పనుల్లో సాయం చెయ్యగలగుతున్నాను". వాడి మాటలు నాకు ఆశ్చర్యం కలిగించాయి.

అమ్మా నాన్నల కోసం తన భవిష్యత్‌ని వదులుకున్న వాడిని చూస్తుంటే చాలా ఆనందం కలిగింది.

"సంధ్య ఏం చదువుకుంది? మరి పెళ్ళికొడుకు ఏం చేస్తున్నాడు?

"చెల్లి బీయస్సీబిఈడీ చేసింది. సంవత్సరం క్రితం టీచరుగా ఎంపికైంది. అది పనిచేసేది పక్క ఊరి స్కూల్లోనే బావగారు కూడా అదే స్కూల్లో పనిచేస్తున్నారు. చెల్లెలు దగ్గరగా ఉంటుందనీ ఈ సంబంధం చూసారు నాన్న. చెల్లెల్ని వదలి ఆయన ఉండలేరు" అన్నాడు మధు.

నేను వాడితో మాట్లాడుతున్నానే కానీ నా మనసు మాత్రం పరి పరి విధాలుగా ఆలోచిస్తున్నది. నా పిల్లలందరూ బయట హాస్టల్స్‌లో ఉండి చదివారు. ఆ తరువాత ఇంజనీరింగ్ డాక్టరు కోర్సులకు బోలెడు డొనేషన్లు కట్టి చదివించాను. వాళ్ళు చదువుతున్నప్పుడు ఎప్పుడో సంవత్సరానికోసారి ఇంటికి వచ్చేవారు. వచ్చినా తనతో వాళ్ళు ఎప్పుడూ మాట్లాడి ఎరుగరు. ఇంట్లో ఉన్నా సెల్‌ఫోన్లలో ముక్తసరిగా నాలుగుమాటలు.. అదీ డబ్బు అవసరం పడినప్పుడు మాత్రమే.

ఇలా ఆలోచిస్తున్నంతలోనే కారు మా ఊరు పొలిమేరల్లోకి ప్రవేశించింది.

దూరంగా కొండ.. దాని మెడ చుట్టూ హారంలా ఏరు.. ఏటి ఒడ్డున శివాలయం. కార్తీకం కావడంతో గుడిగంటలనాదం లయబద్ధంగా చెవులకు సోకుతోంది.

కొద్దిసేపటికి కారు మా ఇంటి ముందర ఆగింది.

కారు ఆగగానే మా తమ్ముడు, మరదలు సుశీల పెళ్ళికూతురు సంధ్య... అందరూ పరుగు పరుగున కారు దగ్గరకు వచ్చారు.

కారు తలుపు తియ్యగానే శివరాం 'ఏ అన్నయ్యా! బాగున్నావా?" అన్నాడు నా చేతులు పట్టుకొని.

''బాగున్నారా బావగారూ'' సుశీల ఆప్యాయంగా పలకరించింది.

"హాయ్ పెదనాన్న" అంది సంధ్య నా రెండు చేతులూ పట్టుకొని.

అసలు రెండు రోజుల క్రితం దాకా ఈ పెళ్ళికి వచ్చే కార్యక్రమం లేదు. నా భార్య సువర్చల "మీరు ఆ పల్లెలో ఉండలేరు.. అక్కడ మీకు సరియైన సదుపాయాలుండవు.. ఆరోగ్యం దెబ్బతింటుంది." అంటూ హెచ్చరించింది. కానీ తమ్ముడు స్వయంగా ఇంటికి వచ్చి పిలిచేడు కాబట్టి మనసు మార్చుకొని వచ్చాను.

కారు దిగి ఇంటి వైపు చూసాను. నేను పుట్టి పెరిగిన ఇల్లు. ఇంటిముందర కొబ్బరిచెట్లు, మామిడి చెట్టు నన్ను పలకరించినట్లనిపించింది!

ఇంటిముందర ఆకుపచ్చటి పందిరి. కొబ్బరి ఆకులు పైన, చుట్టూరా మామిడి తోరణాలు చాలా బాగుంది. ఆ పందిట్లోకి ప్రవేశించగానే ఏదో తెలియని పరిమళం నన్ను ఉక్కిరి బిక్కిరి చెయ్యసాగింది. అది నా బాల్యస్మృతుల్ని గుర్తుకు తెస్తోంది.

సంధ్య మాత్రం నా చేతులు వదలలేదు. ఎప్పుడో పదేళ్ళక్రితం ఆరవతరగతి చదువుతున్నప్పుడు దాన్ని చూసేను.

ఇప్పుడది పెళ్ళికూతురి ముస్తాబులో మెరిసిపోతోంది. పొడవాటి జడ, తెల్లటి వర్చస్సు, అందమైన ముఖంతో వెలిగిపోతోంది.

కొద్దిసేపటి తరువాత పెరట్లో నూతి దగ్గర స్నానం చేసాను. ఎప్పుడూ లేనిది పచ్చటి చెట్లు మధ్య ఆకాశం కింద అరగంటసేపు తృప్తిగా స్నానం... హాయిగా అనిపించింది.

స్నానం తరువాత సంధ్య 'పెదనాన్న' టిఫిన్ అంటూ వేడి వేడి ఉప్మా నెయ్యి వేసి తెచ్చి ఇచ్చింది. ఆ వేడి ఉప్మా, దానిమీద వేడినెయ్యి కలిసిన ఆ వాసన నా ముక్కు పుటాలను సోకగానే నాలో ఆకలి ఒక్కసారిగా పుట్టుకొచ్చి ఆవురావురుమని తిన్నాను.

ఎప్పుడో నా చిన్నప్పుడు ఇంతటి రుచికరమైన ఉప్మాని

తిన్నాను మళ్ళీ ఇన్నాళ్ళకు. ఇప్పుడంతా బర్గర్లు, పిజ్జాలే.. రుచీ పచీ లేని తిళ్ళు.. కమ్మటి తిండి తినీ ఎన్నిరోజులైందో?!

టిఫిన్ తరువాత వేడినీళ్ళ స్నానం వల్ల హాయిగా నిద్రపోయాను. సాయంత్రం అవుతుండగా మధు వచ్చి లేపడంతో పొలంవైపు వెళ్ళాము. చాలా రోజుల తరువాత పచ్చటి పొలాలను చూసాను... సశ్యపు నీటిని తలమీద జల్లుకున్నాను.

ఆ రాత్రి పెళ్ళి సందడి మొదలైంది! తెల్లవారి ముహూర్తం కావడంతో సంధ్యకి మంగళ స్నానం చేయించి పెళ్ళికూతురి అలంకరణ చేసారు.

అలంకరణ పూర్తైన తరువాత నా కాళ్ళకు నమస్కారం చేస్తే మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను.

నా కూతుర్నెప్పుడూ ఇలా నేను ఆశీర్వదించలేదు.

ఆ తరువాత రాత్రిభోజనం తమ్ముడి కుటుంబ సభ్యులతో కలిసి పెళ్ళి పందిట్లో మేళతాళాల మధ్య తృప్తిగా తిన్నాను.

అరటి ఆకులో తిన్న భోజనం చాలా రుచిగా ఉంది. తింటున్నంతసేపూ పిల్లలూ, నేనూ బోలెడు కబుర్లు చెప్పుకున్నాము. ఆ సమయంలో నేను కూడా పిల్లవాడినైపోయాను.

ఆ రాత్రి నేనూ, మధు మరికొంతమంది పిల్లలతో పెళ్ళిపందిరిని పూలతో అలంకరించాము.

తెల్లవారి రెండుగంటలకు పెళ్ళి మొదలైంది. పొడవైన పెళ్ళిపీటలు, వధూవరుల పూజలు, జీలకర్ర బెల్లం, తలంబ్రాలతో పెళ్ళి చాలా సంప్రదాయంగా.. మంగళ వాయిద్యాల మధ్య జరిగింది.

◆◆◆

పెండ్లి ముగిసింది. పెండ్లి కొడుకు శ్రీధర్ చాలా మంచి యువకుడు. అందరితో కలిసిపోయే మనస్తత్వం కలవాడు. సంధ్య, శ్రీధర్ల జంట చూడముచ్చటగా ఉంది.

ఆ మర్నాడు సాయంత్రం మేమంతా కలిసి ఏటిఒడ్డున శివాలయానికి వెళ్ళి శివుణ్ణి దర్శనం చేసుకున్నాము.

ఆ మర్నాడే నా ప్రయాణం! నా కెందుకో అక్కడ ఇంకొన్ని రోజులుండాలనిపిస్తోంది. నాకు మా తమ్ముడి కుటుంబాన్ని చూస్తుంటే అసూయ కలుగుతోంది. వాళ్ళ మధ్య ఉన్న అనుబంధాలు, ఆప్యాయతలు నాకు ఎంతగానో నచ్చాయి.

నేను బట్టలు సర్దుతూ ఉండగా సంధ్య వచ్చి 'పెదనాన్నా! అప్పుడే వెళ్ళిపోతావా? ఇంకో వారం ఉండవా?" అంటూ చెమర్చిన కళ్ళతో అడుగుతూ ఉంటే నాకూ కళ్ళు చెమర్చసాగాయి.

ఇంతలో మా తమ్ముడు వచ్చి "అన్నయ్యా! నువ్వు చాలా రోజుల తరువాత వచ్చావు. పిల్లలు నిన్ను ఉండమనీ అంటున్నారు. వారం తరువాత వెళ్దువుగానిలే..." అంటూ బలవంతం పెట్టడంతో ఇంక ఉండిపోక తప్పలేదు.

ఆ మర్నాడు నేను, మధు కలిసి సంధ్యని అత్త వారింటికి తీసికెళ్ళాము. అక్కడ రెండు రోజులుండి మళ్ళీ పిల్లని తీసుకువచ్చాము.

ఆ రోజు నేను బయలుదేరే రోజు. ఇంట్లో మా తమ్ముడి వియ్యాలవారు, శ్రీధర్, సంధ్య, మధు అందరూ ఉన్నారు.

మా తమ్ముడు నేను బయలుదేరుతున్నప్పుడు తన వియ్యంకుడు రాఘవరావుతో "మా అన్నయ్య రాష్ట్ర ప్రభుత్వంలో చాలా ఉన్నత స్థానంలో ఉన్నాడు. అతని పిల్లలు కూడా పెద్ద చదువులు చదువుకొని విదేశాల్లో పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. అందరికీ కోట్లలోనే జీతాలు. ఆ విధంగా మా అన్నయ్య చాలా అదృష్టవంతుడు.. ఎవరికో తప్ప అంత గొప్ప జీవితం లభించదు. లక్ష్మీదేవి, సరస్వతీదేవి వాడింట్లో కలిసి ఉన్నాయి. అందుకే వాడు ఐశ్వర్యవంతుడు. అలాంటి మా అన్నయ్య మా ఇంటి పెళ్ళికి వచ్చి పదిరోజులుండటం మాకు చాలా ఆనందంగా ఉంది" అంటూ నా గురించి చెప్పడంతో నా కళ్ళు చెమర్చడం మొదలుపెట్టాయి.

భారమైన హృదయంతో వారందరి దగ్గర వీడ్కోలు తీసుకుని కారు ఎక్కాను.

నా తమ్ముడి జీవితాన్ని చూస్తుంటే నేను జీవితంలో ఏం కోల్పోయానో తెలిసింది! వాడింట్లో ఉండే ఆప్యాయతలు, అనురాగాలు, బంధాలు మా ఇంట్లో మచ్చుకి కూడా కానరావు. నేనిన్నాళ్ళు బేంక్‌లో డబ్బుని, లాకర్లలో ఉన్న బంగారాన్ని అవినీతి సంపాదనతో కట్టిన మేడల్ని చూసి ఐశ్వర్యం అనుకున్నాను. కానీ ఈ రోజు అది తప్పనీ మా తమ్ముడి కుటుంబాన్ని చూసిన తరువాత తెలిసింది.

ఇప్పుడు "నేను ఐశ్వర్యవంతుణ్ణా మా తమ్ముడా? అన్న ప్రశ్న నన్ను తొలచివేస్తోంది.

కారు వేగంగా పరుగులు తీస్తోంది. ◆

## నిశ్శబ్దంగా!

- నిఖిలేశ్వర్
9177811201

నిశ్శబ్దంగా నిర్మానుష్యంగా
రాత్రంతా మా వీధి,
స్ట్రీట్‌లైట్స్ కావలింతలతో
వెలుగు నీడలను ప్రసవిస్తున్న
ఆకుల చిరుకదలలికల కింద
రోడ్డు మీదే తలవాల్చి
కాపలా కాస్తున్న టైగర్ (కుక్క)!
మా ఇంటి వెనకాలే
యాభై సం.ల పెద్దింటిని
కూల్చివేసారు వారసులు –



బుల్‌డోజర్‌తో
జ్ఞాపకాలన్నీ నేలమట్టం!
భూగర్భ జలమంతా–
ఇంకినచోటే
ఇప్పుడు నిటారుగా
నిలుచున్న ఐదంతుస్తుల మేడ
ఐదుగురు అన్నదమ్ముల జాడ
మా ఇంటి తూర్పుదిక్కున
గాలి వెలుగుకు అడ్డు గోడ!! ◆

---

## ఆపన్నహస్తం

మెట్టా నాగేశ్వరరావు
9951085760

మేతకోసం..
వెళ్లే వెళ్లే పిట్ట
రెక్క తెగి కూలిపడినట్టు కాదు
కూలిపడినదేదైనా
శక్తి కూడదీసుకుని తిరిగి లేచినట్టు చేయాలె!

పొలాలవైపు
ప్రవహించే కాలవ
కొండలడ్డమొచ్చి ఆగిపోయినట్టు కాదు
ఆగిపోయినదేదైనా
సాగిపోయే తెరువుని కనిపెట్టి జెప్పాలె...!

దారిలో ఎదురొచ్చే చీకటితుప్పలను
సమూలంగా కత్తిరించే
వెలుగుఖడ్గంలా చెంతనుండాలె...!
పతనాల లోయలోకి జారిన మనిషిని
వున్నతి తావులోకి
లాగగలిగిన పొడవైన తాడులాగుండాలె..!

కవిరాసే ప్రతివాక్యమూ
జీవితంలో ముంచి రాయాలె
దాని లోతుల్ని ప్రేమించి రాయాలె
కవిరాసే ప్రతివాక్యమూ
ప్రయాణంలో తూలిపడకుండా తోడ్పడే
వూతకర్రలా వుండేట్టు రాయాలె..!



కవిరాసింది ఒకవాక్యమైనా
ఆత్మదప్పిక తీర్చేదిగా వుండాలె..!
మోడయిన తరువుకొచ్చిన
చిగురులా వుండాలె...!

బతుకుగండాలను తట్టుకోలేక
వురితాడు తగిలించుకోడానికెళ్లే వాడినల్లా
కవి రాసిన వాక్యం
ఎలాగైనా బతికి తీరాల్సిందేనన్నట్టు జేయాలె!

మనిషి రంధిగొందిలో
ఇరుక్కుపోయాడన్నప్పుడల్లా
కవి రాసే వాక్యం
బయటపడేసే ఆపన్నహస్తంలా వుండాలె...! ◆

విశ్లేషణ

# కథలు రాయడం ఎలా? - సాహిత్య పరిచయం



- పెనుగొండ లక్ష్మీనారాయణ
9440248778

*ఆధునిక కథను అనేకులు చేపట్టారు. తీర్చిదిద్దారు. ప్రజాపక్షం చేశారు. దాదాపు నాలుగు వేలమంది కథకుల కలాల నుండి ఓ లక్ష వరకూ కథలు వెలువడ్డాయి. సంపుటాలైతే ఐదువేల వరకూ వుంటాయి. సంకలనాల సంఖ్య వెయ్యి వరకూ వుండొచ్చు.*

ప్రపంచ వ్యాప్తంగా కథా ప్రక్రియ అభివృద్ధి చెందింది. చెందుతోంది. మిగిలిన సాహిత్య ప్రక్రియల కన్నా ముందడుగు వేసింది. వేస్తోంది. తెలుగులో గురజాడతో మొదలైన ఆధునిక కథను అనేకులు చేపట్టారు. తీర్చిదిద్దారు. ప్రజాపక్షం చేశారు. దాదాపు నాలుగు వేలమంది కథకుల కలాల నుండి ఓ లక్ష వరకూ కథలు వెలువడ్డాయి. సంపుటాలైతే ఐదువేల వరకూ వుంటాయి. సంకలనాల సంఖ్య వెయ్యి వరకూ వుండొచ్చు. నేను '20వ శతాబ్ది కథా సంకలనాల చరిత్ర' వ్యాసం రాశాను. పత్రికలు, ప్రత్యేక సంచికలూ కథలకు పెద్ద పీట వేశాయి. పోటీలు నిర్వహించి మంచి కథలను బయటకు తీశాయి. కథకులూ వచ్చారు. కథా సాహిత్యాన్ని విస్తరింపజేసే ఉద్దేశ్యంతో 'పూలగుత్తి' త్రైమాస పత్రికను విశాఖ నుండి పూడిపెద్ది వెంకటరమణయ్య (1893 - 1937) తన సంపాదకత్వంలో నడిపారు. కొడవటిగంటి కృష్ణమూర్తి కథల కోసమే తెనాలి నుండి 'కళానిధి' మాసపత్రికను నడిపారు. విజయవాడ నుండి కథా ప్రేమికులు భార్యాభర్తలైన ముత్యాల రామారావు ప్రచురణకర్తగా నాగకుమారి సంపాదకులుగా ఏప్రిల్ 2006 నుండి ఏప్రిల్ 2014 వరకూ ఎనిమిది సంవత్సరాలపాటు 'కథాకేళి' మాసపత్రికను నిర్వహించారు. అరసం, సాహితీస్రవంతి, కథాకేళి యింకా అనేక సాహిత్య సంస్థలు కథానికా కార్యగోష్ఠులను నిర్వహించాయి. నిర్వహిస్తూనే వున్నాయి. కొత్త కథా రచయితలకు ఈ కార్యగోష్ఠులు ఎంతగానో తోడ్పడుతున్నాయి. కథా రచనలోకి ఎప్పటికప్పుడు నూతన రచయితలు ప్రవేశిస్తున్నారు. కథకు కొత్త వెలుగులను అందిస్తున్నారు.

ఇంకా కథలు రాయటం గురించి కూడా తెలుగులో అనేకమంది ప్రసిద్ధ రచయితలు, విమర్శకులు వ్యాసాలు రాశారు. రాయటం గురించి తెలిపే పుస్తకాలూ యిప్పుడు మన చేతుల్లో వున్నాయి. వాటిని పరిచయం చేయటమే ఈ వ్యాసోద్దేశ్యం. ముందుగా ఆ పుస్తకాలను గురించి కొద్దిపాటి సమాచారాన్నిస్తాను.

1. కథలు రాయడమెలా? – శాంతికృష్ణమూర్తి, ప్రథమ ముద్రణ, యశోధర ప్రచురణ, హన్మకొండ 1955; ద్వితీయ ముద్రణ అక్టోబర్ 2016, నవచేతన పబ్లిషింగ్ హౌస్.

2. ఒకే కథ అనేక రకాలు (కథా సాహిత్యానికి పాఠ్యగ్రంథం) – పోలవరపు శ్రీహరిరావు, ప్రజామాత, బెంగళూరు – 1955, ద్వితీయ ముద్రణ విశాలాంధ్ర – జూలై 2006.

3. కథలు వ్రాయడం ఎలా: సంకలనకర్త: శార్వరి 1970, 1975 మరియు కథలెలా రాస్తారు? శీర్షికతో 1992లో విశాలాంధ్ర ప్రచురణ.

4. కథా కథనం (వ్యాస సంపుటి) కాళీపట్నం రామారావు (రచనా కాలం 1987 - 1988) కాళీపట్నం రామారావు రచనలు 2008 వరకూ లభ్య రచనల సంపుటి.

5. కథాశిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య జనవరి 1995, విశాలాంధ్ర ప్రచురణ

6. కథల బడి – కథా సాహిత్య అలంకార శాస్త్రం – బి.ఎస్. రాములు 1998, విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ.

7. కథలు ఇలా కూడా రాస్తారు – మహమ్మద్ ఖదీర్‌బాబు, ఏప్రిల్ 2016, కావలి ప్రచురణలు

8. కథానిక – పాఠాలు (కథారచనలో మెలుకవలు) అరసం – గుంటూరు జిల్లా శాఖ ప్రచురణ.

9. కథానిక – దాని కమామీషు – గండికోట బ్రహ్మాజీరావు.

10. కథలు ఎలా రాస్తారు? – మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఇవి కాకుండా కథా ప్రక్రియను గురించి పలు పుస్తకాలు వెలువడ్డాయి. కథా రచన నిర్మాణం, నిర్వహణ పైనా పలు వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆ పుస్తకాలు సాహిత్య ప్రయోజనం (వ్యాసావళి 1969) కొడవటిగంటి కుటుంబరావు) లోని కొన్ని వ్యాసాలు; తెలుగు కథ (విమర్శనాత్మక వ్యాస సంపుటి) సెప్టెంబర్ 1974, ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం; కథా వేదిక – ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక 1991–92; తెలుగు కథ వెలుగులు (కథా వేదిక ప్రచురణ) ఫిబ్రవరి 1995; మధురాంతకం రాజారాం కథా యాత్ర (తెలుగు కథానిక విమర్శలూ – పరామర్శలూ) సంపాదకులు: మధురాంతకం నరేంద్ర జూలై 2006, అజో – విభా ప్రచురణ; కథానిక – స్వరూప స్వభావాలు (పరిశోధనా గ్రంథం 1988, 2009), కథ – సాహిత్య శాస్త్రం (వ్యాస పంపుటి) డా॥ పోరంకి దక్షిణామూర్తి, డిసెంబర్ 2015, ఇంకా విహారి వ్యాస సంపుటి 'సమీక్ష'లోని తెలుగు కథ – శిల్పం, తెలుగు కథ – మారుతున్న విలువలు, కథానిక – వస్తు రూపాలు (వ్యాస సంపుటి); కాత్యాయని విద్మహే రచన 'తెలుగు నవలా కథానికా విమర్శన పరిణామం' పుస్తకం. ఆర్.ఎస్. సుదర్శనం 'తెలుగు కథ – శిల్పం' (1983 – సాహిత్య నేపథ్యం వ్యాస సంపుటి) వ్యాసం; సింగమనేని నారాయణ వ్యాస సంపుటి 'కథావరణం' లోని, కథ రాయటం గురించి కొంచెం; కథల తెలుగు; రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'కథాంశం' వ్యాస సంపుటిలోని తెలుగు కథా సాహిత్య విమర్శ, 'చర్చ' వ్యాస సంపుటిలోని పదునెక్కిన కథా విమర్శ, కథానికకు ప్రాణాలెన్ని? వ్యాసాలు; పాపినేని శివశంకర్ 'నిశాంత' వ్యాస సంపుటిలోని కథా సౌందర్యం, కథా వ్యవస్థ, తెలుగు కథ – నిన్న, నేడు వ్యాసాలు మరియు కథోద్ధారకుడుగా కీర్తిగడించిన వేదగిరి రాంబాబు 'కథానికా లక్ష్యము – లక్షణాలు, 'తెలుగు కథానిక' పుస్తకాలు సాహిత్య విద్యార్థులు చదవదగినవి. ఇంకా పి.వి. సుబ్బారావు, కాకాని చక్రపాణి, చందు సుబ్బారావు తదితరులు కథా సాహిత్యంపై రాసిన వ్యాసాలు పరిశీలించదగినవి.

కథానిక సాహిత్యంపై వెలువడిన ప్రత్యేక సంచికలు :

1. కథా వేదిక ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక 1991 – 92

2. తెలుగు కథ వెలుగులు ఫిబ్రవరి. 1996 కథా వేదిక ప్రచురించిన ఈ రెండు పుస్తకాలలో కథా రచన గురించి, విమర్శ గురించి మంచి వ్యాసాలున్నాయి. కథా వేదిక 'కథ కళలకు కేంద్ర బిందువు' అని ప్రకటించింది. విమర్శకులు ఈ మాటను పాక్షిక సత్యం మాత్రమేనన్నారు.

3. కథనశాల (సాహిత్య ప్రస్థానం నవంబర్–డిసెంబర్ 2013 ప్రత్యేక సంచిక)

తెలుగు కథానిక ఆవిర్భవించిన నాటి తొలి విమర్శకుల అభిప్రాయాలు కొన్ని:

అక్కిరాజు ఉమాకాన్తమ్ 'త్రివిజ్ఞ చిన్న కథలు' సంపుటి (వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి 1918)లో పీఠిక, పండితులకు విన్నపము శీర్షికలతో కథా సాహిత్యం, కథా లక్షణాల గురించి చర్చ చేశారు. 'ఇట్టి కథల వాఙ్మయము తెలుగునకు క్రొత్తది' అని ప్రకటించారు.

నోరి నరసింహశాస్త్రి 1922లో 'కథలెల్లా వ్రాస్తారు?', దిగవల్లి వెంకటశివరావు 1925లో 'చిన్న కథలు – ఆంధ్ర వాఙ్మయమున వాని స్థానము; తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి 1939 భారతి భాద్రపద సంచికలో 'కథానిక' దాని పరిణామం' వ్యాసం రాశారు. శివశంకరశాస్త్రి ఈ వ్యాసంలో కథానికలో వాడే భాషపట్ల ఆసక్తికర చర్చ చేశారు. 'కథానికకు కావ్య భాష వల్ల జీవకళ చెదిరిపోతుంది. వాడుక భాష వాడితేనే వర్చస్సు" అని స్పష్టం చేశారు. కథారచనలో వాడుక భాష అవసరాన్ని నొక్కి చెప్పారు. కథా రచన గ్రాంథిక లేదా శిష్ట వ్యావహారిక భాషలో వుండాలన్న ఆనాటి కొందరి వాదనను తిరస్కరించారు.

కథానికా రచన గురించి నాకు తెలిసి ఒకే ఒక్క కథ వచ్చింది. అది ప్రసిద్ధ కథా రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ (1896 – 1978, బాపట్ల) గృహలక్ష్మి మాస పత్రికలో రాసిన 'కథ ఎట్లా వుండాలె?'. ఈ కథానికలో కథా లక్షణాలు, నిర్వహణ గురించి ఎంతో ఆసక్తికరమైన, ఉపయోగకరమైన చర్చ చేశారు. ఉదాహరణకు "మనోహరమైన ఒక గులాబి పువ్వు యొక్క ఆకృతి, రంగు, మృదుత్వము, పరిమళము, మకరందము మననెట్లా ఆకర్షిస్తూ వుంటాయో అలాగే కథా కుసుమం కూడా కల్పన అనే ఆకృతి, వర్ణన అనే రంగూ, శైలి అనే మృదుత్వము, రసమనే పరిమళము, నీతి అనే

మకరందము గలిగి ఆకర్షవంతమైనదిగా వుండాలె. ఇందులో ఏది లోపించినా కథా కుసుమం రాణించదు". "ఏదైనా ఒక కథ వ్రాశాము అంటే అది సర్వవిధాకర్షణ కలదిగా వుండాలె." అన్నారు వరలక్ష్మమ్మ. కథా రచయిత్రి రాజేశ్వరి రాఘవరావు భార్యాభర్తల చుట్టూ తిరిగిన ఈ కథ కథారచయితలకు పాఠ్యప్రణాళిక వంటిది.

కందుకూరి వీరేశలింగం, గురజాడలకు అసలు సిసలు వారసుడు, కథా మార్గదర్శి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చెప్పిన మాటలను కూడా ఈ సందర్భంగా ఉటంకిస్తాను. "కథలంటే పైపైని వున్నాయనుకున్నావేమో? అవి కల్పించడానికి చాలా గొప్ప ప్రతిభ వుండాలి. వాటి విలవ తెలుసుకోడానికెంతో పరిజ్ఞానం వుండాలి. అవి చెప్పడాని కెంతో నేర్పుండాలి. అవి వినడానికెంతో రుచి వుండాలి. అవి బోధపరుచుకోడాని కెంతో బుద్ధి సూక్ష్మత వుండాలి" – అటు రచయితనూ ఇటు పాఠకున్ని యిద్దరినీ గమనంలోకి తీసుకొని అన్న ఈ మాటలను గుర్తుచేస్తున్నాను.

కథలు రాయడం గురించిన పుస్తకాలు గురించి కొద్దిలో కొద్దిగా...

శొంఠి కృష్ణమూర్తి రాసిన 'కథలు రాయడమెలా?' పుస్తకాన్ని నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ 'కథకులకు తొట్టతొలి సిద్ధాంత గ్రంథం' గా పేర్కొన్నారు. 'గ్రంథ పరిచయం' చేస్తూ కొడవటిగంటి కుటుంబరావు కథకులు కాబోయే వారు తమ బాధ్యతను తెలుసుకొనటానికీ, అయోమయ స్థితిలో కథారచన సాగించుతున్నవారు ఒక దారికి రావడానికీ ఈ పుస్తకం ఉపయోగపడగలదని ఆశిస్తున్నాను' (9–2–1955) అన్నారు. కాళోజీ నారాయణరావు 'రచయిత పరిచయం (16–2–1955) రాశారు. అందరూ కథకులు కావచ్చు! కథ అంటే ఏమిటి?, కథా రచన, మొదటి కథ, కథా రూపాంతరాలు, కథల రకాలు, శిల్పము, భావ విహంగాలను ఎగరేయండి!, మొత్తం ఎనిమిది అధ్యాయాలతో కూడిన సంపుటి యిది. శిల్పం అధ్యాయంలో గురజాడ 'దిద్దుబాటు' కథను ఉదాహరణగా తీసుకున్నారు. కథను గురించి ప్రసిద్ధ సాహితీవేత్తలు చెప్పిన విలువైన మాటలను చేర్చారు. కథా రచయితలకు ఎన్నో మంచి సూచనలు చేశారు. సలహాలిచ్చారు. చదవదగిన పుస్తకమని చెప్పాల్సిన అవసరం లేని పుస్తకమిది. ద్వితీయ ముద్రణ యిప్పుడు లభ్యం.

పోలవరపు శ్రీహరిరావు రచన 'ఒకే కథ అనేక రకాలు' గురించి: ముఖపత్రంపైనే 'ఎందరో సాధారణ పాఠకుల్ని కథా రచయితలుగా మార్చిన అపురూప గ్రంథం' అనీ 'కథా సాహిత్యానికి పాఠ్యగ్రంథం' అనీ పేర్కొన్నారు. ఈ పుస్తకంలో కథను గురించి ఇలా నిర్ధారణ చేశారు. 'ఒకే ఒక సంఘటనను చిత్రించి విషయాన్ని చెప్పేదే కథానిక. అంటే మనం ఏ సంఘటనతో కథను ప్రారంభించామో ఆ సంఘటన మాత్రమే ఆ కథలో వివరించబడి ఆ సంఘటనాంతంతోనే ఆ కథాంతం అయితే – అది కథానిక", "ఇతర పాత్రల సంభాషణల ద్వారా కాని, కొన్ని సంఘటనల సూచనలతో గాని చెప్పే పద్ధతిని 'కథనం' అనాలి" అన్నారు.

"కథకుడు విజయుడు కావాలంటే ఉదాత్తమైన కథా విషయాన్నే తీసుకోవాలి" "ప్రజా సమస్యల్ని చిత్రించి, పరిష్కార మార్గాన్ని చూపించినవాడే అభ్యుదయ కథకుడు", "ఒక సమస్యను యథాతథంగా చిత్రించడమే కథ"., "ఒక సమస్యను వివిధ కోణాలలో చూపించడంలోనే వుంది రచయిత ప్రత్యేకత"; "ఉత్తమమైన కళ – ఆదర్శాలు బోధించదు – ఆలోచనలు రేకెత్తింపజేసి ఆదర్శపథాన్ని వెదుక జేస్తుంది." ఇలా ఎన్నో విషయాలను ప్రగతిశీల దృష్టితో చెప్పారు శ్రీహరిరావు.

ఈ పుస్తకంలో కాబోయే కథారచయితలకు ఒక అభ్యాసాన్ని యిచ్చారు. "రోడ్డు మీద ఒక రిక్షాలో ఒక స్త్రీ ప్రయాణం చేస్తుంది. వెనుక నుంచి ఒక పురుషుడు 'ఆగూ, ఆగవోయ్' అంటూ పరుగెత్తుకొచ్చి – 'తిప్పు వెనక్కి' అన్నాడు. స్త్రీ 'వద్దు, పోనీయ్ ముందుకి' అంది. 'వద్దు రమ్మంటూంటే' అన్నాడు పురుషుడు". దీనిని కథాంశంగా తీసుకొని వివిధ కోణాలలో పదిహేను రకాలుగా రాసి మన ముందుంచారు. నిజానికీ పుస్తకం సాహిత్య విద్యార్థులకు గొప్ప పాఠ్యగ్రంథం.

శార్వరి సంకలనం చేసిన కథలు వ్రాయడం ఎలా! (మరో శీర్షిక కథలెలా రాస్తారు?) లో 'మూడు తరాల కథకులున్నారు. తెలుగు 'కథ'కు అలంకారాలు దిద్దిన వారు వీరిలో వున్నారు". శార్వరి తన ముందుమాటలో "ఇది కథా వ్యవస్థకు అలంకారమే కాక అలంకారశాస్త్రంలో ఆధునిక రచనా ప్రక్రియ అయిన 'కథ'పై సమగ్ర శాస్త్రీయ పరిశీలనం' అని పుస్తకాన్ని గురించి వివరించారు. 'కథలు వ్రాయడం ఎలా?' మల్లాది రామకృష్ణశాస్త్రి వ్యాసంతో మొదలై కేతు విశ్వనాథరెడ్డి 'కథా రచనలో ఆసక్తి, ఆర్తీ, అసంతృప్తి' వ్యాసం వరకూ 31 వ్యాసాలున్నాయి. కేతు 'ఎందుకు రాయాలనుకోవటం? ఏమిటి రాయటం? ఎట్లా రాయటం?, ఎవరికోసం రాయటం? ఏ ప్రయోజనం కోసం రాయటం? అనే ఐదు అంశాలను పాఠకులకు అందించారు. ఈ పుస్తకంలో 'ఒకే సన్నివేశంపై

నాలుగు కథానికలు' అనే అంశంపై 'సంవేదన' మొదటి సంచికలో కథా రచన మీద జరిగిన ప్రయోగాన్ని పాఠకుల ముందుంచారు. 'వాడిన మల్లెలు' శీర్షికన సొదుం జయరాం, రాచమల్లు రామచంద్రారెడ్డి, ఆర్వియార్ మరియు 'నవ్విన మల్లెలు' శీర్షికన టి. సాంబశివారెడ్డి రాసిన కథలను అందించారు. ఒకే ఇతివృత్తం – నాలుగు రచనలను కొడవటిగంటి కుటుంబరావు సమీక్షించారు. ఇది కూడా యువ రచయితలకు ఒక అభ్యాసం.

కథా నిలయం నిర్మాత, ప్రముఖ కథారచయితా కాళీపట్నం రామారావు 'కథా కథనం' వ్యాస సంపుటాన్ని వెలువరించారు. ఈ వ్యాససంపుటిలో చోటుచేసుకున్న 'కాళీపట్నం రామారావు రచనలు' లో కథ రాయటం గురించి, కథ గురించీ యింకా యితర వ్యాసాలూ వున్నాయి. "లోకం మాట అటుంచి కనీసం తమకు జరిగే మంచి చెడులనైనా గుర్తించే శక్తుండాలి. న్యాయాన్యాయాలకు స్పందించే స్వభావమైనా ఉండాలి. ఇవేవీ లేనివారు రచయితలు కాలేరు" అని కథా రచయితల కుండాల్సిన కొన్ని లక్షణాలను 'కథలు రాయడం గురించి–1' అనే అతి చిన్న వ్యాసంలో చెప్పారు. 'యువ రచయితలకు కథ గురించి..!; 'కథలెలా రాస్తారు?' కథ రాయడం గురించి – 2, కథంటే, కథ రాయడం గురించి–3 – కథాంగాలు 1, వర్ణనలు వ్యాసాలున్నాయి. ఈ సంపుటిలో కథకు సంబంధించి అనేక అంశాలతో ఒక పాఠ్య ప్రణాళికను కాళీపట్నం రామారావు రూపొందించారు. కథ రాయాలనుకునే వారూ, రాసే వారూ తప్పక చదవాలి ఈ పుస్తకాన్ని.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచన వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'కథాశిల్పం'. 'అనుశీలన' వ్యాససంపుటిలో 'కథాంగాలు' వ్యాసం రాసిన వల్లంపాటి కథాశిల్పం ద్వారా కథా విమర్శను మరింత విస్తృత పరిచారు. 'కథా వస్తువునూ, కథా శిల్పాన్నీ, వాటి మధ్య ఉండవలసిన సంబంధాన్నీ చర్చించటం ఈ పుస్తకం ఉద్దేశం' అని ముందుమాటలో చెప్పినట్టే కథాశిల్పాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. ఇందులో మంచికథ – నాలుగు లక్షణాలు, కథాంగాలు, కథాకథనం వంటి విలువైన అధ్యాయాలున్నాయి.

కథా రచయితగా ప్రసిద్ధి చెందిన బి.ఎస్. రాములు కథానికా విద్యార్థులకు అందించిన పుస్తకం 'కథల బడి – కథా సాహిత్య అలంకార శాస్త్రం' (1998). ఈ పుస్తకాన్ని మూడు భాగాలుగా విభజించి వాటిల్లో 28 వ్యాసాలను అందించారు. ముందుమాటలో "ఈ పుస్తకాన్ని కథలు రాయనేర్పడం నుంచి కథలు బాగా రాసే దాకా ప్రణాళికతో రూపొందించడం జరిగింది" అన్నారు. యువ రచయితలు చదవాల్సిన పుస్తకాల జాబితాను సైతం కూర్పు చేశారు. ప్రజల సాహిత్యావసరాలను తీర్చడం ప్రజా రచయితల కర్తవ్యం, కథా రచయితలు సమాజానికి మార్గదర్శకులు శీర్షికన కథారచయితలకు అనేక విషయాలను సాహిత్యాధ్యాపకుడి రూపమెత్తి అందించారు బి.ఎస్. రాములు.

తెలుగు కథా సాహిత్యంలో మంచి కథకుడిగా పేరొందిన మహమ్మద్ ఖదీర్‌బాబు 'ఈ పుస్తకం రాస్తానని, ఇలాంటి పుస్తకం రాస్తానని నేనెప్పుడూ అనుకోలేదు. ఇది నా పని కూడా అనుకోలేదు' అంటూనే కథా వ్యవస్థకు 'కథలు ఇలా కూడా రాస్తారు' (2016) అనే 326 పుటల పుస్తకాన్ని కానుకగా అందించారు. కథలెలా రాస్తారు?, ప్లాట్ అంటే ఏమిటి? థీమ్ అంటే ఏమిటి? కాన్‌ఫ్లిక్ట్ అంటే ఏమిటి? విషయాలతో పాటు అనేక కథాంశాలు, కొన్ని మంచి కథలు, కొందరు కథకుల పరిచయాలతో కూడిన ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి సాహిత్య విద్యార్థులు. అందుబాటులో వుంది.

"అంతర్జాతీయ స్థాయికి చేరిన తెలుగు కథానికా ప్రక్రియకు అరసం అందిస్తున్న ఒక అపురూప కానుకైన ఈ వ్యాస సంకలనం ఒక శాస్త్రీయ కథానికా శాస్త్రం. కథానికా పాఠ్యగ్రంథం. కొత్తగా రచనలు చేయాలనుకునే వారికి, చేస్తున్న వారికి ఒక కరదీపికగా వెలుగులందిస్తుందని మా ఆశ" అని అరసం – గుంటూరు జిల్లా శాఖ మే 2016లో వెలువరించిన పద్దెనిమిది విలువైన వ్యాసాల సంకలనం 'కథానిక – పాఠాలు' (కథా రచనలో మెలుకవలు) కు రాసిన సంపాదకీయంలో వల్లూరు శివప్రసాద్ అన్న మాటలు నిజం. ఈ పుస్తకమూ అందుబాటులో వుంది.

మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణల సంపాదకత్వంలో విశాలాంధ్ర వెలువరించిన 'తెలుగు కథకులు – కథనరీతులు' నాలుగు సంకలనాలూ తప్పక చదవండి. వందమంది ప్రముఖ కథకులు మీకు చేరవవుతారు. ప్రసిద్ధ కథా విశ్లేషకులు కోడూరి శ్రీరామమూర్తి రాసిన మా మంచి కథ, అందాల కథ, కథాసుధ, తెలుగు కథ నాడు – నేడు పుస్తకాలు చదివితే ఎన్నెన్నో మంచి కథలు మనకు పరిచయమవుతాయి. సాహిత్య విద్యార్థులు ఈ పుస్తకాలు, వ్యాసాలు శ్రద్ధగా చదివితే కథా రచన చేయటంలో సరైన అవగాహన కలుగుతుంది. మంచి కథకులూ అవుతారు. చదవండి మరి! ♦

కవిత

## ఓసారిలా చూడవూ...

- పక్కి రవీంద్రనాథ్
9440364486



ఓ కన్నీటి బిందువు కింద
నువ్విలా నిస్తేజంగా పడివుండడాన్ని
చూడలేను.
మన ఏకాంతాన్ని గొంగళిపురుగై నమిలేస్తున్న
ఈ ఒంటరితనాన్నిక తట్టుకోలేను.
మీద పడుతున్న ఒక్కో వ్యాకుల ఘాతానికీ
తల్లడిల్లుతున్న నీ శరీరంపై
నిద్రలేని నా చూపులను లేపనంగా పూస్తునే వున్నాను.
పక్షులు గూళ్ళు విడిచి చాలా సేపయింది.
మన గూటి ముందు ఉదయమింకా వాలలేదు.
నీ మునివేళ్ళ స్పర్శలేక
మన ఇంటి వాకిలి చీకట్లో రోదిస్తోంది.
ఒక శూన్యం సముద్రమై విస్తరిస్తున్న అలికిడి
నన్ను వణికిస్తోంది.
దేహాలారబోసుకునే వెన్నెల్లోనో
ఆత్మలను ఆవిష్కరించుకునే
ఆకుల గుసగుసల్లోనో
చేతుల్లో చేతులుంచి మనం నడుస్తుంటే
ఎప్పుడూ ఇష్టంగా వెంట నడిచొచ్చే ఆమని
ఈ రోజు ఆందోళనతో
హరితాన్ని రాల్చుకుంటోంది.
ఈ రుజాగ్రస్త ఘడియలను అవతలకు నెట్టి
నా ఛాతీపై నువ్వు వేకువై కళ్ళు తెరిచే
క్షణం కోసం నా గుండె కొట్టుకుంటోంది
నీ ఊసుల కిలకిలలు సందడి చేసే
ఒక సుప్రభాతం కోసం ఆశగా నిరీక్షిస్తోంది.
ఏదో రోజు స్వస్థత నీ తల నిమురుతుందనే ఆశ
నన్నింకా బతికిస్తోంది.
నా అక్షరాలకు పూలరెక్కలు తొడిగి
నీ హృదయ ద్వారం ముందు నిలుచుండబెట్టాను.
ముకుళిత భావాల పరిమళాన్ని
మన జ్ఞాపకాలపై చిలకరిస్తూనే వున్నాను.
నువ్వు పంచిచ్చిన మధుర స్మృతుల తడిలో
కాలాన్ని చిగురింపజేసే ఓ కొత్త ఋతువును
మనకోసం కలగంటున్నాను. ◆

---


## నలుపు కలలు

పద్మావతి రాంభక్త
9966307777



నలుపుకూ
రంగురంగుల కలలుంటాయి
స్వేచ్ఛగా ఎగిరి
నింగిని అందుకునే
అందమైన రెక్కలూ ఉంటాయి
వాటికీ భూమ్మీద
తమదైన అస్తిత్వముంటుంది
నువ్వు ఒక నలుపు కలని
నిర్దాక్షిణ్యంగా నలిపేసి
గర్వంగా మీసం మెలేసావు
ఒక్కసారి కల కనురెప్పలెత్తి
చూడాల్సింది
నెత్తుటిజీరలు పులుముకున్న కల
ఎర్రెర్రని రంగుతో
ఆకాశం ముఖం నిండా
ఎలా విస్తరించగలదో తెలిసుండేది
తరతరాల పొగరు
నీ నరనరాల తెలుపులో
ప్రవహిస్తుంటే
ఇంత ఘాతుకానికి ఒడిగట్టావు
వివక్ష సిరాతో
చరిత్ర పుటలలో
మరో అసహ్యకరమైన
అధ్యాయాన్ని లిఖించావు
ముందుకు పరుగెడుతున్న కాలంలో
నువ్వింకా ఆదిమానవుడివై
వెనక్కి నడుస్తున్నావు
ఇప్పుడు చూసావా
ఎన్నో నలుపు కలల కెరటాలు
సునామీసముద్రాలై
విరుచుకు పడుతున్నాయి
చేతనైతే నీ కాలు కదిపి చూడు
అవి నీ కీళ్ళు విరిచేస్తాయి
అవి సంధించే
నిప్పులాంటి ప్రశ్నలకు
భయపడి పాతాళంలోకి
పారిపోవడం కాదు
అవి సింహాసనం
నాలుగు కాళ్ళను కదిలించి
నీ ఉనికే లేకుండా చెయ్యగలవు
మున్ముందు రోజుల్లో
నీ ఆధిపత్యం
ఒక చెల్లనినోటై మిగిలిపోతుంది ◆

విశ్లేషణ




ఆచార్య
పసుల వెంకటరెడ్డి



# ప్రకృతి అడుగుజాడల్లో పయనిస్తున్న కవి


అంపశయ్య నవీన్
9989291299


*ఈ తరహా కవిత్వాన్ని ఇంతకు ముందెవరూ రాయలేదు. తనకున్న విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానాన్ని కవిత్వం రాయడం కోసం ఇంతగా వినియోగించుకున్న మరొక కవి తెలుగు కవితా ప్రపంచంలో కనిపించరు.*

నిజానికి విజ్ఞానశాస్త్రాన్ని, (సైన్స్) కవిత్వానికి ముడిపెట్టడం చాలాకష్టం. కవిత్వానికి విజ్ఞానశాస్త్రం చుక్కెదురు.

ఇంగ్లాండ్ దేశానికి చెందిన జాన్‌కీట్స్ అనే మహాకవి ఇంద్రధనస్సులో ఆ రంగులెందుకు యేర్పడతాయో శాస్త్రీయంగా విశదీకరించినందుకు ఆనాటి గొప్ప సైంటిస్టు ఐజాక్ న్యూటన్ ను క్షమించలేనన్నాడు, ఎందుకంటే ఇంద్రధనస్సులోని రంగుల్ని చూస్తూ ఆనందించటం, తన కవితాశక్తితో అద్భుతంగా వర్ణించటమే తనకు ఆనందం. ఆ వర్ణనల్ని చదువుతున్న పాఠకులకు ఆనందం. అంతేగాని విజ్ఞానశాస్త్రం దృష్ట్యా ఇందధ్రనస్సులో రంగులు ఈ కారణాల చేత యేర్పడతాయంటే దాన్లోని సౌందర్యాన్నంతా బట్టబయలు చేసినట్టే కదా అనేది కవి అయిన కీట్స్ వాదం. సైన్స్ చెప్పే కార్యకారణ సంబంధం కవిత్వానికి అనవసరం. అలాగే ఆకాశంలో రాత్రుళ్ళు దర్శనమిచ్చే చందమామను గూర్చి బోల్డు కవిత్వం రాశారు. అందమైన స్త్రీల ముఖాల్ని చందమామతో పోలుస్తుంటారు కాని చంద్రుని మీదకెళ్ళచ్చిన వ్యోమగాములేం చెప్పారు: చంద్రుడంటే భూమి చుట్టూ తిరిగే ఒక చిన్న ఉపగ్రహమని, అక్కడ రాళ్ళూ రప్పలు తప్ప మరేమి లేవని, కనీసం చంద్రునికి స్వయం ప్రకాశం కూడ లేదని, సూర్యకాంతే చంద్రుని మీద పడి వెన్నెలగా రూపాంతరం చెంది మన భూమ్మిదికొస్తుందని సైన్స్ నిర్ద్వందంగా రుజువు చేసింది. ఇట్లా సైన్స్‌కూ కవిత్వానికి పడదని ఎన్ని ఉదాహారణలైనా చెప్పొచ్చు. అయితే ఇటీవలనే సైన్స్ మనకందించిన విజ్ఞానం ద్వారా మంచి కవిత్వం రాయవచ్చునని ఆచార్య వెంకటరెడ్డి, ఆయన ప్రచురించిన ప్రకృతి అడుగుజాడల్లో అనే కవితా సంకలనంతో రుజువుచేశాడు. వెంకటరెడ్డి చాలా కాలం కాకతీయ విశ్వ విద్యాలయంలో జంతుశాస్త్ర అధ్యాపకుడుగా, పరిశోధకుడిగా పని చేసాడు. జంతుశాస్త్రానికి సంబంధించిన ఎన్నో పరిశోధన పత్రాలను ప్రపంచంలోని అనేక దేశాల నుండి వెలువడే ఎన్నో ప్రతిష్టాత్మకమైన విజ్ఞానశాస్త్ర జర్నల్స్‌లో ప్రచురించాడు. అయితే జంతుశాస్త్ర అధ్యాపకుడుగా పదవి విరమణ చేశాక తనకున్న జంతుశాస్త్ర విజ్ఞాన సంపదలో కొంత భాగాన్ని కవిత్వంగా మలచాలన్న కోరిక ఆయనకు కల్గింది. దాంతో ఆయన ఒకదాని తర్వాతొక కవితను రాసేస్తూ, కొన్ని వందల కవితల్ని రచించాడు. ఈ కవితల్ని చదివి వాటిని “నేనువిజ్ఞానశాస్త్ర ఆధారిత కవిత్వం” అన్నాను.

నిజం చెప్పాలంటే, ఈ తరహా కవిత్వాన్ని ఇంతకు ముందెవరూ రాయలేదు. తనకున్న విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానాన్ని కవిత్వం రాయడం కోసం ఇంతగా వినియోగించుకున్న మరొక కవి తెలుగు కవితా ప్రపంచంలో కనిపించరు.

“జీవితమే సృష్టి” అన్న కవితలో ఆయనకున్న శాస్త్రీయ విజ్ఞానం ఎలా కవిత్వీకరించబడిందో చూడండి.

*“మరణమన్నది*
*చిదిమేసిన శ్శబ్దం మాత్రమే*
*సుదూరాంతాల వ్యాపించిన*
*షూన్యానికి సారాంశం మాత్రమే*

*జీవపదార్థమనేది*
*జీవంలో ఆకారాల తుఫానుల్లో చేలరేగిన*
*పరమాణువుల సమూహమే,*
*ఎప్పుడూ కొత్త కొత్త ఆకృతులను సృష్టిస్తూ*
*అవకాశాన్ననుసరించే జన్యుపదార్థం*
*చిత్రవిచిత్రమైన, అగాధ ఆలోచనా క్రియలో*
*భావ గ్రస్తమైన, మెదడు పొరల్ని రూపొందిస్తూ*
*తన గురించి తానే అబ్బురపడే అద్భుతం"*

ఇలా మానవ సృష్టి జరగటమన్నది ఒక అద్భుతమంటాడీ కవి.

ప్రకృతిలోని వృక్ష సంపదను గూర్చి చెబుతూ

*ఆకులు పువ్వులు కాయలే కాదు*
*చెట్టంటే జీవనచైతన్యానికి ప్రతీక*
*అడవి గుండెలో నిక్షిప్తమైన*
*బొగ్గు నిల్వలు, చమురు నిల్వలు*
*అపార ఖనిజ నిక్షేపాలు*
*ఒదిగి పోయిన వృక్ష సంపదలే*
*అవి నిక్షేపాలేకాక చెట్ల అవశేషాలు కూడా*
*తన అవశేషాలను కూడా*
*మానవాళికే అంకితం అంటున్న*
*అడవి తల్లికి జేజేలు!"* అంటాడు వెంకటరెడ్డి.

రోజూ మనం చూసే చీమల్ని గురించి మనమెప్పుడైనా ఈ కవిలా ఆలోచించామా?

*"చీమలు నిజానికి శాంతియుత జీవులు*
*క్రమ శిక్షణగల సాధు జీవులు*
*దాటివచ్చిన మైలురాళ్ళను*
*నడచివచ్చిన దారిని మరవవు*
*బారులు తీరిన చీమలు సుశిక్షిత సైనికులే*
*పక్క పక్కగా పుట్టలున్నా సరిహద్దులుంటాయి*
*అందులో తనవారికే ప్రవేశార్హత*
*దౌర్జన్యం జరిగితే వాడిగా వేడిగా పోరాటమే*
*చీమల పుట్ట అద్భుత నిర్మాణ చాతుర్యం*
*సృజనాత్మకతకు నిర్వచనం*
*రాణి చీమ జీవితకాలంలో*
*మగచీమతో ఒకేసారి జతకడుతుంది*
*మగచీమలు విగత జీవులవుతాయి*
*రాణిచీమ రెక్కలు విదిల్చి*
*ఆవాసం దొరికితే గుడ్లు పెడుతుంది*
*శ్రామికచీమలన్నీ రాణిచీమ సంతతే*
*లైంగికంగా ఆడచీమలైనా గుడ్లుపెట్టవు*
*వేలసంఖ్యలో శ్రామికచీమలు, రాణిచీమ*
*ఒక సహనివేశంగా ఏర్పడతాయి"*

ఇలా చీమల గురించి ఇన్ని నిజాలు చెప్పిన మరొక కవి ఎవరైనా ఉన్నారా?

అలాగే తేనెటీగల్ని గురించి ఈ కవి రాసిన ఈ కవితను చూడండి:

*"ఆడ తేనెటీగలు పల్లవిగా*
*మగ తేనెటీగలు అనుపల్లవిగా*
*కలయికకు సమాయత్తమై కదిలిపోతాయి*
*కమనీయ భావంతో ఎగిరి పోతాయి*
*మగ తేనెటీగలది అనిషేక జననం అయినా*
*కార్యం పూర్తి చేసి కనుమరుగౌతాయి*
*తేనె టీగల నైపుణ్యం సహజాతమే అయినా*
*కీటక పరిణామంలో అపూర్వం అద్భుతం*
*కీటక నిర్మిత ప్రజాస్వామ్యానికి*
*కీటక నిర్మిత సమానత్వ సూత్రానికి*
*అభ్యుదయానికి సంకేతం"*

మానవాళిలో తప్ప సమస్త కీటక సమూహంలోనూ, జంతు సమూహంలోనూ సృష్టికి మూలం స్త్రీ జాతేనని, పురుష జాతి పాత్ర చాలా నిమిత్తమాత్రమేనని ఈ కవితలు చదివితే అర్థమౌతుంది.

కరోనా వైరస్ పుణ్యమా అని ఈ మధ్య మనం గబ్బిలాలను గూర్చి చాలా వింటున్నాం. గబ్బిలాలలోనే కరోనా వైరస్ ఉంటుందని, గబ్బిలాల ద్వారనే చైనాలో కరోనా వ్యాప్తి చెందిందని కొన్ని వార్తా ఛానళ్ళు ప్రచారం చేస్తున్నాయి. గబ్బిలాలను గూర్చి ఈ కవి యేమంటున్నాడో చూడండి:

*"ఆర్కిటిక్ అంటార్కిటికా మినహా గబ్బిలాలు*
*కొండల్లో, గుహల్లో , నిర్మించుకొన్న ఆకుల గుడారాల్లో*
*దేవాలయాల్లో, శిధిల కట్టడాలలో జీవిస్తూ*
*మొదటి చూపులో అసహ్యమేసే గబ్బిలం*
*సునిశితంగా చూస్తే వాటి శుభత విస్మయమే*
*భూమ్మీద ఎగురగలిగిన ఏకైక క్షీరదం గబ్బిలం*
*ఎగిరే శక్తి ఉన్నా కాళ్ళతో నడవలేని గబ్బిలాలు*
*ఈనాడు నిశాచర సామ్రాజ్యానికి అధినేతలు"*



## మార్పు

- సమీర్
9493932333

పుట్టినప్పుడు తెలీదు..
నేను మారిపోతానని...కానీ...
నేను మారిపోయాను
అమ్మ ఒడిలో వెచ్చగా
పడుకున్నప్పుడు తెలీదు
ఊయలలో పడుకున్నప్పుడూ
తెలీదు..
నాన్న నాకు అడుగులు
నేర్పినప్పుడూ తెలీదు..
పసితనపు చూపులతో
చుట్టూ ఉన్నవాళ్ళని చూస్తున్నప్పుడూ
తెలీలేదు
ఊహ వచ్చాకా తెలీదు..
ఎదుగుతున్నప్పుడూ తెలీలేదు
స్నేహితులు, బంధువుల..
తియ్యటి పలకరింపులు
విన్నప్పుడూ తెలీదు..
ఒక స్థాయికి వచ్చేదాకా తెలీలేదు..
నేను.. మారి పోతానని
కానీ... నేను మారిపోయాను!
చివరికి... పెళ్లయ్యాక తెలిసింది
నేను మారి పోయానని
కానీ.. ఇంతలా మారతానని తెలీదు
తల్లిదండ్రులని
వృద్ధాశ్రమాల్లోకి నెట్టాక తెలిసింది...
బంధువుల్ని చూస్తేనే...
చిరాకు పుట్టే స్థాయికి వెళ్ళాక..
తెలిసింది
స్నేహితులని దూరం చేసుకున్నాక తెలిసింది
ఆత్మీయుల్ని సైతం ఆదరించనప్పుడు.. తెలిసింది
ఇతరుల్ని చులకన చేసాక తెలిసింది..
నేను.. మారి పోయానని..
జీవితపు చరమాంక దశకు చేరుకున్నాక తెలిసింది..
ఈ మార్పు వల్ల ఏమీ సాధించలేకపోయానని..!
అప్పుడే తెలుసుకున్నాను...!!
ఇక తెలుసుకోవడానికి ఏమీ లేదని..!!! ◆

---

అంటూ

*"కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన గబ్బిలాలు*
*ప్రకృతిలో ఒదిగిపోయిన రైతు నేస్తాలే*
*ఆడగబ్బిలాల ప్రత్యుత్పత్తి వ్యూహరచన ఒక అద్భుతం*
*జతకట్టడం, ఫలదీకరణ, సంయోగబీజ ప్రతిస్థాపన*
*గర్భధారణ, పిండం పెరగడం, ప్రసవం, పిల్లలపెంపకం*
*ప్రత్యుత్పత్తి ప్రక్రియలో అన్నీ కీలక దశలే*
*క్రమ పద్ధతిలో వాయిదాలు లేకుండా ముందుకు సాగాలంటే*
*సమృద్ధిగా ఆహారలభ్యత అనువైన ఆవాసం*
*అనుకూల పర్యావరణ స్థితిగతులు ఉంటేనే సాధ్యం*
*ప్రతికూలత ఉంటే ప్రతి దశలో ఆలస్యం తప్పనిసరి*
*ఇలాంటి ఇచ్ఛాపూర్వక నియంత్రణ మనిషిలో ఉంటే*
*జనాభా నియంత్రణ సజావుగా సాగేదేమో!"*

చూశారా? మనం అసహ్యించుకునే గబ్బిలంలో ఎన్ని గొప్ప గుణాలున్నాయో! పూర్వం మహాకవి జాషువా గబ్బిలం మీద ఒక గొప్ప కావ్యం రాసిన విషయం ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవాలి.

పిచ్చుకలు అల్లే గూళ్ళను గురించి ఈ కవి ఒక గొప్ప కవిత రాశాడు.

*"అది బంగారు పిచ్చుక, అల్లికలో దిట్ట*
*అదే మన గిజిగాడు.*
*భూతలంపై వందకు పైగా జాతులతో*
*వైవిధ్య భరిత ఆకృతులతో గూళ్ళు*
*విభిన్న ప్రవర్తనలూ వింతైన అలవాట్లు*
*చెరువుల్లో, నదీ తీరాల్లో బావుల్లో వంగిన*
*చెట్ల చిటారు కొమ్మల్లో, రెమ్మల్లో*
*కళాత్మకంగా వేలాడే గూడునిర్మాణశైలి*
*కవిత్వానికి అందని సౌందర్య సృజనే!*
*కట్టిన గూడు ఎండకు వానకు చెక్కుచెదరదు*
*మగపక్షి వేసే ఈలలు ఆడ పక్షిని ఆహ్వానించటానికే!*
*ఆడ పక్షికి గూడు నచ్చితే జతకడుతుంది*
*లేదంటే మగపక్షికి నిరీక్షణే!"*

ఇలా ప్రకృతిలోని వైచిత్రిని, సౌందర్యాన్ని, సృష్టి రహస్యాలను తన కవిత్వంలో రంగరించి మనకందించిన వెంకటరెడ్డికి మనమంతా కృతజ్ఞులమై ఉండాలి. ఎందుకంటె ఇలా ప్రకృతి రహస్యాలను మనకు విశదీకరించి చెప్పే కవులు చాలా తక్కువ మంది ఉంటారు.

మనిషనేవాడు మన ప్రకృతిని ధ్వంసం చెయ్యకుండా దాన్ని కాపాడాలి. ప్రకృతిలోని సమతౌల్యత దెబ్బ- తింటే అది మన వినాశనానికే దారితీస్తుంది. ప్రకృతిని ధ్వంసం చేస్తే ప్రకృతి అనేక రూపాల్లో మనమీద ప్రతీకారం తీర్చుకుంటుంది. ఇవాళ మనం ఎదురుకొంటున్న కరోనా మహమ్మారి ప్రకృతి మన మీద పగతీర్చుకుంటున్నద- నటానికి సంకేతమే. ◆

## కవిత

# కరివేపాకు అమ్మి..

డాక్టర్. జోస్యుల కృష్ణబాబు
9866454340



అమ్మగారూ..!
అంటూ వీధిగుమ్మంలోంచి
నువ్వు పెట్టే కేక..నన్నేకాదు..మొత్తం
వీధి వీధినంతటినీ..ఒక్కసారిగా..
పరిమళ భరితం చేస్తుంది..!

ప్రొద్దున్నే..
బాలభాస్కరుని..
ఉదయకిరణాలను..
నీ లేలేత..చిరునవ్వులతో..
నెట్టుకొంటూ వేగంగా..
దూసుకొస్తావు నువ్వు..!

దూరాలన్నీ..
అడుగులతోనే..దాటుకొంటూ..
ఒయ్యారంగా..
నడిచొచ్చే నల్లకలువలా..
మా సందులోకి ప్రవేశిస్తావు..
నెత్తిమీది గంపను..
సునాయాసంగా..అరుగుపై దింపి..
ఆశగా..గేటువైపు చూస్తుంటావు..!

ఏంటో..నీ కేక..
చెవిన బడగానే..
ఇక ఇంట్లో ఏమాత్రం
ఉండబుద్ధికాదు..!
గుమ్మంముందు..
నల్లచందనపు.. బొమ్మలా నిలబడ్డ..
నిన్నుచూడగానే..
ఇవ్వాళేం వద్దులే..
అన్నమాట..గొంతులోంచి..
అస్సలు పెగలదు..!
అవసరం లేకపోయినా..

కరివేపాకో..తోటకూరో...కొత్తిమీరో
ఏముంటే అది..
తీసుకోవాలనిపిస్తుంది..!

అమ్మగారూ..!
ఆకు ముదిరిపోతోంది
కరేపాకు కోసుకోనాండీ..?
అంటూ..నువ్వడిగితే..
ఎలా..కాదనాలని పిస్తుంది..
ఇప్పుడే కాదు ఇక ఎప్పటికీ
మా పెరటిలోని ఆ చెట్లు నీవే..
అనాలనిపిస్తుంది..!

బదులుగా నువ్విచ్చే..
ఆ యాభైయ్యో..వందో..
తీసుకోవటానికి..నీ శ్రమ..నీ కష్టం..
నీ చెమట..నీ గమనం..ఇవన్నీ
నన్ను అడ్డుకొంటూ ఉంటాయి..!
వద్దన్నా నువ్వు వినవు కదా..!
ఈ గోంగూర తీసుకోండమ్మా..
పోనీ.. ఈ ములగకూర తీసుకోండి..
అంటూ..ఋణం తీర్చేయటానికే..
ఎప్పుడూ చూస్తావు..!

ఒక్క రెండురోజులు..
వరుసగా..నువ్వు
కనిపించకపోయినా..
నీ పిలుపు వినిపించకపోయినా..
అదేంటో..మనసేకాదు..
మా సందంతా..
మూగబోతుంది..!
వసంతంలో..కోయిల..కనిపించని
వెలితి మమ్మల్ని చుట్టేస్తుంది..!

నువ్వు..నీ కష్టాన్ని
మా చేతుల్లో పెట్టి..
మేమిచ్చే..ఆ ఐదో పదో తీసుకొని
గోవర్ధన గిరిలాంటి..ఆ గంపను
మళ్ళీనెత్తిన పెట్టుకొని..
రయ్ మంటూ..
వెనుదిరిగి వేగంగా..
బయలుదేరి
వెళుతుంటే..వెనుకే
నిన్ను..చూస్తూన్న..
నా మనసు..భారమవుతూంటుంది..!
పొద్దువాలుతున్నా..
ఇంకా ఈ బరువు..
ఎన్నాళ్ళు..అనుకొంటూ..! ♦



# చర్చల మార్గం క్షేమదాయకం

- తెలకపల్లి రవి

*జనాభాలో అతిపెద్దవైన ఈ రెండు ఇరుగుపొరుగు దేశాలు సత్సంబంధాలు కాపాడుకోవడం ఆసియాలోనూ మొత్తం ప్రపంచంలోనూ కూడా శాంతికి ఎంతైనా దోహదకరం. ఇండియా, చైనా, రష్యా ఒకటిగా వ్యవహరిస్తే సామ్రాజ్యవాదుల ఆటలు సాగబోవని లెనిన్ ఏనాడో చెప్పిన మాట. ఈ పొందికను దెబ్బతీయాలన్నది అమెరికా వ్యూహం. భారత దేశంలోని పాలక వర్గాల అభివృద్ధి నిరోధకుల ఆశ. ఇప్పుడు చైనా సరుకుల బహిష్కరణ వంటి నినాదాల సారాంశం అదే. వూరూరా వెలసిన చైనా బజార్‌లు, చైనా ఫుడ్ సెంటర్లను ఆపడం నిజంగా సాధ్యమయ్యేదేనా? చౌకగా ఉపయోగకరంగా అవి లభిస్తుంటే వ్యాపారులు, వినియోగదార్లు కూడా ఎలా బహిష్కరిస్తారు?*

లడ్డాఖ్ సరిహద్దులలో భారత చైనా ఘర్షణ, సైనికుల మృతి అత్యంత దురదృష్టకరమైన పరిణామం. అందులోనూ 45 ఏళ్ల తర్వాత ఇలాటి ఘటన సంభవించడం, మృతి చెందిన భారతీయ సైనికులలో తెలుగువాడైన కర్నల్ సంతోష్ కూడా వుండటం మరింత ఉద్వేగానికి కారణం కావడం సహజం. శుక్రవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలోనూ అన్ని పార్టీలనేతలూ దేశం తరపున వారికి జోహార్లు సమర్పించారు. ఇలాటి ఉద్రిక్తతల నేపథ్యంలో మన మీడియా కథనాలు, చర్చలూ వివిధ రకాల విశ్లేషణలు, విద్వేష పూరితమైన పిలుపులూ ఎప్పుడూ చూస్తున్నవే. మరోవైపున చైనా సైన్యం దగ్గర భారత సైనికులు బందీలుగా వున్నారని వచ్చిన వార్తలను ఉభయ దేశాలూ తోసిఉచ్చాయి. అలాగే మీడియాలోనూ సోషల్ మీడియాలోనూ కొన్ని శక్తులు సంస్థలూ నాయకులూ చేసిన చేస్తున్న అవాంఛనీయమైన హడావుడి అఖిలపక్షంలో కనిపించకపోవడం గమనించదగ్గది

స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ఏర్పాటు చేసిన సమావేశంలో సరిహద్దు ఘర్షణలను ఉద్రిక్తతలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని ఏకాభిప్రాయం వ్యక్తం కావడం హర్షించదగింది. ఇప్పటికే ఇరు దేశాల ఉన్నత స్థాయి చర్చలలో కుదిరిన అవగాహనకు సంబంధించిన వాక్యాలను సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఉటంకించారు. భారత ప్రభుత్వం ఈ విధానం తీసుకున్నందున తాము మద్దతు చెబుతున్నామని సీతారాం ఏచూరి సిపిఎం తరపున చేసిన వ్యాఖ్యలు ఈ కీలక ఘట్టంలో అర్థవంతమైనవి. చైనా సైనికులు మన భూభాగంలోకి చొచ్చుకు రాలేదని మోడీ స్పష్టంగా చెప్పారు. ఇదే సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ వారెలా మన భూభాగంలోకి చొచ్చుకు వచ్చారు? నిఘా వైఫల్యం వుందా? తదితర ప్రశ్నలు వేశారు. ఇక రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో చైనాకు ఎంత ధైర్యం; ఎలా వచ్చారు? తదితర ప్రశ్నలు కొనసాగిస్తూనే వున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంప్రదింపుల ద్వారా ఉద్రిక్తతలు ఉపశమనం కోసం కృషి చేస్తున్నట్టు ఈ సమావేశం ముందుచేసిన ప్రకటనపైనా రాహుల్ ఇలాగే దాడి చేశారు.

## కుటిల ప్రచారాల బండారం

మరోవైపున సంఘ పరివార్ భావజాలాన్ని సమర్థించే మీడియా సంస్థలూ వ్యాఖ్యాతలూ కూడా ఇరుదేశాల మధ్య శాంతిని పెంచేందుకు గాక ద్వేషాన్ని గుమ్మరించేందుకు పోటీపడి కథనాలు గుప్పించడం జరుగుతోంది. యుద్ధం వచ్చేసినట్టే కొంతమంది కథలు ప్రసారం చేశారు. అఖిలపక్షంలో మోడీ వ్యాఖ్యల తర్వాత కూడా ఈ తరహా కవ్వింపు కథనాలు ఆగలేదు. చైనా నేతల చిత్రాలు పతాకాలు దగ్ధం చేయడం, చైనా సరుకులు బహిష్కరించాలని పిలుపులూ కొనసాగుతూనే వున్నాయి. రైల్వేలతో సహా భారత ప్రభుత్వ

రంగ సంస్థలు చైనాతో కుదర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నట్టు చెబుతున్నాయి. టిక్‌టాక్‌తో సహా చైనా యాప్‌లను నిషేధిస్తున్నట్టు మరికొన్ని ప్రకటనలు వచ్చాయి. కాని మోడీ ప్రభుత్వ అధికారిక విధానానికి బయట జరుగుతున్న ఈ ప్రహసనాలకు పొంతన లేదని మాత్రం చెప్పకతప్పదు. హైదరాబాద్ సమీపంలోని దిండిగల్‌లో భారత వైమానిక దళ కేంద్రంలో ఎయిర్ చీఫ్ మార్షల్ మాట్లాడుతూ దేశ రక్షణకు సర్వసన్నద్ధంగా వున్నామని చెప్పడం దీనితో కలిసింది. కొద్ది వారాల కిందట చైనా అధ్యక్షుడు సైనిక కమిషన్ చైర్మన్ సీ జింగ్‌పింగ్ దళాలనుద్దేశించి ప్రసంగిస్తూ పోరాటానికి సిద్ధంగా వుండాలని అంటే యుద్ధానికి సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారని కథలు నడిచాయి. చైనా దానిపై స్పష్టమైన వివరణ ఇచ్చాక అవన్నీ వెనక్కుపోయాయి. కరోనా వైరస్‌కు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై ద్వేషాన్ని పెంచే ప్రచారం చేస్తే మన దేశంలోనూ అలాటి శక్తులు గొంతు కలిపాయి. చైనా నుంచి పెట్టుబడులు పెద్ద ఎత్తున తరలి వచ్చేస్తాయనీ వాటిని మన దేశంలోకి రప్పించుకోవాలని మరో ప్రచార ప్రహసనం నడిచింది. వాస్తవానికి చైనా నుంచి ఆ స్థాయిలో తరలిందీ లేదు. ఆ వచ్చినవి ఆగ్నేయాసియాకు వెళ్లాయి గాని ఇండియాకు రావడం నామమాత్రంగానే జరిగింది. చైనాతో వాణిజ్యంలో భారీ మైనస్‌లో వున్న అమెరికా కరోనాను సాకుగా చేసుకుని ప్రతికూల చర్యలు తీసుకుంటూ ఇండియాను తనతో చేర్చుకోవాలని పాచికలు పన్నింది. ఆఖరుకు చైనాకు వ్యతిరేకంగా భారత దేశాన్ని బలపరుస్తానని బూటకపు ఆశలకు ప్రయత్నించింది. కాని నమస్తే ట్రంప్‌తో సహా చాలా విధాల అమెరికాకు లోబడిపోతున్న ఇండియా కరోనాపై షాంఘై గ్రూపు చర్చలకు కూడా హాజరైంది.

### అవకాశవాదం హానికరం

పాలకపార్టీలెప్పుడూ ఏ సమస్యనైనా స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి. జాతీయ వాదాన్ని కూడా పాచికగా వాడుతుంటాయి. ఈ విషయంలో బిజెపి ప్రత్యేకించి మోడీ ప్రభుత్వం రెండాకులు ఎక్కువే చదివాయి. ఎన్నికల తరుణంలోనే సరిహద్దు ప్రజ్వలనలు సైనిక కార్యకలాపాలు చాలా కాలంగా చూస్తున్నాం. పురాతన నాగరికత వేల ఏళ్ల సంబంధాలు గల భారత చైనాల మధ్య సత్సంబంధాలు ఒక చారిత్రిక వాస్తవం. దానికి చాలా ఉదాహరణలున్నాయి. హిందీ చీనీ భాయ్ భాయ్ నినాదాల తర్వాత 1962లో సాయుధ ఘర్షణ కూడా నిజమే. ఆ సమయంలో చైనా వ్యతిరేకతనూ దానితో పాటే కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి అప్పటి కాంగ్రెస్ జనసంఘ్ వంటి పార్టీలు చాలా ప్రయత్నం చేశాయి. సిపిఎం నాయకత్వాన్ని ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని జైళ్లపాలు చేశాయి. 3800 కిమీ ఉమ్మడి సరిహద్దు గల ఈ రెండు గొప్ప దేశాలు చరిత్ర నుంచి సంక్రమించిన సరిహద్దు వివాదాన్ని సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని మాత్రమే సిపిఎం అప్పుడూ ఇప్పుడూ చెబుతున్న మాట. మిగిలిన పార్టీలు ప్రభుత్వంలో వుంటే ఒకటి ప్రతిపక్షంలో వుంటే ఒకటి మాట్లాడుతుంటాయి. ఇప్పుడు ఇంత వీరోచిత ట్వీట్లు చేస్తున్న రాహుల్‌గాంధీ నానమ్మ ఇందిరాగాంధీయే 1976లో అది కూడా తనకు ఎదురు లేని ఎమర్జన్సీ కాలంలో చైనాతో సంబంధాలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. మోడీకి ముందు ప్రధానిగా పనిచేసిన బిజెపి నేత వాజ్‌పేయి ఆ తర్వాత చైనా వెళ్లిన తొలి విదేశాంగ మంత్రి! రాజీవ్, పివి, వాజ్‌పేయి, మన్మోహన్, మోడీ ఎవరు ప్రధానిగా వున్నా చైనాతో సంప్రదింపుల క్రమం కొనసాగిస్తూన్నారు. సరిహద్దు కమిషన్లు నిరంతరం చర్చించుకుంటూనే వుంటాయి.

### చరిత్ర వారసత్వం విజ్ఞతతో పరిష్కారం

ప్రపంచంలో చాలా దేశాలను ఆక్రమించుకుని పాలించిన, అనేక చోట్ల విభజించి ఇష్టానుసారం గీతలు గీసిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సరిహద్దులను సంక్లిష్టం చేశారు. చరిత్ర వారసత్వంగా చాలా దేశాల మధ్య ఇలాటి వివాదాలు కొనసాగుతూనే వున్నాయి. ఏ దేశానికి ఆ దేశం తన వాదనే సరైందని అనుకోవచ్చు. వీటిలో ఏదో ఒక పక్షం మాట నెగ్గడం లేదా యుద్ధంతో పరిష్కరించుకోవడం కుదిరేపని కాదు. పరస్పర సంప్రదింపులతో పట్టువిడుపులతో పరిష్కరించుకోవాలసిందే. అది సాధ్యమయ్యేవరకూ ఉద్రిక్తతలు పెంచుకోకుండా చూసుకోవడం అనివార్యం. ఇప్పుడు నేపాల్‌తోనూ అలాటి వివాదమే పెరుగుతున్నది. దాన్ని కూడా చైనాతో ముడిపెట్టి మాట్లాడటం జరుగుతున్నది. పాకిస్థాన్‌తో చైనా సాన్నిహిత్యం కూడా చారిత్రిక వాస్తవం. ఈ విషయాలలో భారత చైనాల వాదనలు భిన్నంగానే వుంటాయి. చైనా మీడియాలోనూ, దౌత్య వర్గాలలోనూ విమర్శలూ ఆరోపణలు కనిపిస్తుంటాయి. కాని చైనా పాకిస్తాన్‌లను ఒకేగాట కట్టి

## కవిత

# ప్రస్థానం


గొరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి
9110595847

కరోనా కవిత

వర్షానికి నోచుకోని
రాయలసీమ బీడుభూముల్లా
పగుళ్ళతో పాదాలు
రక్తమోడుతూ విచ్చుకుంటున్నాయి
మండుటెండకు కరిగిన
తారు రోడ్డును ధిక్కరిస్తూ
సుదూర తీరమైన గమ్యం
జన్మభూమి వైపు సాగుతున్నాయ్
పుట్టిన వూరు మట్టి పొరలను
తనివితీరా ముద్దాడాలని
తిండీ తిప్పలు ఆశించని వలసజీవులు
బతికుంటే బలుసాకు తినొచ్చు
మార్గంలో అడ్డగించకుంటే చాలు
పొట్టచేతబట్టుకుని వచ్చిన చేతులు
తమ చెట్టూ పుట్టల వైపు
పయనిస్తున్నాయి
కనీ వినీ ఎరుగని యానం
కడు దూరపు ప్రయాణం
మెదళ్ళు కరిగినా కళ్ళు మండినా
గుండె ఎండినా కడుపు మాడినా
కడుపాత్రాలు కాలంచేస్తున్నా
చంకలో పిల్లా నెత్తిన మూటా
సాగడం తప్ప లేదు మరోమాట
ఆ రోడ్డు ఇల్లు చేరుస్తుందో
వల్లకాటి దారిపట్టిస్తుందో
సహనం సంస్కృతి నేర్పిన పాఠం
ఆ స్వేదమే మహార్ణవమై
చెలియలికట్ట దాటితే
ఆ రుధిర ప్రవాహమే
సుడిగుండమై కృష్ణబిలమైతే
ఆ కళ్ళలోని అగ్నికణాలు
దావానలమై దహింపజూస్తే
యంత్రాలతో చెలిమి జేసిన
ఆ కరకు చేతులు
కరవాలాలై ఖండింపజూస్తే
పగిలిన పాదాల పదఘట్టనలు
పాలకులపై పగబడితే... ♦

---

వారిలాగానే వీరూ బాధ్యతా రహితంగా ప్రవర్తించినట్టు భారత ప్రభుత్వం ఆరోపించలేదు. 45 ఏళ్లుగా భారత చైనాల మధ్య సాయుధ ఘర్షణ జరగకపోవడం కాదనలేని వాస్తవం. ఇండియాలో అరుణాచల్‌ప్రదేశ్, లడాక్, సిక్కిం వంటి ప్రదేశాలపై అలాగే దలైలామాకు ఆశ్రయం ఇవ్వడంపై చైనా భిన్నాభిప్రాయాలతో వుంటుంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో చైనా నిర్మాణాలు టిబెట్ ప్రతిపత్తి వంటి విషయాలలో ఇండియా భిన్నంగా వుంటుంది. రెండు దేశాల రాజకీయ పాలనా వ్యవస్థలు కూడా భిన్నమైనవి. అయినా జనాభాలో అతిపెద్దవైన ఈ రెండు ఇరుగుపొరుగు దేశాలు సత్సంబంధాలు కాపాడుకోవడం ఆసియాలోనూ మొత్తం ప్రపంచంలోనూ కూడా శాంతికి ఎంతైనా దోహదకరం. ఇండియా చైనా రష్యా ఒకటిగా వ్యవహరిస్తే సామ్రాజ్యవాదుల ఆటలు సాగబోవని లెనిన్ ఏనాడో చెప్పిన మాట. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత పరిస్థితులు చాలా మారినా అమెరికాతో ఇండియా రష్యా సాన్నిహిత్యం పెరిగినా స్థూలంగా ఈ మూడు దేశాలకు తమ ప్రాధాన్యత వుండనే వుంది. ఈ పొందికను దెబ్బతీయాలన్నది అమెరికా వ్యూహం. భారత దేశంలోని పాలక వర్గాల అభివృద్ధి నిరోధకుల ఆశ. ఇప్పుడు చైనా సరుకుల బహిష్కరణ వంటి నినాదాల సారాంశం అదే. వూరూరా వెలసిన చైనా బజార్‌లు, చైనా ఫుడ్ సెంటర్లను ఆపడం నిజంగా సాధ్యమయ్యేదేనా? చౌకగా ఉపయోగకరంగా అవి లభిస్తుంటే వ్యాపారులు వినియోగదార్లు కూడా ఎలా బహిష్కరిస్తారు? గనులు రక్షణ విమానాలు అన్ని రంగాల్లోకి విదేశీపెట్టుబడులను పిలిచి పీట వేస్తున్న మనం చైనాను మాత్రం పూర్తిగా ఎలా ఆపగలం? కనుక తాత్కాలిక సమస్యలు వచ్చినా దీర్ఘకాలిక శాంతిని కాపాడుకోవడం ఉభయులకూ ప్రయోజనకరం. ఇప్పుడు గాల్వాన్ లోయలోనూ ఇరు పక్షాలు ఉపసంహరణపై అంగీకారానికి రావడం ఉపశమనానికి బాట వేస్తుందని ఆశిద్దాం. వాస్తవాధీన రేఖపైనా ఇదే రీతిలో అవగాహనకు రావడానికి ప్రయత్నాలు కొనసాగవలసిందే. ఉద్దేశపూర్వకమైన ఉన్మాద ప్రచారాలను తోసిపుచ్చుదాం. ♦




యాకూబ్



# కదిలించే కవితాధార

- వోరప్రసాద్
9490099059

*ఈ కవితలన్నీ లోతైన భావధారతో తొణికిసలాడు తుంటాయి. కవితా పాఠకుడు చూపును సారించే కొలదీ భావాలు పెల్లుబుకి బయటకు వస్తాయి. సమాజం పట్ల, మానవత్వం పట్ల అపారమైన ప్రేమను వ్యక్తం చేస్తాయి. కవిత్వ పాఠకులు తప్పనిసరిగా చదవాల్సిన కవితా సంపుటి 'తీగలచింత'.*

యాకూబ్ కొత్త కవితా సంపుటి 'తీగలచింత'. తెలుగు కవితా క్షేత్రంలో కాస్త సుదీర్ఘ సంతకమే యాకూబ్‌ది. ఇప్పటికే ప్రవహించే జ్ఞాపకం, సరిహద్దు రేఖ, ఎడతెగని ప్రయాణం, నదీమూలంలాంటి ఆ ఇల్లు కవితా సంపుటాలు వెలువరించిన యాకూబ్‌కి 'తీగలచింత' ఐదో సంపుటి. ఔత్సాహికుల కవిత్వాన్ని 'కవిసంగమం' ద్వారా ప్రోత్సహిస్తున్న యాకూబ్ తన కవిత్వ రచనా ప్రయాణంలో కూడా ఎక్కడా వెనుకబడలేదు. కవిత్వ ప్రక్రియ పట్ల ప్రత్యేక శ్రద్ధ యాకూబ్‌కి. అందుకే తన కవిత్వ రచనాశైలిని కూడా విలక్షణంగా రూపొందించుకోగలిగాడు. వస్తువుని, రూపాన్ని సమపాళ్ళలో మిళితం చేసి అంతిమంగా వస్తుప్రాధాన్యత వైపు మొగ్గు చూపడం సామాజిక కవి లక్షణం. ఈ లక్షణం 'తీగలచింత' కవిత్వంలో అంతటా పరుచుకుని కనపడుతుంది.

తీగలచింత కవితలు మనకు వర్తమాన సమాజపు అనేక కోణాలను చూపిస్తాయి. జీవితాన్ని చిదిమేస్తున్న వ్యవస్థ దుర్మార్గాన్ని, మనుషుల్ని విడదీస్తున్న మతోన్మాదాన్ని, ప్రపంచీకరణ విషఫలాలను, మార్కెట్ విజృంభణలో విధ్వంసమవుతున్న మానవ విలువల తీరును ఆలోచింపజేసేలా కవిత్వం చేస్తాడు యాకూబ్. వ్యక్తిగత కష్టనష్టాలను కవిత్వం చేయడం కన్నా వ్యవస్థాపరమైన లోపాలను కవిత్వం చేయడానికే యాకూబ్ ఎక్కువ మొగ్గుచూపుతాడు. ప్రతిరోజూ మనల్ని వెంటాడే తీవ్రమైన అంశాలను కవిత్వం చేసి యాకూబ్ మనలో అలజడి లేపుతాడు. తీగలచింత పేరులాగే మనుషుల చుట్టూ పేరుకుపోతున్న చింతలను అక్షరాలతో, పదాలతో తీగలుతీగలుగా రూపుకట్టి మన హృదయాల్ని మెలితిప్పి వదిలిపెడతాడు. ఒక అనుభవజ్ఞుడైన కవి కవితాధార మనం 'తీగలచింత'లో ఆస్వాదిస్తాం.

కవిత్వం చేయడంలో ఎంతలా మమేకమైపోయాడో ఈ సంపుటిలోని తొలికవితలో వ్యక్తం చేస్తాడు. ఆ కవిత పేరు కూడా 'ఇప్పుడు తెరిచి చూడండి'. పాఠకుడ్ని ఛాలెంజ్ చేస్తున్నట్టుగా ఉన్న ఈ కవిత చదివితే కవికీ, కవితా రచనకీ ఉన్న అనుబంధం హృదయానికి హత్తుకుంటుంది. తొలి కవితా చరణాలు మనల్ని తీగలచింత కవితా సంపుటిలోకి ప్రేమగా ఆహ్వానిస్తాయి...

*ఇన్ని కవితల మధ్యన నిల్చొని/ నేనో కవితలా మారిపోయాను/ ఎత్తుగడల్లో, పరుచుకున్న భావంలో,/ ముగింపుల్లో మునిగి తడిసి ముద్దయిపోయాను.'/...../ రాత్రి నిదురలో కలవరించిన కవిత/ కవ్వించి ఏడ్పించి సుదీర్ఘ రాత్రిలా కళ్లెర్రబడిన కవిత/....../ ఇప్పుడు తెరిచిచూడండి/ ప్రతి పేజీ తిప్పుతున్నప్పుడు వేలి చివరల మీద/ అంటుకునే కాగితపు స్పర్శలా నేనుంటాను/ అలుక్కుపోయిన అక్షరాల మసకభావంలో నేను దాగుంటాను..* అంటాడు.

శకలాలు శకలాలుగా జీవితాన్ని చూసే దృష్టి జీవితం పట్ల వాస్తవికమైన అవగాహనని ఇవ్వలేదు. సామాజిక వ్యవస్థ మూలాలను అర్థం చేసుకోకుండా మానవ జీవితాన్ని సరైనరీతిలో అవగతం చేసుకోలేం. ఆ దృష్టిని యాకూబ్

కవిత్వంలో మనం అడుగడుగునా చూస్తాం..

***అందరికంటే ముందు వాళ్ళు చదువుకున్నారు./ అందరికంటే ముందు వాళ్ళు గ్రంథాలు రాసారు./సూత్రాలు రాసారు. గీతలు గీసారు./వాటిని చూడకుండా కళ్ళకు గంతలు కట్టారు./ వినకుండా చెవుల్లో సీసాలు పోశారు.* (చరిత్రలన్నీ అవే!).**

గ్లోబలైజేషన్ పేరుతో హోరెత్తిపోతున్న ప్రపంచంలోనే ఓ పెద్దభూభాగం, అత్యధిక జనాభా కూడా ఉన్న మనదేశం ఇప్పటికీ ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అసమానతలకు, కులం, మతం పేరుతో జరుగుతున్న దౌర్జన్యాలకు మూలాలను 'చరిత్రలన్నీ అవే!' లో ప్రస్తావిస్తాడు. వేల సంవత్సరాల నాడు మనుషుల్ని నియంత్రించిన ఆ సూత్రాలూ, నియమాలూ మనుషులను నేటికీ వెంటాడుతున్నాయి. వాటిని ఛేధించాలంటే వాటి మూలాలను బహిరంగం చేయాలి. వాటిని ఎజెండాలోకి తీసుకొస్తేనే వాటి అంతు తేల్చగలం. ఆ పని చాలా శక్తివంతంగా ఈ సంపుటిలో యాకూబ్ చేసి చూపించాడు.

దేశంలో స్వేచ్ఛగా ఊపిరి పీల్చలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. స్వంత దేశంలో పౌరులను అనుమానంగా చూసే పాలకుల దుర్మార్గం ఇప్పుడు ప్రజల్ని వెంటాడుతుంది. మనుషులకు ఈ నేలపై కాస్తంత చోటు దొరకని పరిస్థితులు మనల్ని ఆశ్చర్యానికి గురిచేయడం లేదు. నేలపై ఆధిపత్యం దేనికి? ప్రతీ జీవికీ, చెట్టూ పుట్టకూ కూడా చెందింది ఈ నేల. ఈ నేల నీది కాదు అని ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ఆధునికత ఎలా అనిపించుకుంటుంది. మనుషులు ముందుకు వెళుతున్నారా? వెనక్కి కాలాన్ని మళ్ళిస్తున్నారా? అవును వీళ్ళు మనుషులుగా ఆలోచించడం లేదనే అనుకోవాలి. ఒక గుండెను గాయం చేయడమంటే అంత సులువా? నీవిక్కడి వాడివి కాదు ఎక్కడి వాడివో రుజువు చేసుకో అనడమంత అనాగరికం వేరే ఏముంటుంది? పౌరసత్వ చట్టంపై కవి నిరసన ప్రకటన ఇది చూడండి... పౌరసత్వం అనే పదాన్ని పౌరసత్యంగా మార్చాడు యాకూబ్...

***'ఇప్పుడెలాగైనా సరే/ ఒక నెంబరుగా మారిపోవాలి/ స్వంతనేలపై కాలుమోపే స్థలం కావాలంటే/ రిజిష్టరు పేజీల్లో ముడుచుకుని సర్దుకోవాలి/ ఒక్క అక్షరంపాటి స్థలం చాలు/ స్వతంత్రం నా జన్మహక్కు గొప్ప నినాదం/ పౌరసత్వం జన్మహక్కు కాదన్నదే ఇప్పటి విధానం/ స్వతంత్ర భారతదేశం చెదలు దులుపుకుంటుందంట/ స్విస్ బ్యాంకుల్లో, రియల్ ఎస్టేటుల్లో, కార్పోరేటు అప్పుల్లో/ చెదల పుట్టలకు గుర్తింపు అవసరం లేదు' (పౌరసత్యం)*** అంటాడు.

పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఇటీవల ఎన్నడూ లేనంతగా నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల భావాలతో నిమిత్తం లేకుండా చట్టాలు చేస్తే ప్రతిఘటించడం ప్రజాస్వామ్యంలో ప్రాథమిక సూత్రం. ప్రజలలో ఆ చైతన్యాన్ని కలిగించడమే ప్రతీ కవి బాధ్యత.

ఇప్పుడు మనదేశంలో మతోన్మాద విషం తన ప్రతాపాన్ని చూపించే పనిలో ఉంది. మతాలకతీతంగా ప్రజలంతా ఐక్యంగా జాతీయోద్యమంలో పాల్గొన్న రోజుల్లో లౌకికవాదం పరిమళించి రాజ్యాంగంలో గుభాళించింది. ఇప్పుడు రాజ్యాంగాన్ని నమ్మి దేశంలో జీవించే పరిస్థితులు ప్రశ్నార్థకమయ్యాయి. నిజమే ఈ రోజు ఈ దేశం లౌకిక దేశం అని గుండెల మీద చెయ్యేసుకుని చెప్పే పరిస్థితి కనపడటం లేదు. విద్వేషాన్ని కొంచెం కొంచెంగా మనుషుల్లో ఒంపడానికి జరిగే ప్రయత్నాలను చాలా శక్తివంతంగా కవిత్వం చేస్తాడు యాకూబ్...

***'నిన్నటివరకూ మనమందరం లౌకికవాదులం, అంతకంటే ఫేమస్/ విశ్వమానవులం – అంతదనుక ఎవరూ సదరు మతం కులం జోలికి/ రాలేదుకదూ..!/ ఇవాళే లోపలిమానవుడు తీరిగ్గా మాట్లాడాడు./ కొంచెం స్వంతలాభం చూసుకొమ్మని, సొంత ఐడెంటిటీ గుర్తుంచుకొమ్మని/ ఎవరో ప్రాంప్టింగ్ చేస్తుంటారు/ మరెవరో నటిస్తుంటారు/ ఎవరికేదో ఏదో స్ఫురిస్తుంది, అదే నిజమని నమ్మిస్తుంటారు. దాన్నే/ నమ్మమని ఆజ్ఞాపిస్తుంటారు./ మనం నమ్మినా నమ్మకపోయినా ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా కొన్ని/ గ్రంథాల వారసులం./ ఎటుతిరిగినా అక్కడే ఉంటాం, అక్కడక్కడే తిరుగుతాం/ ఇంకా ఇంకా.../ ప్రి కన్సీవ్డ్ నోషన్స్/ తప్పేమీ లేదు, అలా పెరిగాం, అలా తయారుచేయబడ్డాం' (తెల్వద్!)*** అంటాడు.

నిన్నటి వరకూ మనమందరం లౌకికవాదులం అంటానికి సందేహించలేదు. అంటే ఇప్పుడు కాదని మనం ఆ మాటల నుండి గ్రహించాలి. మనలో గూడుకట్టుకుని ఉన్న వ్యక్తిగత అభిజాత్యాల్ని ప్రేరేపించే శక్తుల గురించిన ఒకానొక హెచ్చరిక ఈ కవిత. ఎంత సులువుగా ఈ శక్తులు మనుషుల్ని వెనక్కి నడిపించగలవో వర్తమాన భారతంలో చాలా స్పష్టంగా కనపడుతుంది. ఒకప్పటి లౌకిక రాజ్యాంగ నేపథ్య పరిస్థితులను

మరుగుపర్చి ఒక మతాధిక్య దేశంగా మార్చడానికి నిస్సిగ్గుగా, బహిరంగంగా జరుగుతున్న ప్రయత్నాల పట్ల ఆధునికులు సిగ్గుపడాలి.

నేటి ప్రపంచీకరణను అర్థం చేసుకోవడంలో కొంతమంది కవులలో ఒక అయోమయ స్థితి ఉంది. ప్రపంచీకరణ పేరుతో ఒకవైపు అభివృద్ధిని చూపిస్తున్నారు. మరోవైపు ప్రపంచీకరణ విషఫలాలుగా ఆత్మహత్యలు, హత్యలు, హత్యాచారాలు, పురుగుమందులు తాగడాలు, కల్తీవస్తువులు, లాభాలై, మార్కెట్లై, విధ్వంసమవుతున్న మానవ విలువలై మన అనుభవాలుగా మిగులుతున్నాయి.

*మూడు శాతం మనుషులు మిగతా వాళ్లను పాలించే నేలమీద/ వర్తకవర్గం అందర్నీ అన్నింటినీ నియంత్రించే పాలనముందు .. (మూసుకుంటున్న తలుపులు)* అంటాడు.

గుప్పెడు మంది మల్టీనేషనల్ కంపెనీల యజమానులు ప్రపంచీకరణను శాసిస్తున్న విషయాన్ని కవిత్వం చేస్తాడు. వర్తమాన యువతరం ప్రపంచీకరణ మెరుపుల వలలో చిక్కుకుంది. ఆ వలను తెంచుకుని బయటకు రావాల్సిన అవసరాన్ని యాకూబ్ కవిత్వం నొక్కి చెబుతుంది.

కవి ఎటువైపు నిలబడుతున్నాడో అతని కవిత్వం పట్టిస్తుంది. మనిషి తనేంటో బయటపడకుండా ఎన్ని రకాలుగా తప్పించుకున్నా కవిత్వంలో తప్పించుకోవడం కష్టం అంటాడు యాకూబ్. కవిత్వంలో నువ్వేంటో కనిపెడతానంటాడు యాకూబ్....

*'బహుశా రూపంలోంచి నిన్ను/ కనిపెట్టడం కష్టం./ ఓ వాక్యంలోంచి, ఓ పంక్తిలోంచి,/ అరుదుగా ప్రయోగించే ఓ పదంలోంచి/ కనిపెట్టడానికి ప్రయత్నించవచ్చు/ అక్కడా దాక్కోవడానికి నువ్వు ప్రయత్నించలేవు./ అవి నీ రక్తనాళికలు./ నీలోంచి ప్రవహించే సహజ జీవప్రసరణలు' (నిన్నిలా గుర్తుపట్టొచ్చు)* అంటాడు.

ముసుగు వేసుకుని నటిస్తున్న మనుషుల్ని మీ కవిత్వంలో మీరు దాక్కోలేరు. మీ కవితా చరణంలోని ఒక పదం చాలు మిమ్మల్ని కనిపెట్టడానికి అంటాడు కవి. మన భావాలు మనకు తెలియకుండానే సాటి మనుషులను కించపరిచేవిగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్యూడల్ భావాలు గల అగ్రవర్ణాలు చాలా తేలికగా కులాన్ని, మతాన్ని ఉపయోగించి వాడే భాష అలా ఉంటుంది. ఆ లక్షణాలు కవిత్వంలో ఎలా బయటపడతాయో ఈ కవితా వాక్యాల్లో యాకూబ్ చెప్తాడు. కులాలుగా, మతాలుగా, ప్రాంతాలుగా విడిపోయి ఉన్న ప్రపంచంలో అలా విడదీసే పదాలు కూడా ఉంటాయి కదా. కులాన్ని నీచ భాష ఉపయోగించి అవమానించడం, పరమతాన్ని చులకన చేయడం వంటి వాటిపట్ల ఎంత జాగ్రత్త వహించాలో దీన్నిబట్టి తెలుస్తుంది.

యాకూబ్ సీనియర్ కవి. అంతకు మించి 'కవి సంగమం' నిర్వహిస్తున్న వాడు. అందువల్ల ముఖ్యంగా ఔత్సాహిక కవుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తిని కనబరుస్తూ చాలానే కవితలు ఈ తీగలచింతలో రాసాడు.

*'ఎటువైపు వెళ్ళాలో తెలియక, దిక్కులు చూస్తున్నవాడికి యారోమార్కులా/ నడిచే దారిపక్కన నువ్వు నిలబడాలి. నువ్వు అతికష్టంగా నడిచినదారిని,/ జీవితాన్నీ ఎంతో ప్రేమతో అతడికి ఉపయోగపడేట్లు అనుభవపాఠాన్ని/ సిద్ధం చేసి తెలపాలి./ నువ్వు సరే, అతడైనా నువ్వు జీవించని జీవితాన్ని జీవించేట్లు/ చిరునవ్వుతో నిన్ను అతడిలోకి ఒంపాలి. కొంచెం నిన్ను నీవు/ పొదులుకోవాలి. ఆ పిదప అతడిలోనే జీవించాలి. (లివ్ యాజ్ ఎన్ యారో మార్క్!)* అంటాడు.

ఎంతో జాగ్రత్త తీసుకుని, ఆలోచించి చెప్తున్నట్టుగా చెప్తాడు. ఈ కవితా వాక్యాలు మనల్ని ఎంతో ఆలోచింపజేస్తాయి. నిజంగా ఇది ఎంతటి విలువైన పని. ఎంత జాగ్రత్తగా చేయాల్సిన పని కదా! అని అనిపించకుండా ఉండదు.

అవును జీవితం సంక్లిష్టం. సమాజం సంక్లిష్టం. అంత సులువుగా జీవితం బోధపడదు. సంతోషం. దు:ఖం సమ్మిళితం జీవితం. ఒకోసారి దు:ఖంతో జీవితం బరువుగా తోస్తుంది. మోయలేనితనం మనను ఆవహిస్తుంది. కానీ తప్పించుకోలేం. జీవితాన్ని జీవించాల్సిందే. ఒక శాశ్వత సత్యాన్ని తేలికైనా పదాలతో చెప్పడం కవి ప్రతిభ...

*'బతకాలి/ ఇంకెవరో జీవించరు దీన్ని-/ .../ ఎక్కడో పిడుగుపడుతుంది, కంపించాలి/ పక్కనే చెట్టు కూలుతుంది, ఒడుపుగా/ తప్పించుకోవాలి/ ఎవడో ఉమ్ముతుంటాడు, తుంపర్లు మనపైన చిందకుండా/ ఆ పక్కనుంచి తప్పుకోవాలి./ ఇల్లు వేడెక్కుతుంది, చల్లబడేంతవరకు ఓపిగ్గా ఎదురుచూడాలి.' (బతకడం అవసరం)* అంటాడు.

ఆ బతకడంలో కొన్నిటిని కాపాడుకోవాలి. కొన్నింటి నుండి తప్పించుకోవాలి. అలా చేయడానికి ఓపికను సాధన చేయాలి. ఒక తాత్విక భావధార సరళమైన అక్షరాల్లోంచి

మనముందు ప్రత్యక్షమై ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మనల్ని మన లోపలికి తొంగిచూసేలా చేస్తుంది. ఆ కవితా వాక్యాల్లో మనం ఎన్నో వెతుక్కుంటాం. కవి కొన్నిటిని చెప్తాడు. కవి చెప్పనివాటిని మనం కనిపెడతాం.

పాతకాలం కాటు వేసి వేసి చేసిన గాయాల నుండి మహిళలు ఇంకా కోలుకోలేదు. మన కాలం కూడా చేస్తున్న గాయాలూ చిన్నవేం కావు. ఎంతగా అంటే ఇప్పుడు తల్లులు కూతురిని కనరాదనే అనుకుంటారు అన్నంత. వర్తమానాన్ని వణికించేంత హింస స్త్రీల మీద జరుగుతుందిప్పుడు. మహిళ బయటకు అడుగుపెడితే ఆమె అలాగే తిరిగొస్తుందన్న హామీ లేదు. ఈ పరిస్థితికి కారణాలు అన్వేషించాలి. ఈ అభివృద్ధి, ఈ నాగరికత, ఈ మెట్రో నగరాలు, ఈ సాంకేతిక పరిజ్ఞానం ఈ పరిస్థితికి కారణాలు చెప్పలేవు. చెప్పలేనప్పుడు మనం ఇంకెక్కడో కారణాలను అన్వేషించాలి. మెదళ్ళకు ఎక్కుతున్న మాలిన్యాన్ని కట్టడి చేసే పరిజ్ఞానం కనిపెట్టాలి. సాంఘిక పరివర్తన, సంస్కారోన్నతి కలిగించే పరికరాలు కనిపెట్టాలి. మనుషుల్ని మదోన్మాదులుగా మారుస్తున్న విషసంస్కృతిని, మార్కెట్ సంస్కృతిని మట్టుపెట్టే పనిచేయాలి. సమాజాన్ని మార్కెట్ శాసిస్తున్నంత కాలం మానవీయ సంస్క ృతికి అవకాశం లేదు. అందుకే అభివృద్ధి అని చెప్పబడుతున్న సమాజంలోనే మానవ విలువల విధ్వంసం సాఫీగా జరిగిపోతుంది. స్త్రీల చుట్టూ పేరుకుపోతున్న ఈ అమానవీయ పరిస్థితులను నిరసిస్తూ కవి రాసిన వాక్యాలు మనల్ని వెంటాడక మానవు...

**'ఇప్పుడు తల్లులు/ కూతురిని కనరాదనే అనుకుంటారు/ ...../ ఎక్కడ ఏ వల ఉందో, ఏ వేటగాడు మాటు వేసి ఉన్నాడో/ ..../ ఆవులు భద్రంగా ఇంటికి చేరే లోకంలో/ ఆడపిల్లలను మేసే కాలంలో/ తల్లులు ఇక తల్లులను కనడానికి వణికిపోతారు' (గిరఫ్తార్ హమ్ హువే!)** అంటాడు. ఈ పరిస్థితులను మార్చడమే మనం చేయాల్సిన ముఖ్యమైన పని.

హృదయాన్ని హత్తుకునే భావనలు చాలా ఇష్టంగా రాస్తాడు యాకూబ్. గతాన్ని తవ్వుకుంటే వచ్చే కొన్ని తీపి జ్ఞాపకాల్ని కవిత్వం చేయడంలో సిద్ధహస్తుడు యాకూబ్.. తన కవితా వాక్యాలతో మనల్నీ కట్టిపడేస్తాడు. ఇల్లంటే కేవలం ఇల్లు కాదు అంటూ మనల్ని బాల్యంలోకి తీసుకెళ్తాడు..

**'అప్పటి ఆ ఇల్లు గుర్తొచ్చింది!/ ఆ చెట్లు గుర్తుకు వచ్చాయి. ఆ ఇంటిని అల్లుకుని పెనవేసుకున్న/ జీవితం గుర్తొచ్చింది./ ఇల్లే అనుకుంటాం, గోడలే అనుకుంటాం కానీ/ ఎన్నెన్నో ఏవేవో, ఇంకా ఏవేవో/ ఉంటాయి! (ఫ్రాగ్మెంట్స్)** అంటాడు.

ఏవేవో అంటూ ఏం చెప్పకుండానే ఎన్నో విషయాలను మనందరికీ గుర్తుచేసి చాలా అమాయకంగా తప్పుకుంటాడు కవి. తీగలచింత కవిత్వం చదువుతూ ఒక సీరియస్ తాత్విక ఆలోచనా స్రవంతిలో మునిగిపోయి ఉన్న మనకు మధ్యలో ఒక ఆహ్లాద వీచికలా ఇలాంటి కవితా వాక్యాలు తారసపడతాయి. సీరియస్ కవిత్వానికి పరిమళాన్ని అద్దుతాయి.

జీవితానుభవం ఏదో ఒకటి చెప్పనీయకుండా ఉండదు. అందుకు కవిత్వాన్ని ఆలంబన చేసుకుని యాకూబ్ తన అనుభవ సారాన్ని తన తర్వాత తరంలోకి ఒంపడానికి నిరంతర కవితాప్రయత్నం చేస్తుంటాడు. అవును అనుభవం తర్వాత తరానికి ఉపయోగపడాలి కదా. గత అనుభవాలు వర్తమానాన్ని, భవిష్యత్తును మరింత ఉన్నతీకరిస్తాయి కదా! అందుకు కవిగా యాకూబ్ తన అనుభవాల తీగలను విస్తరించుకుంటూ కవిత్వం రాస్తాడు. కవితా మార్గదర్శనం చేస్తాడు. యాకూబ్ కవిత్వంలో పదాల ఆడంబరం కనబడదు. ప్రశ్నల కొడవళ్ళు కవితా పాఠకుడికి ఎదురవుతూ ఉంటాయి. పాఠకుడ్ని కవితా చరణాలు వెంటాడాలి. అలా వెంటాడే వాక్యాలు ఈ సంపుటిలో చాలానే ఉన్నాయి. సమాజం పట్ల, జీవితం పట్ల యాకూబ్ అవగాహనలో పరిణతి కవిత్వానికి ఎంతో బలాన్ని చేర్చింది.

ఈ కవితలన్నీ లోతైన భావధారతో తొణికిసలాడు తుంటాయి. కవితా పాఠకుడు చూపును సారించే కొలదీ భావాలు పెల్లుబికి బయటకు వస్తాయి. సమాజం పట్ల, మానవత్వం పట్ల అపారమైన ప్రేమను ఈ కవితలు వ్యక్తం చేస్తాయి. కవిత్వ పాఠకులు తప్పనిసరిగా చదవాల్సిన ఒక మంచి కవితా సంపుటి 'తీగలచింత'. యాకూబ్‌ను కవిత్వం కోసం మాత్రమే కాదు ఒక మానవత్వపు పలకరింపు వినడం కోసం కూడా చదవాలి. ఒక వర్తమాన భారత ముఖచిత్రాన్ని కవితాచిత్రం చేసిన యాకూబ్ కవితా చింతన ఈనాటి అవసరం. ఆ బాధ్యత తెలిసి వాటిని మోస్తూ పోతున్న యాకూబ్‌కి మనందరమూ తోడవుదాం. మంచి కవిత్వాన్ని, మహోన్నత మానవత్వాన్ని కౌగిలించుకోండి. తీగలచింత కవిత్వాన్ని మనసారా ఆస్వాదించండి. కవితా సంపుటి కోసం 9849156588 నెంబరును సంప్రదించండి. ♦

## 60-జి

- పొన్నాడ సత్యప్రకాశరావు
9000619267



"హేపీ రిటైర్డ్ లైఫ్" శుభకామనలు; వెంటనే
"ఎక్కడ సెటిల్ అవుతారు... అబ్బాయి దగ్గరేనా"
"మీ అబ్బాయి మంచోడే లెండి.. ఓ దెబ్బతిన్న తండ్రి
ఆరా"

♦

ప్రాథమిక విద్యకోసం రెండుమైళ్ళు నడిచిన
ఉన్నత విద్యకోసం పదిమైళ్ళు త్రొక్కిన
పాల డబ్బాలకు, కిరసనాయిల్ బళ్ళకు
పడిగాపులు గాచిన తరం నాది
వీధి చివర పాలప్యాకెట్‌కై బైకితీసే నా- కొడుకు"
రెండు మార్కులు తగ్గాయని
రెన్నెళ్ళు మంచం పట్టిన "నా-కొడుకు"
ఏడు పద్నాలుగు లెంతరా అంటే
కాలిక్యులేటర్ తీసే "నా-కొడుకు"
నన్ను "లెక్కపెడితే" ఎంత? "తీసివేస్తే" ఎంత?

♦

పదులలో ఏడుపెంకులాడిన వాళ్ళం
ఇరవైలలో తొలి యవ్వనాన్ని జుర్రుకున్న వాళ్ళం
నలభైలలో రెండో యవ్వనాన్ని ఆస్వాదించిన వాళ్లం
అరవైలలో రెండో బాల్యాన్ని తెచ్చుకోలేమా?

♦

ఈ రెండో బాల్యం చిటికెన వేలు పట్టుకోదు
చూపుడు వేలుతో దిశా నిర్దేశనం చేస్తుంది
"మూడంకెల జీతం - ఇరుకు ఇల్లు -
పాత సైకిల్" ల అనుభవం
"ఆరంకెల జీతం - విశాలమైన ఫ్లాట్-
క్రొత్త కారు" కి ఆలంబనం
"నలభై ఏళ్ళ కీచులాటల అమ్మానాన్నల" ఆట
"మూన్నాళ్ళ ముచ్చట నుంచి నూరేళ్ళ పంటకి"
బంగారు బాట కాగలదు.
సిక్స్టీ గ్యాంగ్ (60-జి) సభ్యులారా
వృద్ధాప్యం జబ్బుకాదు... ఓ శారీరక ధర్మం మాత్రమే
మనసుకి కాదు... తెలుసుకోండీ మర్మం. ♦

## పాత్రలు

సంకటి మహేశ్వరయ్య
9963757790

నాల్గు పాత్రలు
నడినెత్తిన
ఒకదానిపై ఒకటెక్కి
జీవిస్తున్నాయి.

పన్నెండేళ్ల బాల్యం
ప్రయత్నపూర్వకంగా
వాటిని నడిపిస్తుంది.

బువ్వని, కూరని,
పచ్చడి పప్పుని,
పాచిన వారుని..
చేసిన పాత్రలన్నీ
జీవిత నాటకాన
పేరొందాయి.




దినదినాన
వాడవాడలా
గడపలన్నిటా,
అమ్మలందరిచేత
స్టీలుగిన్నెల్లోంచి మిగిలిపోయిన
ఉప్పటి ఊపిరిని ఊద్చేసుకొని,
ప్రాణం నింపుకొన్న
ఇత్తడి పాత్రలవి.

జానెడు పొట్టను
నింపుతాయనంగానే
సూత్రధారి సూచించే
ఆకలి గుడిసెవైపు
పరిగెత్తుతాయి.

అడుగులు తడబడినా
అడ్డొచ్చిన దారిలో
భళ్ళున ఊపిరిని
తీసేసుకుంటాయి.
ఒలికిన ప్రాణాలను తోడేసుకొని
మరలా జీవిస్తుంటాయి.

తెరపై ఆడే పాత్రలు కావవి
పిగిలిన బట్టలపై,
దేహమున్న దారిద్ర్యం పై
క్షుద్బాధాల ధరిత్రిపై,
బడుగుల బ్రతుకును
పోషించే పాత్రలవి. ♦

కథ



# పెద్దమ్మాయి

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
9393662821

ఇన్నోవా కారు చెన్నై గిండీ ఫ్లై ఓవర్ వద్ద సర్రున ఆంధ్ర రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. డ్రైవరు పక్కన మ్యాట్రిమోనీ రెప్రజెంటేటివ్ రఘురాం కూర్చుని ఉన్నాడు. వెనుక సీట్లో ఏడాదికి పది లక్షలు సంపాదించే సాఫ్ట్ వేర్ ఉద్యోగి శరత్ ఐ ప్యాడ్ లో పెండ్లి కూతురి ఫోటో, బయో డేటా చూస్తున్నాడు. పక్కనే అతడి అమ్మ అరుణ తమకు కాబోయే కోడలు పిల్ల ఎలా ఉంటుందోనని ఊహిస్తూ ఉంది. అందరూ పెళ్ళిసంబంధానికని బయలుదేరారు.

మ్యాట్రిమోనీ రఘురాం మెడను వెనక్కి తిప్పి "మేడమ్, ఆంధ్ర రాష్ట్రంలోని నాగలాపురం అనే మండల కేంద్రానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉండే గ్రామానికి మనం వెళ్తున్నాం. పెళ్లి కూతురి నాయన సుబ్బరాజు నాగలాపురం వచ్చి ఉంటానన్నాడు. మనం అక్కడికి వెళితే ఆయన మనల్ని వారి ఊరికి తీసుకెళ్తాడు.

అటు తిరుపతికి, ఇటు చెన్నైకి 70 కిలో మీటర్ల దూరంలో నాగలాపురం వుంది. అక్కడి వేద నారాయణస్వామి దేవాలయం ప్రసిద్ధమైనది. గుడి ఆంధ్ర దేశంలో ఉన్నప్పటికీ తమిళనాడు సరిహద్దుల్లో ఉండడంతో తమిళ ప్రభావం కొద్దిగా ఉంది.

ఫాల్గుణ మాసం శుద్ధ ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి రోజులలో ఇక్కడ సూర్య సేవ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. మార్చి నెలలో వచ్చే ఈ మూడు రోజుల్లో సూర్యకిరణాలు వరుసగా మొదటిరోజు స్వామి వారి పాదాలపై పడుతాయి. రెండవరోజు నాభిపై మూడవరోజు నుదిటిపై పడుతాయి. ఈ మూడురోజులు ఇక్కడ జరిగే తెప్పోత్సవాలు భక్తులను ఎంతో విశేషంగా ఆకర్షిస్తాయి. వేలాది భక్తులు హాజరై ఈ సూర్యసేవను చూసి తరిస్తారు" అని గుడి చరిత్ర చెప్పాడు.

కారు ఆంధ్ర రాష్ట్రంలోకి ప్రవేశించింది. ఒక చోట చెరుకు ట్రాక్టరు ఆగి ఉంది. రోడ్డు సరిగా లేకపోవడంతో డ్రైవర్ కారు స్లో చేశాడు. ఒక్క క్షణం ఆగమని మ్యాట్రిమోనీ రఘురాం కారు దిగి ఒక చెరుకు విరుచుకున్నాడు.

కాస్ట్లీ కారులో వున్న మనుషులు తన ట్రాక్టరులోని చెరుకు పెరుక్కోవడం చూసిన ట్రాక్టరు డ్రైవరు ఆనందానికి పట్ట పగ్గాలు లేకుండా పోయింది. సాదా సీదా జనం పెరుక్కొంటే రచ్చ చేసే మనిషి ఎక్కడ లేని ప్రేమ కురిపిస్తూ 'వంకరిది కాకపోతే మంచిది విరుచుకోకూడదా ?' అని అన్నాడు

'చెరుకు వంకరపోతే తీపి చెడుతుందా' అని మ్యాట్రిమోనీ రఘురాం ఎగిరెగిరి నవ్వినాడు. చెరుకును నోటితో విరిచి నములుతూ కూర్చున్నాడు.

చిన్నగా కారు గుడిముందర ఆగింది. తెల్ల పంచె తెల్ల చొక్కా నుదిటిన గంధం పెట్టి గుడి ముందర నిలబడివున్నాడు సుబ్బరాజు. అందరికీ నమస్కరించినాడు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

శ్రీ కృష్ణ దేవరాయలు నిర్మించినట్లుగా చెబుతున్న వేదనారాయణ స్వామి గుడిలోకి వెళ్లారు. మత్స్యావతారంలో వున్న స్వామిని దర్శనం చేసుకున్నారు. సోమకాసురుడనే రాక్షసుడు బ్రహ్మ దేవుని వద్ద వున్న వేదాలను అపహరించి

సముద్రంలో దాచినట్లు చెబుతారు. మహావిష్ణువు మత్స్యావతారంలో రాక్షసుడిని చంపి వేదాలను ఈ స్థలంలోనే బ్రహ్మకిచ్చినట్లు చరిత్రలో ఉంది. అందువల్ల ఇక్కడి స్వామిని వేద నారాయణస్వామి అని పిలుస్తారని తెలుసుకున్నారు. గుడి ప్రాకారాలు, గుడిలోని విగ్రహాల శిల్పకళా చాతుర్యానికి ముగ్ధులయ్యారు.

తీర్థ ప్రసాదాలు తీసుకుని పల్లెకు బయలుదేరారు.

దారిలో గొర్రెలు మేకలు పొట్టేళ్లు గుంపులు గుంపులుగా వెళ్తున్నాయి.

చిన్నప్పుడెప్పుడో మేకలకు తోకలుంటాయని చదివిన విషయం గుర్తుకొచ్చిన పెండ్లికొడుకు 'ఇవన్నీ మేకలా ?' అని అడిగాడు.

'మేకలకు తోకలుంటాయని, తోకలున్నవన్నీ మేకలంటే ఎట్లా' అని మ్యాట్రిమోనీ రఘురాం పడీ పడీ నవ్వినాడు.

రోడ్డుకు ఇరువైపులా పచ్చటి చెట్లు గాలికి అటూఇటూ ఊగుతున్నాయి. కొందరు రైతులు తంగేడు ఆకును వరి మడిలో వేసి దుక్కి దున్నుతూ ఇలా పాడుతున్నారు

నాగేటి సాళ్లల్లో ఓ సందమామా....
తంగేటి సత్తువ ఓ సందమామ!

చూడ ముచ్చటగా ఉన్న ఆ దృశ్యాన్ని చూస్తున్న అరుణ తల తిప్పి సుబ్బరాజుతో–

"మీకు ఎంతమంది పిల్లలండీ" అని అడిగింది

'ముగ్గురు అమ్మాయిలండీ'

'మేము చూడబోయేది మొదటి అమ్మాయా'

'లేదండీ రెండో అమ్మాయి'

'మొదటి అమ్మాయిని ఎక్కడ ఇచ్చారు'

"మీరు నన్ను క్షమించాలి. మా పెద్ద అమ్మాయికి 33 సంవత్సరాలు. ముప్పై ఏండ్లు దాటిందని పెండ్లి చేసుకోవడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. కనీసం రెండవ అమ్మాయికైనా సరైన వయసులో చేద్దామని మ్యాట్రిమోనీ వారికి వివరాలు ఇచ్చాము"

'పెద్ద అమ్మాయికి వయస్సులో ఉన్నప్పుడే సంబంధాలు ఎందుకు చూడలేదు'

'నాకు ఆరోగ్యం బాలేక నేను నడుపుతున్న చిన్న టైప్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ మూసేశాను'

'మీ ఆరోగ్య సమస్యఏమిటి'

నరాలు మెలి తిరిగి ఉబ్బి ఉన్నకాళ్ళను చూపిస్తూ "వెరికోస్ వెయిన్" అన్నాడు.

"కాళ్లల్లో నొప్పి, మంట, బరువెక్కినట్లు వుంటాయి. ఎక్కువసేపు నిలబడినివ్వదు, కూర్చోనివ్వదు. అప్పుడప్పుడు కండరాలు బిగుసుకుపోతాయి. అందుకని ఇంట్లోనే ఉండిపోయాను.

అప్పటికే మా పెద్ద అమ్మాయి ఇంజనీరింగ్ పూర్తి కావడం, సాఫ్ట్ వేర్ ఉద్యోగం రావడం జరిగాయి. నా ఆరోగ్యం ఖర్చులు, కుటుంబం ఖర్చులు, మిగిలిన ఇద్దరి పిల్లల చదువులు పూర్తయ్యేలోగా వయసు పైబడింది. నేను చురుకుగా తిరగలేని పరిస్థితివచ్చింది. వచ్చినవాళ్లు అమ్మాయి వయసు ఎక్కువని వెనక్కి తగ్గారు" అని వివరంగా చెప్పాడు.

ఊర్లోకి కారు వస్తూ ఉంది. అంతకుముందే ఒక కోడి ఊరి మధ్యలోని చెట్టెక్కి కూర్చుంది. ఊర్లో పిలకాయలంతా చెట్టు చుట్టూ చేరి దానిని దింపాలని చిన్న చిన్న రాళ్లేస్తున్నారు. అది దిగనంటే దిగనన్నట్లుగా చెట్టు మీదనే ఉంది.

కారు హారన్ గట్టిగా మోగించినాడు డ్రైవర్. కొ క్కో క్కో అంటూ కోడి చెట్టు నుంచి ఎగిరి దూకి పరుగులు తీసింది. ఊర్లోని పిలకాయలంతా భలే భలే అని అరిచినారు. కోడి యజమాని కొడుకు సంతోషంతో ఎగిరి గంతులేశాడు. పరుగెత్తుకెళ్లి పక్కనే ఉన్న తమ గులాబీ తోటలో నుంచి గులాబీలు కోసుకొచ్చి కారులోని వారందరికీ ఇచ్చినాడు. డ్రైవర్ దగ్గరకి వెళ్లి 'థ్యాంక్స్ అంకుల్' అన్నాడు. అందరూ ముసిముసినవ్వులు నవ్వారు.

కారు కనకాంబరాల తోట పక్కనున్న సుబ్బరాజు ఇంటి ముందర ఆగింది. ఇంటి ముందరి బూరుగు చెట్టు మీద వున్న ఈలపిట్ట 'కొత్త అతిధులెవరా' అని తొంగి తొంగి చూసింది.

పెద్ద అమ్మాయి, చిన్న అమ్మాయిలు పెళ్లి కూతురుని అందంగా సింగారించి చిన్నగా హాల్ లోకి తీసుకువచ్చారు. ముగ్గురూ కుందనపు బొమ్మల్లా ఉన్నారు. ముగ్గురూ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు చేస్తున్నామని చెప్పారు. వారు అక్కడ ఉన్నంత సేపు చిరునవ్వులు చిందిస్తూ ఉన్నారు. స్వీటు హాటు ఫిల్టర్ కాఫీ ఇచ్చారు. మంచి చెడ్డలు మాట్లాడి అమ్మా కొడుకు బయటికి వచ్చారు.

ఒక అయిదు నిమిషాలు పక్కకి వెళ్లి మాట్లాడాలని చెప్పారు. ఇద్దరూ ఇంటి ఎదురుగా వున్న బూరుగు చెట్టు కింద నిలబడినారు. మ్యాట్రిమోనీ రఘురాం వారిని అనుసరించాడు.

చల్లటి గాలి తెరలుతెరలుగా వీస్తోంది. అమ్మ కళ్ళల్లోకి చూస్తూ–

## కవిత

# ట్రెండీ తంత్రం

- నందిరాజు విజయ్‌కుమార్
8309231858

*ఎన్ని వ్యూహాలు?! ఎన్నెన్ని ప్రతివ్యూహాలు!*
*బ్రతకటమంటే పన్నాగాలు పన్నే కళా?!*
*ప్రక్కవాణ్ణి బాగా వంచించ కల్గే నైపుణ్యమా?!*
*ఎదుటివాడిపై స్వారీ చేయగల్గే సామర్థ్యమా?!*
*మరి! విజేతకు నమూనాగా వీడ్నే చూపిస్తూ*
*సమాజం వీడికే వీరతాడేస్తుందేం?!*
*కరుణను కప్పుకున్న క్రౌర్యాన్ని*
*కనికరాన్ని చుట్టుకున్న కాఠిన్యాన్ని*
*ఔదార్యం ముసుగేసుకున్న కాపట్యాన్ని*
*జీవనకళగా శ్లాఘిస్తూ కైవారాలు పడుతుందేం?!*
*తోటివాడి స్వప్నాలను*
*వాడి కనురెప్పలకే తెలీకుండా కాజేయటం-*



*సాటివాడి శ్రమను*
*సౌజన్యం నటిస్తూ దోచేయటం-*
*ఎదుటివాడి దేహాన్ని ఎడారిగా మార్చి*
*ఎండమావి వైపు ఏకాకిగా పరుగెత్తించటం-*
*నయా సామ్రాజ్యవాదపు ఆకర్షణీయ వేదాంతం!*
*పరమ ఆత్మీయంగా కనపడుతూ*
*అందని ఆశను ఎరచూపించే*
*ఎకనమిక్ హిట్‌మేన్ ఆక్రమణా సూత్రం!*
*ఆధునిక ప్రపంచం ఆదర్శనీయమని వల్లించే*
*మాయాజలతారుల మార్మిక మార్కెట్ మంత్రం!* ◆

---

"అమ్మా, నేనొక నిర్ణయానికి వచ్చాను. కాదనవు కదా" అని అడిగాడు.

'మీ నాన్నయాక్సిడెంట్‌లో చనిపోయాక నా ఉచ్వాస నిశ్వాసలు అన్నీ నువ్వే కదరా. ఏది కాదన్నాను'

'అమ్మా, నేను పెద్ద అమ్మాయిని పెండ్లి చేసుకుంటాను' అన్నాడు.

ఉలిక్కి పడింది ఆమె. మ్యాట్రిమొనీ రఘురాం ఆశ్చర్య పోయినాడు.

'ఏమంటున్నావురా? ఆ అమ్మాయి వయస్సు 33. నీ వయస్సు 31. నీకన్నా పెద్ద వయసున్న అమ్మాయిని చేసుకోవాలనుకోవడం మంచిది కాదు'

'అలా అనకమ్మా. పెద్ద అమ్మాయికి పెళ్లి కాకపోవడానికి ఆ అమ్మాయి తప్పు ఏమీ లేదు. కుటుంబ పరిస్థితుల వల్ల ఆలస్యం అయ్యింది. నేను ఇప్పుడు రెండవ అమ్మాయిని చేసుకుంటే పెద్ద అమ్మాయికి పెళ్లి కావడం ఇంకా కష్ట మవుతుంది. పెద్ద మనసుతో ఆలోచించు. పెద్ద అమ్మాయికి నాతో పెళ్లి అయిపోతే రెండో అమ్మాయికి పెళ్లి సులభంగా జరుగుతుంది'

కొన్ని క్షణాలు కళ్ళు మూసుకుని ఆలోచించి "ఎంత ఎదిగినావురా బిడ్డా. ఇంకొకరి కష్టం ఆలోచించే మంచి మనస్తత్వం నీది. అంతా మంచే జరుగుతుందిరా బిడ్డా నీకు" అంది.

వియ్యంకుడు సుబ్బరాజును చెట్టుకిందకు పిలిచారు. మ్యాట్రిమొనీ రఘురాం విషయం చెప్పాడు.

కోరిన కొండ మీద వాన పడుతుండడం పట్ల సుబ్బరాజు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కళ్ళ నిండా కన్నీళ్లతో "మా పెద్ద అమ్మాయికి పెండ్లి చేయకుండానే చనిపోతానేమోనని భయపడ్డాను. దేవుడిలాగా ముందుకొచ్చావు. ఎంత సహృదయం బాబూ నీది. నీలాంటి విశాల హృదయం అబ్బాయిలకు ఉంటే వయసైన ఆడ పిల్లల పెళ్లిళ్ల సమస్య సమసిపోదా" అని కళ్ళ నీళ్లు పెట్టుకున్నాడు.

'ఇందులో నాది ఏమీ లేదు అంకుల్. నేను ఇలా పెద్ద అమ్మాయిని పెండ్లి చేసుకుంటానంటే మాములు మహిళ లాగా కాక విశాలహృదయంతో ఓకే చెప్పే అమ్మలెందరు ఉంటారు?' అంటూ అమ్మకి నమస్కరించాడు.

"నిజమే కదా, ఇలాంటి విషయాల్లో యువత ముందుకొచ్చినా ఎంతమంది పేరెంట్స్, ఎంతమంది బంధువులు వారికి సహకరిస్తారు" అని తనలో తానే అనుకున్నాడు మ్యాట్రిమొనీ రఘురాం.

అభిమానంగా పెండ్లికొడుక్కి షేక్ హ్యాండిచ్చి "ఈ పెండ్లి కుదిర్చినందుకు నేను ఫీజు తీసుకోను" అని గంభీరంగా చెప్పాడు.

మంచి ముహూర్తాలు చూడమని సుబ్బరాజుకు చెప్పి అక్కడి నుంచి బయలుదేరారు. డ్రైవర్ కారు స్టార్ట్ చేసి చెన్నై వైపు తిప్పాడు. ముందరి అద్దంలో సుబ్బరాజు గారి తెల్లటి మిద్దె కనబడుతోంది. మూలగా పెద్ద అమ్మాయి కృతజ్ఞతా పూర్వకంగా చేయి విసురుతోంది. పక్కనే చెల్లెల్లిద్దరూ కాబోయే బావకు థమ్స్ అప్ సంకేతాలు చూపిస్తున్నారు. ముగ్గురి కళ్లూ ఆనందభాష్పాలు రాల్చాయి.

బూరుగుచెట్టు మీది ఈల పిట్ట ఈల వేస్తూ ఉంది. ◆

## నిర్బంధం

# రద్దీగా ఉన్న జైళ్ల నుంచి తరలించండి

## మానవ హక్కుల కార్యకర్తల జైలు శిక్షపై - మహారాష్ట్ర సీఎంకు రోమిలా థాపర్ లేఖ

అరెస్టయిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్తలు, ప్రజా మేధావుల జైలు శిక్షకు సంబంధించి రోమిలా థాపర్ ఆందోళన వ్యక్తం చేశారు. వారిని రద్దీగా ఉండే జైళ్ల నుంచి తరలించాలని కోరుతూ రోమిలా థాపర్ సహా మరో ఐదుగురు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేకు లేఖ రాశారు. ప్రస్తుత కరోనా పరిస్థితుల నేపథ్యంలో వారిని గృహ నిర్బంధంలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జైలు లోపల ఉన్న కార్యకర్తల వయస్సు, ఇతర ప్రతికూల పరిస్థితులను వారు ఉటంకించారు. వీరిలో సీనియర్ సిటిజన్లు ఉన్నారు. కొందరు తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్నారు. వారు కరోనా బారిన పడితే తీవ్ర ప్రమాదకరంగా ఉంటుంది. "81 ఏండ్ల వరవరరావు ఇటీవల కుప్పకూలిన తర్వాత ఐసీయూలో ఉంచాల్సి వచ్చింది" అని లేఖలో పేర్కొన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్తలను జైలులో ఉంచే పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయనీ, వారి నిరంతర శ్రేయస్సుకు ఎటువంటి హామీ లేదని వివరించారు. కాబట్టి, అరెస్టు చేసిన కార్యకర్తలను వారి ఇండ్లకు లేదా వారి దగ్గరి బంధువుల వద్దకు పంపించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అరెస్టయిన 11 మందిలో గౌతమ్ నవలఖా, వరవరరావు, ఆనంద్ తేల్తుంబ్డే, సుధా భరద్వాజ్, షోమా సేన్, అరుణ్ ఫెర్రెరాలు తదితరులు ఉన్న విషయం తెలిసిందే. ♦

# చావని బతుకు కోసం

డా. సిద్దెంకి యాదగిరి
9441244773

కరోనా కవిత

*ఉరుముల్లేని పిడుగులుంటయంటే తెల్వకపాయే*
*కాళ్లకింది జాగ కాటేస్తుందంటే అర్థంకాకపాయే*
*శత్రువుకు బైరూపులుంటయంటే బోధపడకపాయే*
*ప్రపంచ మనుషుల గావుపడుతూ ప్రాణాల్ని జుర్రుతూ*
*జగమంత భస్మీపటాలం చేస్తుంటే తెలియకుంటుందా?*
*అదృశ్య భూతమొకటి ఆవురావురంటూ*
*ఆకలితో గర్జిస్తుంటది*
*సలసలమరిగే సీసంలా చావుగీతం భీభత్సంగా ఆలపిస్తున్నది*
*నిర్లక్ష్యపు శిక్షకు వుల్లాషితనం సచ్చుపీనుగై వేలాడుతుంటది*
*ప్రాణాలు చీల్చబడుతాయని భయపెడుతవా? బతుకుతవు*
*ధైర్యమున్నోనికి వ్యూహముంటది*
*వ్యూహానికి ఉపాయము తోడై ఆచరణ రణమైతది*
*ముగింపులేని తెగింపు విరిచిన రొమ్ము*
*మింగుడుపడని తన కనికట్టు పద్మవ్యూహంల*
*తానే చిక్కి గిలగిల కొట్టుకాడుతది*
*సచ్చుపోయించాలనుకున్నా సచ్చుపడుతది*
*ఎన్ని గండాలు దాటితే ఇంత బతుకు బతుకుతున్నం*
*లోకమంత అలజడి ఉన్నపుడే మనలోగుట్టు తేల్చేది*
*కల్లోలమైనపుడే మన కట్టుబాటు తెలిపేది*
*ఎన్నైనా చెప్పు చావూ బతుకు మనచేతల్లనే ఉంటది*
*నిల్చేది తల్చేది ఎటువైపు?*
*ఈ భూమ్మీద యుద్ధం లేంది ఎక్కడ?*
*ఎగపోసుకుంట ఎంత దూరం ఉరుకుతవ్*
*ఉరికినంతదూరం భూమి ఉంటది*
*నేలపై మృత్యువు నమలక గుటకేయాలని*
*నసపెడుతుంటది*
*యోధున్ని సాయుధున్నని గర్వపడకు*
*ఏ దిక్కు పోయినా ఒ దిక్కు ఎదురైతది*
*ఇపుడు ఆ ధృతరాష్ట్ర కౌగిలి తప్పించుకోలేవు*
*పరిగెత్తాల్సింది నువ్వుకాదు నీ ఆలోచనలు*
*బయటంతా సమాధులతోట*
*లోనంత జీవపు ఊట*
*బతుకుతీపి ఉంటే బంధీగా*
*సంధించే చావును శుభ్రపడుతూ ఎదుర్కో*
*అలక్ష్యం, అజాగ్రత్త అన్నీ కలిస్తే దింపుడుకల్లం*
*మందే మనమై, మనమే మందై చికిత్స చేసుకోవాలే*
*నిర్బంధాన్ని కన్నీళ్లతో రోదిస్తూ నానా యాగీచేయకు*
*చావని బతుక్కోసం నీవే యాగమవ్వు* ♦

ఇంటర్వ్యూ

# అభివ్యక్తి స్వేచ్ఛను అణగతొక్కుతున్న కాలమిది

## - నిఖిలేశ్వర్



ఇంటర్వ్యూ : కె.ఆనందాచారి
9948787660

♦ *మీ బాల్యం కుటుంబం నేపథ్యం*

■ గతంలో నల్లగొండ జిల్లా ఇపుడు యాదాద్రి భువనగిరి జిల్లాలోని వీరెల్లి గ్రామంలో 1938లో జన్మించాను. కుంభం నర్సయ్య, సురవరం నర్సమ్మలు తల్లిదండ్రులు. మాది రైతు కుటుంబం. నాన్న ఇల్లరికం వచ్చాడు. కుటుంబంలో ఒక్కరూ అక్షరాస్యులు లేరు. నాకు ఏడాది వయసున్నప్పుడే నాన్న చనిపోయారు. ఆ తర్వాత అమ్మ తన తమ్ముడు సురవరం నరసింహారెడ్డి వద్ద కొంతకాలం వ్యవసాయం చేసింది. అనంతరం నన్ను చంకన వేసుకొని హైదరాబాద్ వచ్చింది. ఇండ్లలో పనులు చేసేది. చివరికి వివిఎస్టి (చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ) శ్రామికురాలిగా పనిచేస్తూ నన్ను చదివించింది.

నేను హైదరాబాద్ సికింద్రాబాద్ వీధి బళ్లలో అక్షరాలు దిద్దుకున్నాను. జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉండగా అప్పుడే ప్రారంభించిన ఉచిత హిందీ తరగతులకు వెళ్లి హిందీ నేర్చుకున్నాను. శారద భూషణ్‌లలో ఉత్తీర్ణత సాధించాను. అప్పటి నుంచే హిందీ సాహిత్యం పరిచయమైంది. 1960లో హైదరాబాద్ సాయం కళాశాల (నిజాం కాలేజీ ఆవరణ) పీయూసీ, బి.ఏ, బిఎడ్ చేశాను. 1964-65లో ఉస్మానియాలో సైకాలజీ కోర్సు పూర్తి చేశాను. ఎంఏ మొదటి సంవత్సరం పూర్తి చేసి పరీక్షలు రాయలేదు.

♦ *సాహిత్యం పట్ల ఆసక్తి ఎలా కలిగింది?*

■హెచ్ఎస్‌సిలో లెక్కల పరీక్ష తప్పి రెండేండ్లు కొంత అరాచకంగా తిరిగి తర్వాత ముషీరాబాద్‌లోని అభ్యుదయ యువక సంఘం స్థాపించి, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాను. ఆ సందర్భంగా ఎంతో నేర్చుకున్నాను. గతంలో చదివిన హిందీ సాహిత్యం భగవద్గీత పఠనం, ఆర్య సమాజ్ ప్రభావంతో వేదాల పరిచయం నా ఆసక్తిని పెంచాయి. కాలేజీలో చేరినప్పుడు ఆంగ్లంపై మక్కువ పెరిగింది. బిఏ లో ఇంగ్లీష్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్ చేశాను. ఆ కాలేజీలోనే సహ విద్యార్థి ఎన్ హెచ్ కేశవరావు (నగ్నముని), అలాగే మాకు జూనియర్ ఏవి రాఘవాచార్యులు (జ్వాలాముఖి), మాకు సీనియర్ సుబ్రహ్మణ్యం (దిగంబర కవుల సంచాలకుడు) సహచరులు. తెలుగు హిందీ ఇంగ్లీష్ సాహిత్యాల పట్ల ఆసక్తి పెరగటానికి ముషీరాబాద్‌లోని గౌరీశంకర్ గ్రంథాలయం కళాశాలలో అధ్యయనం ఉపయోగ పడింది. అమ్మకు ఏకైక సంతానంగా ఎంతో స్వేచ్ఛగా పెరిగాను. నిత్యం అధ్యయనం చేశాను.

చలం, శ్రీశ్రీ, శరత్‌ను చదువుతున్న కాలంలోనే హిందీలో ప్రేమ్‌చంద్ 'నిర్మల' నవల రామ్ నరేష్ త్రిపాఠి 'పథిక్' ఖండకావ్యం, రష్యన్ సాహిత్యం, సోమర్‌సెట్ మామ్ నవలలు, ఇలియట్ కవిత్వం మరోవైపు సాహిత్య అధ్యయనానికి ఊపునిచ్చాయి.

***♦ మీ అచ్చయిన తొలి రచన***

■చిన్న చిన్న కథలు 'బాల' లాంటి పత్రికల్లో వచ్చాయి 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ నాడు 'గోలకొండ' పత్రిక ప్రచురించిన సంచికలో తొలి రచన ''టెలివిజన్ ఎలా పనిచేస్తుంది'' కె.యాదవరెడ్డి పేరుతో అచ్చయింది. అప్పుడు నేను తొమ్మిదో తరగతిలో ఉన్నాను. ఆ తర్వాత కళాశాల వార్షిక సంచికల్లో వచ్చాయి.

***♦ మీ కథల గురించి..:***

■గత నలభై సంవత్సరాలలో నలభై కథలు రాసి ఉంటాను. వాటిలో 22 కథలు 'నిఖిలేశ్వర్ కథలు' సంపుటిగా వచ్చాయి. ఇతర భాషల నుండి అనువదించిన కథలు ఇరవై దాకా ఉన్నాయి. కథా వారధి పేర ఎమెస్కో ప్రచురించింది. కమలనాథ్, రాజేంద్ర యాదవ్ హిందీ నవలలూ అనువదించాను. తొలిదశలో కథలు, నవలలు రాయాలనే కోరిక ఉండేది. కానీ ఉద్యమపరంగా కవితా రచన జీవితంలో భాగమైంది. కథల ఇతివృత్తాలన్నీ విప్లవ పోరాటాలు, మన విద్యా వ్యవస్థ, స్త్రీ పురుష సంబంధాలు, మధ్య తరగతి సమస్యలు, యుద్ధం, మతం, భూమి తదితర సమస్యలకు సంబంధించినవి.

***♦ దిగంబర కవిత్వం వైపుకు ఎలా:***

■1965 దిగంబర కవుల మొదటి సంపుటి వెలువడక ముందు మేం ఆరుగురం మా సొంత పేర్లతో రచనలు చేశాము. ఆ నాటికి నా రచన ఏది గ్రంథ రూపం దాల్చలేదు. కేశవరావు, కమ్మిశెట్టి కవిత్వం సంపుటిగా వచ్చాయి. అప్పటికే నేను 'కోపోద్రిక్త యువతరం' శీర్షికన కవితలు, రాజకీయ వ్యాసాలు 'గోలకొండ పత్రిక'లో రాసాను. బ్రిటన్‌లో ఆనాటికి వచ్చిన 'యాంగ్రీ యంగ్ మాన్ సాహిత్యంలో జాన్ అస్బార్న్ నాటకం లుక్ బ్యాక్ ఇన్ యాంగర్' నన్ను ప్రేరేపించింది. ఆ రోజుల్లో నా కవిత 'కోపంతో వెనక్కి చూడు' తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు 'రాత్రి' కవితా సంకలనం ఒక మలుపు. వేం ఆరుగురం యువ ఆగ్రహం, సామాజిక తిరుగుబాటుతత్వం, సాహిత్య రాజకీయ పరంగా ఒక 'బ్రేక్ త్రో' తో ఏర్పడినవే దిగంబర కవుల మూడు సంపుటాలు. దీనిపై ప్రశంసలతో పాటు తీవ్ర విమర్శలూ వచ్చాయి.

***♦ దిగంబర కవుల భాషపై వచ్చిన విమర్శకు ఏమంటారు***

■ఒక ధర్మాగ్రహంలో పెల్లుబికిన భాష అది. అయితే కొన్ని కవితల్లో అశ్లీల పదజాలం కొంత మితిమీరినప్పటికీ అవి ఆనాటి యువ ఆగ్రహం, ఆక్రోశం.

***♦ కుల పీడనం గురించి ఇందులో ఆగ్రహం లేదే:***

■అనేక వైరుధ్యాలు ఉన్న సమాజం సమూలంగా మారి ఒక మానవీయ వ్యవస్థగా రూపొందాలనే స్వప్నం దిగంబర కవులది.

***♦ అభ్యుదయ సాహిత్యోద్యమం మీపై చూపిన ప్రభావం***

■చారిత్రకంగా అభ్యుదయ సాహిత్యం మౌలికంగానే తన పాత్రను నిర్వహించింది. తొలిదశలో నాపై గురజాడ, శ్రీశ్రీ, సోమసుందర్ తదితరుల ప్రభావం ఉంది. 1965 నాటికి అభ్యుదయ సాహిత్యంలో స్తబ్ధత ఏర్పడింది. అందుకే దిగంబర కవులు, విప్లవ సాహిత్యం అవసరమైంది.

***♦ విరసంతో విభేధానికి కారణాలు***

■విరసానికి సంస్థాపక సభ్యునిగా, కార్యదర్శిగా సాహిత్య సాంస్కృతిక రంగంలో విప్లవ స్ఫూర్తితో పని చేయాల్సిన సంస్థ 1975 నాటికి విప్లవ గ్రూపుల పంథాల వివాదాల్లో చిక్కుకుంది. ముఖ్యంగా చారుమజుందార్ అరాచక అతివాద పంథాను ప్రచారం చేసిన రచయితల ప్రాబల్యం పెరిగింది. అందువల్ల నేను ఇతర మిత్రులతో పాటు 1975 అనంతరం మహాసభలో బాహాటంగా వ్యతిరేకించి రాజీనామా చేశాను, ఆ తర్వాత నేను జ్వాలాముఖి జనసాహితి సంస్థాపక సభ్యులం. 'ప్రజాసాహితి' పత్రికకు రెండేండ్లు సంపాదకునిగా ఉన్నాను. అక్కడ కూడా ముఠా రాజకీయాలు, వ్యక్తిగత ప్రాబల్యాలు అనుభవంలోకి రావడంతో తప్పుకున్నాను.

***♦ ఇప్పుడు మన సమాజంలో విప్లవానికి ఏది సరైన మార్గం అనుకుంటున్నారు?***

■ప్రస్తుత భారతదేశంలో దళారి పెట్టుబడిదారీ ధనస్వామ్యం చేతిలో ప్రజాస్వామ్యమున్నది. అర్థ భూస్వామ్య లక్షణాలతో పాటు మతపరమైన దురహంకార పాలన కొనసాగుతున్నది. సమాజంలో అనేక సాంకేతిక మార్పులు వచ్చాయి. గతంలో వచ్చిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, శ్రీకాకుళం నక్సల్బరీ పోరాటాలు ఎన్నో అనుభవాలను ఇచ్చాయి. అనేక మార్పులొచ్చినా నేడు సాయుధ పోరాటం ప్రాసంగితకతను కోల్పోయింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజా విప్లవం కోసం కొత్త ప్రజా పోరాట రూపాలను అనుసరించాలి. వ్యూహాన్ని మార్చుకోవాలి. ఆత్మశోధన చేసుకోవాలి.

**♦ అస్తిత్వ ఉద్యమాల గురించి..**

■వామపక్ష ఉద్యమాలు విస్మరించడం వల్ల దేశంలో దళిత, స్త్రీవాద, బహుజనవాద అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయనే విమర్శ ఉంది. అందులో కొంత నిజం వున్నా ఉమ్మడి కమ్యూనిస్టు చరిత్రనూ విప్లవ గ్రూపుల చరిత్రనూ పరిశీలించినా ఆ విమర్శ పాక్షికమైనదని అర్థమవుతుంది. ఆయా అస్తిత్వ ఉద్యమాల సమస్యలన్నీ వామపక్ష ఉద్యమాలలో అంతర్లీనంగా వుండి, దేశంలోని ఫ్యూడల్ శక్తులను ప్రతిఘటించే శక్తిని అందించాయనే యధార్థాన్ని విస్మరించలేము. అయితే మారిన పరిస్థితులలో మహా మేధావి బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలతో స్ఫూర్తితో ఉద్యమిస్తున్న దళిత, బహుజనులంతా ఏ నాటికైనా వామపక్ష వర్గ పోరాటాలతో మమేకం కాక తప్పదు.

**♦ అస్తిత్వ ఉద్యమాల ప్రభావాలు ఎలా ఉన్నాయి?**

■మన దేశంలో కుల వ్యవస్థ ఇప్పటికీ పటిష్టంగానే వుంది. దళితులు, స్త్రీలు, మైనారిటీలు అనేక అణచివేతలకు గురవుతున్నారు. వీటిని ప్రశ్నించి ధిక్కరిస్తున్న అస్తిత్వ ఉద్యమాలకు కొన్ని పరిమితులు ఉన్నాయి. దళిత ఉద్యమాలన్నీ చివరకు రిజర్వేషన్లు, రాజ్యాధికారంలో భాగస్వామ్యంతో సంతృప్తి పడుతున్నాయి. ఆత్మగౌరవం ఎజెండాలో వున్నా మౌలికంగా దేశంలో రావలసిన కుల రహిత సమాజం పట్ల స్పష్టత లేదు. భూస్వామ్య పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అణచివేతల ధ్యాసే లేదు. వర్గపోరాటమనే మౌలిక పంథాను పక్కనబెట్టి కేవలం కులపోరాటాలే దిక్కు అని భావిస్తున్నారు. దళిత రాజకీయ నాయకులు సంజీవయ్య, జగజ్జీవన్‌రాం, మాయావతి మొదలైన వాళ్ళు అధికారంలోకి వచ్చినా కూడా దళితులకు జరిగిన సామాజిక న్యాయమెంత? ఇక స్త్రీలు వ్యక్తిగత స్వేచ్ఛ లైంగికతనే ముఖ్యమని పురుషాధిక్యతను ధిక్కరించే వరకే పరిమితమయ్యారు. మైనారిటీలు తమలోని మతాధిపత్యాన్ని ధిక్కరించలేక పోతున్నాయి. అందువల్ల విస్తృతమైన ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించి శ్రామిక పీడిత వర్గాలను విభజించాయనేది వాస్తవం.

**♦ మీరు రాసిన సాహిత్య విమర్శ, రాజకీయ పరిణామాలపై రచనలు**

■కవిత్వంతో పాటు సాహిత్య విమర్శ కూడా రాశాను. మారుతున్న విలువలు – సాహిత్యం, కవిత్వ శోధన, మూడు సంపుటాలు వచ్చాయి. రాజకీయ పరిణామాలపై "ఎవరిదీ ప్రజాస్వామ్యం – ఏ విలువలకీ ప్రస్థానం" శీర్షికన సంపుటి వచ్చింది.

**♦ ఒక దృక్పథంతో కాక వ్యక్తుల కేంద్రంగా ఏర్పడుతున్న సాహితీ బృందాల గురించి ఏమంటారు**

■వ్యక్తుల కేంద్రంగా సాహితీ ముఠాలు తటస్థ పడుతూనే ఉన్నాయి. వ్యక్తి వాదులైన కవులకు రచయితలకు షార్ట్‌కట్ ఖ్యాతి కావాలి. పురస్కారాలు సన్మానాలు ఇవే వారి గమ్యం. సామాజిక, రాజకీయ నిబద్ధతను తిరస్కరించి శుద్ధ కళాత్మకవాదం పేరిట పలాయన వాదాన్ని ఆశ్రయిస్తారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ వ్యక్తి అస్తిత్వ ధోరణి ఆధునికానంతర వాదంగా దూసుకొచ్చి.. తర్వాత తోక ముడిచింది.

**♦ నేటి మతతత్వం సంస్కృతి ఏకీకరణ పెరుగుతున్న సందర్భంలో సాహిత్య కారుల కర్తవ్యం**

■భారతీయ ఏకాత్మకత అనే పేరుతో సంకుచితతత్వం విస్తరిస్తున్న మాట నిజం. కులతత్వంతో పాటు, పాలకుల్లో ఫాసిస్టు లక్షణాలు విజృంభిస్తున్నాయి. జాతీయ సంస్కృతి హిందూత్వంలోనే వుందని ఆర్‌ఎస్‌ఎస్ చెబుతూ సెక్యులర్ ప్రజాతంత్రవాదులపై, మైనారిటీలపై దాడులు చేస్తున్నది. ఈ మత దురహంకార దాడిని ఎదుర్కోవడానికి సాహితీ వేత్తలు, రచయితలు, మేధావులు ఐక్య సంఘటనగా ఉద్యమించాలి.

**♦ నేటి సాహిత్యంపై కవులకు మీరిచ్చే సందేశం..**

■సమకాలీన యువకులు కొందరు చక్కని చిక్కని కవిత్వం రాస్తున్నారు. కానీ అత్యధికులు ఇన్‌స్టాంట్ కాఫీలా ఏవో కొన్ని కవితల వంటివి రాసి ముద్రించి భుజాలు చరుచుకుంటున్నారు. నిరంతర అధ్యయనాలతో పాటు కవిత్వ తత్వాన్ని ఆకళింపు చేసుకోవాలి. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు భజనలు చేస్తున్న రచయితలు, కవుల సంఖ్య పెరిగిపోయింది. అభివ్యక్తి స్వేచ్ఛను అణగదొక్కుతున్న కాలమిది. ఈ సమయంలో నిజాయితీగా ప్రజల పరంగా నిర్భయంగా రచనలు చేయాలి.

**♦ ప్రస్తుత మీ సాహిత్య సృజన...**

■ప్రస్తుతం నేను జీవితానుభవాలను, జ్ఞాపకాలను 'నిఖిలలోకం' పేరిట స్వీయ చరిత్రను రాస్తున్నాను. నా యాభై సంవత్సరాల కవిత్వం 'నిఖిలేశ్వర కవిత్వం'గా వచ్చింది. 'అగ్నిశ్వాస' ఆంగ్ల కవితా సంపుటి 'లైఫ్ ది ఎడ్జ్ ఆఫ్ నైఫ్' వచ్చాయి. నా హిందీ కవితల సంపుటి 'ఇతిహాస్ కే మోడ్ పర్' వచ్చాయి. ♦

## కవిత

# నిశ్శబ్ద యుద్ధం

కరోనా కవిత

మూన్
8712312373

అగ్ని పర్వతాలు బ్రద్దలవటం తెలుసు
భయంకర విస్ఫోటనాలు చూసాం
కర్ఫ్యూలు.. స్ట్రైకులు.. చూసాం
ఊర్లలో.. జిల్లాల్లో.. రాష్ట్రాల్లో..
దేశమంతా బంద్‌లూ... చూసాం
రోడ్లన్నీ నిర్మానుష్యం కావటం చూసాం
కానీ....
ఒకేసారి ఊళ్ళకి ఊళ్లూ..
జిల్లాలూ.. రాష్ట్రాలూ.. దేశాలూ
మొత్తం
ప్రపంచమంతా..నిర్మానుష్యమవటం
ఆశ్చర్యం !! భయంగొలిపే ఆశ్చర్యం !!!
నిజమేనా.. అన్పించే ఆశ్చర్యం !!!
కారణం.. ఓ చిన్న 'వైరస్ '
ఎక్కడో మొదలై దేశాలూ..
ఖండాంతరాలూ పాకింది
మనవళ్ల నుండి తాతల వరకూ
అన్నలనుండి తమ్ముళ్లవరకూ
అక్కలనుండి చెల్లెళ్ళ వరకు
తల్లిదండ్రులనీ.. మామా అల్లుళ్ళనీ
అత్తా కోడళ్ళనీ..
ఎవ్వరినీ వదల్లేదు

ఓ మనిషీ...
ఇన్నాళ్లూ... నా కులం, నా మతం
నా వాళ్ళు అంటూ
గిరి గీసుకున్నావు..గింజుకున్నావు
ఆ పరిధులకు గీతలకు లొంగకుండా
అన్నిటినీ దాటి వచ్చేసింది
దానికి కులాలు, మతాలు, జాతులు
ధనికులు, నిరుపేదలు
ముసలీ, ముతకా
పిల్లా, జెల్లా.. తేడాలు లేవు
మనం – ఎన్నో పోరాటాలు
చూశాం, చేశాం
స్వాతంత్ర్య సమరం,
పొరుగు దేశాలతో యుద్ధాలు
ప్రపంచ యుద్ధాలు..
కన్నాం, విన్నాం
ఆ పోరాటాలకు కావలసింది
సైన్యం, తుపాకులూ,
బాంబులూ, విమానాలూ
కానీ.. అవన్నీ ఏవీ వద్దు

ఈ శత్రువును గెలవాలంటే..
దాన్ని దూరం పెట్టాలి..అందుకు–
ఒంటరి పోరాటం చేయాలి
ఒంటరిగా.. ఎవరినీ కలవకుండా
బయటికి వెళ్లకుండా
ఉన్న చోటనే.. నువ్వున్న ఇంట్లోనే
ఒంటరి గా ఉండిపో !!
ఆ వైరస్ పోతుంది..
పారిపోదు.. కానీ నశించి పోతుంది
మళ్ళీ రాదు.. రాలేదు !!
మనమంతా ఒక్క మాటమీద
నిలిచే అవకాశం వచ్చింది..
ఒక్క మనమే కాదు దేశ ప్రజలంతా..
ప్రపంచ ప్రజలంతా..
ఒక్కరుగానే.. ఒంటరిగానే.. ఉంటూ
పోరాడకుండానే శత్రువును గెలిచే
అవకాశం !
ప్రతి ఒక్కరూ గెలిచే అవకాశం !!
అందుకే.. ఇది ఒంటరి పోరాటం !!! ♦

# నమ్మకం

- తిరునగరి శ్రీనివాసస్వామి
9440369939



సన్నని దారాన్ని
ఆధారం చేసుకొని
ఎవ్వరికీ అందనంత దూరానికి
ఎగిరి పోతుంది గాలిపటం
ఎక్కడైనా దారం
తెగి పోతుందనే భయంతో కాదు
తాను అనుకున్న లక్ష్యాన్ని
చేరుతాననే నమ్మకంతో...

పై కెగురుతూ
ఎన్నిసార్లు
కింద పడుతుంది కెరటం
కింద పడిన ప్రతి సారి
రెట్టింపైన ఉత్సాహంతో
పైకి లేస్తుంది
గెలుస్తాననే నమ్మకంతో...

తప్పటడుగులు వేస్తూ
ఎన్ని సార్లు
కింద పడతాడు పసివాడు
దెబ్బలు తగిలినా లెక్క చేయక
పట్టుదలతో అడుగులేస్తాడు
పరుగు తీస్తాననే నమ్మకంతో...

అడుగేస్తే ఏమవుతుందో నని
అడుగడుగునా భయపడితే
మనిషి జీవితంలో
ప్రగతికి చోటెక్కడిది?
అనుకున్నది సాధించాలంటే
అలుపు లేకుండా మనం
ప్రయాణించాలి... ♦

విశ్లేషణ




# మనకాలపు గాంధీలు మండేలాలు మార్టిన్ లూథర్‌లు...

గోపాలకృష్ణ గాంధీ

*లాక్‌డౌన్ అంటే పనులు, జీతాలు కోల్పోవడం భద్రతే లేకుండా పోవడం. వారిని ఇళ్లలోనే బంధించడం అంటే కిక్కిరిసిన ఇళ్లలో ఊపిరాడక ఒకరి గాలి మరొకరు పీల్చడమే. అందుకే తట్టుకోలేక ఎంత దూరమున్నా కాలినడకన స్వస్థలాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సాటి మానవులైన ఈ జనం ఇంట్లోనే వుండటం అంటే స్వస్థలాలకు చేరడమేనని ఏలినవారికి బోధ పడటానికి చాలా కాలం పట్టింది.*

మొదట ఈ వైరస్ గురించి చెప్పినందుకు గాను ప్రతికూలతకు గురైన వూహాన్ డాక్టర్ లీ వెన్లింగ్ ఇప్పుడు నీరాజనాలు అందుకుంటున్నాడు. ఇండియా, అమెరికా, దక్షిణాఫ్రికాల లోనూ లీ లు వున్నారు. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది, పోలీసులు, గార్డులు ఇంకా ఎంతో మంది జాత్యహంకారానికి వ్యతిరేకంగానే గాక సాయినాథ్ చెప్పిన వర్గతత్వం పైనా ఎలుగెత్తుతున్నారు. మూడు దేశాల లోనూ నిరసన తెలిపే వారు గాంధీ, మండేలా, కింగ్ త్రయానికి తోడు లీ, ఫ్లాయిడ్, జమలో లను కూడా కలిపి మాట్లాడుతున్నారు. మనం వాళ్లతో గొంతు కలుపుదాం.

ప్రపంచ వ్యాపితంగా ప్రజలు జాతి దురహంకారానికి, వర్గ తత్వానికి, అహంకార పూరితమైన కులీన తత్వానికి వ్యతిరేకంగా ఎలుగెత్తి నినదిస్తున్నారు. మహాత్మా గాంధీని గాని లేక నెల్సన్ మండేలాను గాని కాదంటే మార్టిన్ లూథర్ కింగ్‌ను గాని స్మరించుకునే సందర్భంలో వారు మనను గట్టిగానే మందలించడం అనివార్యం.

ఈ రోజున ఆ ముగ్గురూ తమ తమ శైలిలో ఒకటే చెప్పేవారు. ''మీరు మమ్ములను స్మరించుకోవాలంటే వినవలసింది మా మాటలు కాదు, మమ్ములను గురించి ఇతరులు చెప్పే మాటలు కాదు. మీ మనస్సాక్షితో మీరు మాట్లాడుకోండి. మేము చేసిందే అది. మనం మన యోధులనూ వీరనారులను వెనక్కు తిరిగి చూసుకుంటాం. వారి వార్షికోత్సవాలు జరుపుకొంటాం. వాస్తవంలో ఇదంతా చేయడం మన చుట్టూ వున్న ప్రపంచాన్ని మరింత బాగా అర్థం చేసుకోవడానికే. భవిష్యత్తును తేరిపార చూడటానికే. ఈ రోజున ఇండియా ఒక స్వతంత్ర దేశం. ఒకనాటి వలసీకృత పరాధీన ప్రపంచం కాలగర్భంలో కలిసి పోయింది, దక్షిణాఫ్రికాను హింసించిన కర్కశ ఇనుప సంకెళ్లు తెగిపోయాయి. పౌర హక్కుల చట్టం ఆమోదించడం ద్వారా అమెరికా బానిసత్వాన్ని అప్రతిష్ఠాకరమైన గత చరిత్రలో కలిపేసింది. ఇటీవలి కాలం వరకూ కూడా బస్సులో ఎక్కడానికి హక్కు లేని ప్రజా సమూహం నుంచి బరాక్ ఒబామా అనే విశిష్ట అధ్యక్షుడిని ఎన్నుకునే దాకా ఆ దేశం పయనించింది. కాని మీరు అంటే భారతీయులు, దక్షిణాఫ్రికన్లు, అమెరికన్లు సంతోషంగా సంతృప్తిగా వున్నారా?" వారు ఆవేదనతో, బాధతో అడిగే ప్రశ్న ఇదే. దీనికి సమాధానం మనకు తెలుసు.

### దురాశామయ నాగరికత, ప్రకృతి

ఇండియా, దక్షిణాఫ్రికా అమెరికా మొత్తం ప్రపంచం కూడా కోవిడ్-19 విష వలయంలో చిక్కుకుని వుంది. వాస్తవానికి నేటి దురాశామయ నాగరికత భూగోళం వనరులను కబళించేస్తున్నది. వ్యాపార దాహంతో భూమి మీద జీవిత రూపాలనే వేటాడుతున్నది. ప్రతి చోటా ఒక ఆటవిక మార్కెట్ వుంటుంది. పేదలు కాని మనందరిలో కూడా ఒక దురహంకార పూరిత నిర్లక్ష్యం గూడు కట్టుకుంది. కరోనా వైరస్ గతంలో హిరోషిమా, నాగసాకి పై ఆవరించిన రాక్షస మేఘాలకు పెద్ద భిన్నమైనదేం కాదు. ఇప్పుడు బలైనవారూ బాంబుకు బలైన వారి లాంటివాళ్లే.

ప్రకృతి మనతో మాట్లాడదు. దానికి విధ్వంసకరమైన

ఆధిపత్య శక్తి వుంటుంది. దాన్ని మనం గౌరవించాల్సిందే. అమానుష అంతర్జాతీయ అంటువ్యాధులు ఆధునిక ఉత్పత్తి వ్యవస్థల అనాలోచిత, అనర్థక పర్యవసానాలు. అణు, రసాయన, జీవాయుధాలను సృష్టించడం, నిర్బంధంలో హింసించే రాజ్యాల స్వభావం ఫలితాలు. హింసను నిరోధించాలంటూ ఐరాస రూపొందించిన ఒప్పందంపై ఆల్బర్ట్ లూథర్, మండేలా దేశమైన దక్షిణాఫ్రికా సంతకాలు చేసింది. అబ్రహం లింకన్, మార్టిన్ లూథర్ కింగ్‌ల దేశమైన అమెరికా కూడా షరతులతో ఆమోదించింది. రవీంద్రనాథ్ టాగూర్, మహాత్మా గాంధీల దేశమైన ఇండియా మాత్రం హింసను నిరోధించే ఒప్పందంపై సంతకాలు చేయలేదు. ఆ ఇద్దరు వ్యక్తులు దీనిపై ఏమనేవారు?

అంతిమ క్షణాల్లో జార్జి ఫ్లాయిడ్ అన్న మాటలు 'నాకు ఊపిరాడ్డం లేదు'. మార్టిన్ లూథర్ కింగ్ సజీవ పదాలు 'నాకో స్వప్నం వుంది.' ప్రపంచం మాస్కులతో గాలి పీల్చుకుంటున్న సమయంలో ఫ్లాయిడ్ మాటలు వెలువడ్డాయి. భయంతో గాలి పీలుస్తున్న ఈ సమయం మనం తెచ్చి పెట్టుకున్న సంక్షోభం మానవ మూలాలేమిటో స్పష్టంగా కళ్లకు కడుతున్నది.

## నాటి గాంధీ రైలు – నేటి భారత దృశ్యం

గాంధీజీని 1893 జూన్ 7 రాత్రివేళ పీటర్ మార్టిగ్స్‌లో రైలు పెట్టె నుంచి తోసివేశారు. ఆ రైలు ప్రయాణం వలసవాద చరిత్రనే మార్చింది. ఈ రోజు ఇండియాలో ఎవరినో రైలు పెట్టె నుంచి తోసివేయడం కాదు. లక్షోపలక్షల మందిని కిక్కిరిసి తీసుకెళ్లడం జరుగుతున్నది. గాంధీజీ ఒక విదేశంలో నిర్ణీత ఆదాయం గల లాయర్ కావడం ఒక్కటే తేడా. ఈ వలస కార్మికులకు పనులు లేకుండా, ప్రయాణ సాధనాలు లేకుండా లాక్‌డౌన్ చేశారు. పై తరగతుల వారికి లాక్‌డౌన్ అంటే ఇళ్లలోనే వుండటం, సినిమాలు చూడడం, వంటలు చేయడం, తినడం, రాయడం, చదవడం, ఒకరికొకరు మీటరు దూరంలో వుండటం మాత్రమే. ఈ కోట్లాది వలస కార్మికులకు లాక్‌డౌన్ అంటే పనులు, జీతాలు కోల్పోవడం భద్రతే లేకుండా పోవడం. వారిని ఇళ్లలోనే బంధించడం అంటే కిక్కిరిసిన ఇళ్లలో ఊపిరాడక ఒకరి గాలి మరొకరు పీల్చడమే. అందుకే తట్టుకోలేక ఎంత దూరమున్నా కాలినడకన స్వస్థలాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సాటి మానవులైన ఈ జనం ఇంట్లోనే వుండటం అంటే స్వస్థలాలకు చేరడమేనని ఏలినవారికి బోధ పడటానికి చాలా కాలం పట్టింది. వేసిన రైళ్లు ఏ మూలకూ చాలవు. ఎనభై మంది వలస కార్మికులు రైళ్లలో చనిపోయారు. ఆకలి గాని అంటు రోగ వ్యాప్తి గాని కారణం కాదని రైల్వేలు చేసిన ప్రకటన నేను నమ్ముతున్నాను. అయితే రైల్వే శాఖ వారు చనిపోలేదని మాత్రం చెప్పలేదు.

ఈనాడు మనం హీరోల గురించి మాట్లాడుతున్నాం. నేనొక చిన్న హీరోయిన్ గురించి చెప్పేదా? భారత దేశంలో గ్రామీణ జీవితాలను చిత్రించే అలుపెరుగని ప్రయోక్త పి.సాయినాథ్ బృందం మనకు చెప్పింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 12 ఏళ్ల జమలో మడ్కం అనే మురియా గిరిజన తెగ బాలిక తెలంగాణలో మిరప తోటలలో పని చేయడానికి వెళ్లింది. లాక్‌డౌన్ తర్వాత పని లేదని ఇక వెళ్లిపోవచ్చని చెప్పేశారు. తోటివారితో పాటు తనూ నడవడం మొదలెట్టింది. మూడు రోజులు 140 కిలో మీటర్లు నడిచాక...తమ ఊరు 60 కిమీలు మాత్రమే వున్నప్పుడు అడుగు వేయలేక కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలింది. వైరస్ ఆమెను ఏమీ చేయలేదు. రైలు నుంచి తోసివేయబడలేదు. అవకాశాల నుంచి ఆఖరుకు జీవితం నుంచే తోసివేయబడింది. మొత్తంగా వినియోగ జనాభాగా మారిన భారతీయులమైన మనమంతా అందుకు బాధ్యులం.

## మళ్లీ అదే ఫక్కీ


కోవిడ్ 19 తర్వాత ఈ ప్రపంచం మళ్లీ ప్రకృతి చెలగాటానికి పాల్పడుతుందా? ఈ వేలాది మంది మరణాల నుంచి ఏమైనా నేర్చుకుంటుందా? చచ్చిపోయేవాళ్లను చావనివ్వండంటూ లాక్‌డౌన్ సడలింపులపై కేరింతలు కొట్టే ఉన్నత వర్గాల తీరు మాత్రం పాత కథనే పునరావృతం చేస్తున్నది.

అయినా మనం పూర్తిగా ఆశ వదులుకోనక్కరలేదు. మొదట ఈ వైరస్ గురించి చెప్పినందుకు గాను ప్రతికూలతకు గురైన వూహాన్ డాక్టర్ లీ వెన్లింగ్ ఇప్పుడు నీరాజనాలు అందుకుంటున్నాడు. ఇండియా, అమెరికా, దక్షిణాఫ్రికాల లోనూ లీ లు వున్నారు. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది, పోలీసులు, గార్డులు ఇంకా ఎంతో మంది జాత్యహంకారానికి వ్యతిరేకంగానే గాక సాయినాథ్ చెప్పిన వర్గతత్వం పైనా ఎలుగెత్తుతున్నారు. మూడు దేశాల లోనూ నిరసన తెలిపే వారు... గాంధీ, మండేలా, కింగ్ త్రయానికి తోడు లీ, ఫ్లాయిడ్, జమలో లను కూడా కలిపి మాట్లాడుతున్నారు. మనం వాళ్లతో గొంతు కలుపుదాం.

*(గాంధీ, మండేలా, కింగ్‌ల స్మారక సంస్థలు నిర్వహించిన ఆన్‌లైన్ సంస్మరణ ప్రసంగం సంక్షిప్త రూపం. ప్రజాశక్తి 16.06.2020)*

◆

విశ్లేషణ




# నీవు లేవు నీ పాట వుంది!

**డా॥ కాళిదాసు పురుషోత్తం**
9000642079

*'లైట్ ఫ్రమ్ ఎ డిస్టెంట్ స్టార్' నవలలో అయా పాత్రల స్మృతులు గతం, వర్తమానం మధ్య పరిభ్రమించడం వల్ల కథనం ఒక సరళ రేఖలాగా సాగదు. రచయిత కథన శిల్పం ద్వారా పాఠకుల ఉత్కంఠను చివరి పుట వరకు పట్టి వుంచుతారు. 1941లో ప్రపంచ యుద్ధంతో ఆరంభమై 1957లో రష్యా స్పూట్నిక్‌ను ప్రయోగించడం వరకు పదహారు సంవత్సరాల్లో రష్యన్ సమాజంలో వచ్చిన మార్పులను నవల ప్రతిభావంతంగా చూపుతుంది.*

అనంతకాలంలో ఎప్పుడో కాలి బూడిదైన ఒక నక్షత్రకాంతి, ఆ తర్వాత ఎన్నో కాంతి సంవత్సరాల పాటు భూమి మీద మనకు కనిపిస్తూనే వుంటుందట! 1970 ప్రాంతంలో చదివిన రష్యన్ నవల 'లైట్ ఫ్రమ్ ఎ డిస్టెంట్ స్టార్' అప్పుడప్పుడూ గుర్తుకొస్తూనే వుంటోంది. ఇటీవల ఒక యువశాస్త్రవేత్త ఈ నవలను చదవమని పంపించాడు. ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ నవల చదివాక నాలుగు మాటలు రాయాలనిపించింది.

రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో జవ్యలోవ్, ఓల్గా ప్రణయగాథ సాగుతుంది. యుద్ధకాలంలో సోవియట్ సమాజంలో ఏర్పడ్డ కల్లోలం, ప్రాణనష్టం, కుటుంబాలు విచ్ఛిన్నమై, మనుషుల పారవిడి తెలియక ఎడబాటు, పార్టీలో వ్యక్తిపూజ పరాకాష్టకు చేరి, కెరీరిస్టుల ఆగడాలతో దేశభక్తులు, వృత్తికి జీవితాన్ని, అంకితం చేసిన శాస్త్రవేత్తలు, సైన్యాధికారులు, ఇబ్బందులు పడడం వంటి ఎన్నో అంశాలు ఈ నవలలో ప్రస్తావనకు వస్తాయి.

నవలలో రచయిత వినూత్న కథన శిల్పాన్ని ప్రవేశపెట్టారు. సర్వసాక్షి దృక్పథం నుంచి నవలేతి వృత్తాన్ని వర్ణించినా, తరచు పాత్రల జ్ఞాపకాల నుంచి ముఖ్య సంఘటనలన్నింటినీ ఆవిష్కరిస్తారు. పాత్రల జ్ఞాపకాలను, స్మృతులను ఒక క్రమంలో వివరించారు. కొన్నిసార్లు జానపద కథనరీతులలో, ఒక తెలిసిన పాత్ర ద్వారా మరో పాత్ర పరిచయమవుతూ వుంటుంది. నవలలో కథ సన్నివేశాలు, 'రిగా' ఓడరేవులో, వోల్గా నగరం ఓడరేవులో, మాస్కో, లెనిన్‌గ్రాడ్ నగరాల్లో, యుద్ధ రంగాల్లో, అవిభక్త సోవియట్ యూనియన్ ఉత్తర భాగంలోని – సైబీరియాకు సంబంధించిన టైగిన్స్క్ అనే చిన్న టౌన్ వరకు విస్తరిస్తాయి.

రష్యాలో విప్లవ విజయం తర్వాత, అశేష త్యాగాలతో ప్రజలు విప్లవాన్ని కాపాడుకొంటారు. ప్రపంచ యుద్ధం, హిట్లర్ సోవియట్ రష్యా మీద దురాక్రమణ వగైరా సంఘటనలన్నీ స్థూలంగా నవలలో ప్రస్తావనకు వస్తాయి. స్టాలిన్ చివరి రోజుల్లో వ్యక్తిపూజ, ఆరాధన మితిమీరి, కెరీరిస్టుల ప్రాధాన్యం అన్ని రంగాలకు విస్తరిస్తుంది. 1941 నుంచి 1956 వరకు సోవియట్ యూనియన్ సమాజం నవల నేపథ్యంలో దర్శనమిస్తుంది.

ఓల్గా అలెక్సియవన మీరా, వ్లాడిమిర్‌జవ్యలోవ్ నవలలో ప్రధాన పాత్రలు. నాయికా నిష్టమైన నవల యిది. ఓల్గా మహోన్నత వ్యక్తిత్వం, దేశభక్తి నవలలో ఇతర పాత్రల కథనాల ద్వారా వ్యక్తమవుతుంది. అది యుగసంధి. స్టాలిన్ మరణం తర్వాత, పార్టీ ఉదారవాద విధానాన్ని ఆమోదిస్తుంది. వ్యక్తిపూజ కాలంలో సామాన్య ప్రజల నుంచి శాస్త్రవేత్తల వరకు అనేకరకాలుగా వేధింపులకు గురవుతారు. ఆ విషయాలన్నీ సందర్భాన్ని బట్టి సూచనగా పాఠకులకు అందుతూ ఉంటాయి. 1953 తర్వాత, సోవియట్ ప్రజలు కొంతవరకు భయం

లేకుండా తమ అభిప్రాయాలు ప్రకటించే స్వేచ్ఛ పొందినట్లు నవల సూచిస్తుంది.

19 సంవత్సరాల యువకుడు వ్లాడిమిర్ జవ్యలోవ్ యుద్ధం రావడంతో సోవియట్ విమానదళంలో పైలట్‌గా నమోదవుతాడు. కథానాయిక ఓల్గా 17 సంవత్సరాల యువతి. 1941 అక్టోబరు నెల. జర్మనీ రష్యా మీద దురాక్రమణకు పాల్పడ్డది. ప్రజలు మాస్కో నగరం నుండి సుదూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఓల్గా తన పిన్నివాళ్ల ఊరు అస్త్రహన్ వెళ్లడానికి వోల్గా రేవు పట్టణంలో ఓడకోసం నిరీక్షిస్తూ యాదృచ్ఛికంగా ఓడకోసం వేచివున్న జవ్యలోవ్‌ను కలుసుకుంటుంది. ఇద్దరూ ఓడ రాకకోసం ఎదురు చూస్తూ రెండు రోజులు కలిసి గడుపుతారు. టికెట్ కౌంటరు వద్ద జనం గుంపులు గుంపులుగా తోసుకుంటూ వుంటారు. జవ్యలోవ్ గాయపడ్డ సైనికులకోసం ఏర్పాటైన ప్రత్యేక కౌంటరులో ఓల్గాకూ, తనకూ టికెట్ సంపాదిస్తాడు. ఓల్గాకు తల్లిదండ్రులు లేరు. ఆ వసంతంలోనే ఆమె హైస్కూలు పూర్తిచేసింది. రాబోయే శిశిరంలో వైద్య కళాశాలలో చేరాలని, అప్పటి వరకు అస్త్రహన్‌లో పిన్ని వద్ద గడపాలని ఆమె నిశ్చయించుకొంది.

"ఇప్పుడేం జరుగుతుంది?" ఓల్గా భయంభయంగా అంటుంది. "ఇదంతా తాత్కాలికమే" జవ్యలోవ్ ఆమెకు ధైర్యం చెబుతాడు. ఇద్దరూ నౌకకోసం ఎదురుచూస్తూ ఓడరేవులోనే గడుపుతారు. ఆ రెండురోజుల్లోనే ఒకరిని ఒకరు విడిచిపెట్టలేని స్థితికి వస్తారు. ఆ ఆత్మీయతను ప్రేమ అంటారని కూడా వాళ్లెరగరు. రేవులో ఓడ లంగరు వేయగానే జనం గుంపులు గుంపులుగా తోసుకుంటూ తొక్కుకుంటూ ముందుకు సాగుతారు. ఓల్గా, జవ్యలోవ్ ఒకరి చేయి ఒకరు గట్టిగా పట్టుకొని గుంపుల మధ్య ముందుకు సాగుతారు. జనసముద్రం కెరటంలా లేచి వారిపైన పడడంతో ఏర్పడిన గందరగోళంలో జవ్యలోవ్ ఒక్కడే ఓడలోకి ప్రవేశించగలుగుతాడు. ఓల్గా ఎటో తప్పిపోతుంది.

రెండేళ్ల తర్వాత, యుద్ధరంగంలో, ఒక విమానాశ్రయంలో యాదృచ్ఛికంగా జవ్యలోవ్, ఓల్గా కలుసుకొంటారు. ఆ రేయి ఇద్దరూ విమానాశ్రయం అంచున, రెల్లుపొదల మధ్య తారలు వారిని చూసి సిగ్గుపడుతుంటే ఒకటవుతారు.

తెల్లవారి ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోతున్నపుడు 'మళ్లీ నిన్నెట్లా కలుసుకోడం' జవ్యలోవ్ అడుగుతాడు.

'నువ్వనుకొంటే కలుసుకోగలవు' ఓల్గా అంటుంది.

ఇద్దరిమధ్యా ప్రేమలేఖలు సాగుతాయి. కొంతకాలం తర్వాత ఓల్గా నుండి కబురేమీ ఉండదు. ఓల్గా గన్నర్‌గా పనిచేస్తున్న యుద్ధవిమానం కూలి, ఆమె మరణించినట్లు జవ్యలోవ్‌కు తెలుస్తుంది. వాస్తవంలో ఓల్గా యుద్ధరంగంలో క్షతగాత్రురాలై ఆరునెలలు మిలటరీ ఆస్పత్రిలో వుండి కోలుకుంటుంది.

దాదాపు పన్నెండేళ్ల తర్వాత, యాదృచ్ఛికంగా ఓల్గా ఫొటోను ఒక పత్రికలో చూస్తాడు జవ్యలోవ్. ఆమె ఎక్కడున్నదీ తెలుసుకోవడానికి అతను సుదీర్ఘ అన్వేషణ ప్రారంభిస్తాడు. ఆమె సమాచారం కోసం ఎందర్నో కలుస్తాడు. ఆమెతో పనిచేసిన శాస్త్రవేత్తలు, ఆమెకు పరిచయమైన సైనికాధికారి అసోకిన్ వగైరా వగైరా. జవ్యలోవ్‌కు తెలియని, అతనెరుగని ఓల్గా దేశభక్తి, వృత్తిపట్ల నిబద్ధత మరెన్నెన్నో ఉత్తమగుణాలు అతనికి తెలుస్తాయి. పదిహేడేళ్ల ముగ్ధ రసాయనశాస్త్రవేత్తగా పరిణతి చెందిన క్రమాన్ని జవ్యలోవ్ వెంటబడి మరీ తెలుసుకుంటాడు.

ఓల్గా నౌకాశ్రయంలో విడిపోయాక, రెండేళ్ల తర్వాత, యుద్ధరంగంలో సైనిక విధులు నిర్వహిస్తూ యాదృచ్ఛికంగా జవ్యలోవ్‌ను కలుసుకొన్నప్పుడు "జీవితంలో ఎన్నడూ వెల్లువలో కొట్టుకుపోయే పూచికపుల్లలాగా, వుండకూడదని ప్రతిజ్ఞ పూనాను" అంటుంది. ఆ కఠోర నిర్ణయంతోనే ఆమె జీవితాన్ని కొనసాగిస్తుంది. జవ్యలోవ్ యుద్ధరంగంలో మరణించాడన్న వార్త పత్రికలో చదివిన తర్వాతే, ఓల్గా అసోకిన్ అనే సైనిక అధికారికి దగ్గరవుతుంది. ఆయన కుటుంబం జర్మనుల చేతుల్లో చిక్కి నశించకుండా క్షేమంగా ఉందన్న వార్త విన్న మరుక్షణమే ఆమె అసోకిన్‌తో అనుబంధాన్ని తెంచేసుకుంటుంది శాశ్వతంగా.

నవలలో అయా పాత్రల స్మృతులు గతం, వర్తమానం మధ్య పరిభ్రమించడం వల్ల కథనం ఒక సరళ రేఖలాగా సాగదు. రచయిత కథన శిల్పం ద్వారా పాఠకుల ఉత్కంఠను చివరి పుట వరకు పట్టి వుంచుతారు. 1941లో ప్రపంచ యుద్ధంతో ఆరంభమై 1957లో రష్యా స్పూత్నిక్‌ను ప్రయోగించడం వరకు పద్నాల్గు సంవత్సరాల్లో రష్యన్ సమాజంలో వచ్చిన మార్పులను నవల ప్రతిభావంతంగా చూపుతుంది. ఈ నవలలో పాత్రలు వుద్యోగులు, సైనికాధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, అందరూ

మంచిమనుషులుగానే చిత్రించబడ్డారు. జవ్యలోవ్ అన్వేషణలో ప్రతివొక్కరూ సహకరిస్తారు.

జవ్యలోవ్ విమానం జర్మన్‌ల ఆక్రమణలోని రష్యన్ భూభాగంలో కూలిపోతుంది. అతను శత్రువులకు చిక్కకుండా ఎలాగో తప్పించుకొని తన యూనిట్‌ను కలుసుకుంటాడు. తను శత్రువు గూఢచారిగా మారి వుంటాడనే భావంతో అతన్ని నిర్బంధంగా రిటైర్ చేస్తారు. పైలట్ తన విమానానికి దూరం కావటం అంటే పక్షికి రెక్కలు కత్తిరించడమే. చేయని తప్పుకు శిక్షించబడ్డా, జవ్యలోవ్ తన స్థితికి సమాధానపడతాడే గాని వ్యవస్థ మీద కక్షపూనడు. ఓల్గా ప్రయోగశాలలో పరీక్షించి ఆమోదించిన ఇంధనం వాడి విమానాన్ని పరీక్షించినపుడు అది కూలిపోతుంది. ఇనుపతెర నిర్బంధకాలంలో శాస్త్రవేత్తల మీద నేరారోపణ చేసి శిక్షిస్తారు. ఓల్గా అన్ని వత్తిళ్లు తట్టుకొని శాస్త్రవేత్తల వైపు ధైర్యంగా నిలబడుతుంది. 1953లో ఉదారవాద విధానాలు అమలయ్యాక, మరొక విచారణలో, విమానం సాంకేతిక లోపం వల్ల కూలినట్లు తేలి శాస్త్రజ్ఞులు విముక్తులవుతారు.

1953 తర్వాత స్వేచ్ఛా వాతావరణంలో కొందరు యువకుల్లో అవకాశాలు అందిపుచ్చుకొని అడ్డదారుల్లో పైకిరావాలనే దుర్బుద్ధులు పుట్టుకొస్తాయి. జవ్యలోవ్ బంధువు విక్టర్ ఈ బాపతు యువకుడు. అతని భావ ఔన్నత్యాన్ని ఇష్టపడి ప్రేమించి దగ్గరైన యువతి బాధ్యతను తీసుకోకుండా తప్పించుకొన్న విక్టర్‌ని చూసి జవ్యలోవ్ అసహ్యించుకొంటాడు. జ్యాగింత్సేవ్ యువశాస్త్రవేత్త ఎలాగైనా తన పని పూర్తిచేసుకోవాలనే వ్యక్తి, ఓల్గా నిర్భయంగా ఇటువంటి ఆషాఢభూతుల్ని ఎండగడుతుంది.

జవ్యలోవ్ అన్వేషణ సఫలమై తను త్వరలోనే ఓల్గాను కలుసుకోగలడని పాఠకులు భావించే తరుణంలో, రెండు నెలల క్రితమే ఓల్గా, ఆమె బృందం ప్రయోగశాలలో తాము కనుగొన్న ఒక నూతన ఇంధనాన్ని పరీక్షిస్తున్నపుడు జరిగిన విస్ఫోటనంలో – ప్రమాదంలో అమరులైనారన్న వార్త తెలుస్తుంది. ఇటువంటి వార్తలు కూడా ఆ రోజుల్లో సోవియట్ పరిస్థితులను బట్టి బయటి ప్రపంచానికి తెలిసేవి కావంటే ఆశ్చర్యపడవలసినదేమీ లేదు.

విచ్ఛిన్నమైన ఒక నక్షత్రకాంతి ఎన్నో కాంతి సంవత్సరాల వరకు భూమిని తాకుతున్నట్లే, ఓల్గా, ఆమరులైన ఇతర శాస్త్రజ్ఞులు ఆవిష్కరించిన నూతన ఇంధనం నింపిన రాకెట్లతోనే రష్యా ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపగలిగిందని విని జవ్యలోవ్ సమాధానపడతాడు. ఓల్గా త్యాగం వృధాకాలేదనే సంతృప్తి తనకు మిగిల్తుంది.

### ఎ.బి. చెహోవ్

ఈ నవలా రచయిత ఎ.బి. చెహోవ్ (1913 – 1994) సుప్రసిద్ధ సోవియట్ సాహిత్యవేత్త. విప్లవకాలంలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. బాల్యం, కౌమారం 'సమారా'లో గడిచాయి. పదిహేడేళ్ల వయసులో మాస్కో వచ్చి, ఏవేవో పనులు చేస్తూ రాత్రి లా పాఠశాలలో చదివారు. 1938లో ఈయన గోర్కి లిటరరీ ఇన్‌స్టిస్యూట్ నుంచి డిగ్రీ పొందారు. మాస్కో ఇన్‌స్టిస్యూట్ ఆఫ్ ఫిలాసఫీ అండ్ లిటరేచర్‌లో విద్య కొనసాగిస్తూ, సాహిత్య జర్నల్ 'అక్టోబర్'లో పనిచేశారు. తొలి యవ్వనంలోనే సాహిత్య విమర్శకులుగా పేరు తెచ్చుకొన్నారు. చెహోవ్ జీవితకాలంలో ముఖ్యమైన సాహిత్యోద్యమాలన్నిట్లో పాల్గొన్నారు. ఆయనకు 1941లోనే రైటర్స్ యూనియన్‌లో సభ్యత్వం ఇచ్చారు. ప్రపంచ యుద్ధకాలంలో రెడ్ ఆర్మీలో యుద్ధ విలేకరిగా పనిచేశారు.

1955 నుంచి, 63 వరకు జర్నల్ ఆఫ్ ఫారిన్ లిటరేచర్ ప్రధాన సంపాదకులుగా, 1962 నుంచి 1988 వరకు లిటరరీ న్యూస్ పేపర్ సంపాదకులుగా ఉన్నారు.

సోకరోవ్, స్టాలినిస్టియన్‌ల విషయంలో సోవియట్ ప్రభుత్వానికి పంపిన విజ్ఞప్తిలో సంతకం చేసిన ప్రముఖుల్లో చెహోవ్ ఒకరు. వీరు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ సెంట్రల్ కమిటి సభ్యులుగా, యు.యస్.యస్.ఆర్ సుప్రీం కౌన్సిల్ సభ్యులుగా కూడా వ్యవహరించారు.

చెహోవ్, రూపకం, నవల, కథ, యాత్రా చరిత్ర వంటి అన్ని ప్రక్రియల్లో పేరు తెచ్చుకున్నారు. కొన్ని సినిమాలకు స్క్రిప్టులు రాశారు. వీరు స్వీయ నవల విక్టరీకి సినిమా స్క్రిప్టు రాశారు. దీనికి రష్యా జాతీయ పురస్కారం లభించింది. వీరి నవలలు బ్రైట్, బ్లాకేడ్, విక్టరి సినిమాలుగా తీశారు. ప్రసిద్ధ రష్యన్ ఫిల్మ్ దర్శకుడు ఇవాన్ పిర్వేమేల్ లైట్ ఫ్రమ్ ఎ డిస్టెంట్ స్టార్ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇది గొప్ప కళాత్మక చిత్రం.

**(రష్యాలో చాలాకాలం నివసించినా మా నెల్లూరు డాక్టర్ పులుగండ్ల చెంద్రశేఖర్ వ్యాసం రాయడంలో సహకరించారు.)**

◆

కవిత

# క్షమించు తల్లీ!

కరోనా కవిత

ఆది ఆంధ్ర తిప్పేస్వామి
7780263877

చెమ్మగిల్లిన కళ్ళతో..
నీ పాదాల చెంత మోకరిల్లాలని వుంది!
నీ అడుగులకు ఓసారి సాగిలబడాలని ఉంది!

నీదంటూ
ఒకరోజుందని...గుర్తుచేసుకుని..
నిన్ననే ఆకాశంలో సంబరాలు చేసుకున్నాం!
నీకు సాటిలేరంటూ గొప్పలు పోయాం!
గుండెలో పెట్టుకుని గుడికడతామంటూ
కవితల్లి ఊరువాడ వూరేగాం!

క్షమించు తల్లీ!

నిచ్చెనేసి
ఆకాశంలో నిలబెట్టాలని నువ్వెన్నడు అడగలేదు
సొంతూరికి చేర్చమని కాళ్లా వేళ్లా పడుతున్నావు..!
రోజూ పరమాన్నంతో కడుపునింపమని కోరలేదు
ఆకలితో చచ్చిపోయే ప్రాణాలకింత
గంజి పోయమంటున్నావు అంతే!

కోట్ల ప్యాకేజీలు.. ఉద్దీపన ఫలాలు
ఏ అద్దాలమేడల్లో వేలాడుతున్నాయో
వండి వార్చిన ఉచిత భోజన సదుపాయాలు
మీ కడుపు నింపలేదని తెలుసు

రోడ్డు మీద నిలబడ్డ మైలురాళ్ళన్నీ
ఇంటికి వెళ్లావో లేదో అని ఆరాతీస్తున్నాయి
నెత్తినమూటా ..సంకన బిడ్డతో...
ఏ పిల్లబాటగుండ పోతున్నావో అని
చెట్టు ఇందాకనే చెప్పి ఏడ్చింది

నిన్ను దాటించడానికి
నా దేశం ఇప్పుడు రైలు పట్టాలపై
కాళ్లు తెగిపడి అవిటిదయింది
రెక్కలు తెంపుకుని నెత్తురు గాయాలతో
పక్షిలా ఒంటరిగా విలపిస్తూవుంది

దారమ్మటా
నెత్తుటి సంతకాలు చేసుకుంటూ వెళ్లే నీకు
చలువ పందిళ్లు పరిచి పూల వానలు కురిపించలేను
చిమ్మ చీకటిని చీల్చుకుంటూ మైళ్ల దూరానికి
రెక్కలు తొడిగిన నీకు దారి దీపాన్ని కాలేకపోతున్నా!

క్షమించు తల్లీ!


బొబ్బలెక్కిన కాళ్లకు
ఏ చెట్టు బెరడో మలాం రాయలేను
దాహంతో పిడచకట్టుకు పోయిన నోటికి
ఏ పసరో అందించలేను

అద్దాల మేడల్లో నిల్చుని
కరతాళ ధ్వనులతో స్వాగతించలేను
చీకటి నిండిన నీ బతుకులో
వెలుగు హారతులివ్వలేను

ఏ కాలంలో..
ఏ దేవుడో...

అడవుల్లో దిగబెట్టినట్లు
ఈ రోజు ..
నిన్నిలా...
నిర్దయగా ...
నడివీధిలో నిలబెట్టినందుకు
క్షమించు తల్లీ!

విశ్లేషణ




ఉదయమిత్ర

# ప్రజా స్వామ్యం ముసుగు తీసి చూపిన కథలు


- వల్లభాపురం జనార్దన
9440263687


"దోసెడు పల్లీలు" ఉదయమిత్ర రాసిన కథా సంపుటి. ఇందులో ఉదయమిత్ర (చెప్పిన) రాసిన కథలు ఉబుసుపోక చెప్పిన గాలి కబుర్ల కతలు కావు. ప్రజల జీవన సమరంలోని ఘట్టాలు. జీవిత సత్యాలు. నడుస్తున్న - సాగిస్తున్న ఆధిపత్య దుర్మార్గానికి - పక్ష పాతానికి సాక్ష్యాలు. జీవితం ఇంత విషాదాన్ని మోస్తున్నదా? అని సామాన్య పాఠకులు ఆశ్చర్య పడే వాస్తవిక సామాజిక దృశ్యాలు. ఈ కథలు చదివే పాఠకుణ్ణి సమాజాన్ని లోచూపు చూసే పనిలోకి పరిశోధకుడిగా దింపుతాయనడం సత్యం. అలాగే జీవితాన్ని పట్టించుకోకుండా ఆషా మాషీగా తీసుకునే మనుషులకు జీవితంలో ఉండే వైరుధ్యాలను-కఠిన వాస్తవాలను- పరోక్షంగా-ప్రత్యక్షంగా అందుకు దారితీసే కారణాలను మనసులలోకి ఎక్కిస్తయి. ఉదయ మిత్ర కథల్లో సమాజంలో జారిపోతున్న-మాడిపోతున్న-కమిలిపోతున్న-కుమిలిపోతున్న-వాడిపోతున్న-వడలిపోతున్న-సురిగిపోతున్న-రాలిపోతున్న బతుకులు కనిపిస్తయి. ఈ కథలు చదువుతుంటే జీవితం కొందరికే రంగుల సినిమా అని- అది అందరికీ కాదనే సత్యాన్ని కుండబద్దలుకొట్టి చూపిస్తయి.

ఈ కథల్లో పాలమూరు బతుకులు కనిపిస్తున్నా అవి దేశం మొత్తానికి నమూనాలే అనే వాస్తవం పాఠకుల మనసులలోకి చేరుతుంది. ఈ సంపుటిలో పేదలు-శ్రమజీవులు- అభాగ్యులు-అనాధలు-అన్నార్తుల-మధ్యతరగతి జీవుల బతుకు వెతలే కథావస్తువులుగా కనిపిస్తయి. దోసెడు పల్లీలు కథా సంపుటిలోని కథలు కేవలం కథలు కావు. ఆధిపత్యం కాట్లతో-అసమానతల అగ్గితో బుగ్గి అవుతున్న వెతల చితుకుల బతుకుల దృశ్యాలు.

ఈ కథా సంపుటి లోని కతలన్నింటినీ సమీక్షిస్తే అది మరో పెద్ద గ్రంథం అవుతుంది. అది సాధ్యం కాని పని. మచ్చుకు కొన్ని కథలను పరిచయం చేస్తాను. "ఈ పండుగ నీ పేరు మీద" కథ చూడండి. అది గ్రామాల్లో మంచినీటి సరఫరా తీరు తెన్నులను-జనం నీటికోసం పడే ఇబ్బందులను కళ్ళకు కట్టిస్తది.

ఈ కథలో రచయితే పాత్రధారి. పండుగ రోజు ఇంట్లో చెంబెడు నీళ్లు కూడాలేవని-పండుగ ఎలా చేసుకోవాలని-నీళ్లు సంపాదించుకొస్తేనే పండుగ అన్న శ్రీమతి ఫర్మానాతో సైకిలు కావడికి బిందెలు కట్టుకొని నీళ్ల వేటకు బయలుదేరుతాడు రచయిత. తనోళ్లు-మనోళ్లు అనుకున్నోళ్లను నీళ్లు ఇవ్వమని అడుగుతున్నా ఎవ్వరూ స్పందించకుంటే ఏం చేస్తే నీళ్లు దొరుకుతయో అని ఆలోచించుకుంటూ పోతుంటే మామూలు పరిచయం ఉన్న ఒక ముస్లిం అతని అవస్థను గమనించి అవసరమైనన్ని నీళ్లు తీసుకుపొమ్మని ఇంటికి పిలుచుకపోయి నీళ్లిస్తడు. తన మన అనుకున్నోళ్లు-తన మతం అనుకున్నోళ్లు ఎవ్వరూ అవసరానికి ఆదుకోరు. పరాయి మతం మనిషి ఆదుకుంటడు. ఈ సంఘటన ద్వారా రచయిత సాయానికి తన-మన-పరాయి- తనమతం-పరాయి మతం అనికాదు చూడాల్సింది. ఎవరిలో సాయపడే గుణముందో చూడాలి, సాయానికి చూడాల్సింది మతాన్ని కాదు మనిషితనాన్ని అన్న సందేశంతోబాటు బంగారు తెలంగాణలో మిషన్ భగీరథ వచ్చి మంచినీళ్ల కరువు తీర్చిందనే అధికార ఛానల్ వార్తలోని నిజాన్ని చూపించిన కతయిది.

" జాగ" కథ తీసుకోండి. ఈ కథలో పల్లెటూరి ఆసామీ తనపళ్లు అమ్ముకోడానికి పట్నంవచ్చి పడ్డ తిప్పలు చెప్తుంది.

ఆ ఆసామి పళ్ళు పెట్టుకునే జాగ కోసం పడ్డ తిప్పలు అన్నీఇన్నీకావు. జాగ కోసం సాయిబుతో ఒప్పందం చేసుకుంటడు. అది కుదరదు. జాగా కోసం వెదుకులాటలో ఆటోవాడికి-తోపుడు బండివాడికి-పోలీసుకు-రైల్వే గేటు కీపర్

కు-మునిసిపాలిటీ నౌకరుకు నజరానాగా పండ్లు యిచ్చి వట్టిచేతులతో మిగిలిపోతడు. ఈ దృశ్యాన్ని కథకుడు రోడ్డు ఒక అనాథ పగలు చూస్తే పచ్చిపుండు-రాత్రి చూస్తే రాక్షస రతికి గురైన వేశ్యలా ఉంది అన్న మాటలతో ప్రపంచీకరణ ప్రవేశంతో రంగు మార్చుకున్న మార్కెట్ తీరును-అవినీతిని కళ్ళకు కట్టిస్తడు రచయిత. అలాగే పళ్ళు అమ్ముకోడానికోచ్చిన ఆసామీ పరిస్థితిని పోతున్న పడవలో నిస్సహాయుడుగా రోదిస్తున్న మనిషితో పోల్చి నగరీకరణలోని అమానవీయ దృశ్యాన్ని అక్షరాల్లో చూపించిండు రచయిత.

''దోసెడు పల్లీలు'' కథలో గొల్లరాజు-మశన్న ముఖ్యపాత్రలు. ఆకలితో నకనకలాడి పోతున్న మశన్న పల్లీల కుప్పచూసి ఆ కుప్పలోంచి దోసెడు పల్లీలు తీసుకొని తింటడు. ఆ నేరానికి గొల్లరాజు మశన్నను కట్టేసి గొడ్డును బాదినట్లు చావు దెబ్బలు కొడ్తడు. ఈ సంఘటన ద్వారా ఇప్పుడు ప్రజాస్వామ్యం ముసుగులో భూస్వామ్య దాష్టీకమే రాజ్యం చేస్తున్న విషయాన్ని మన దృష్టికి తీసుకొస్తడు రచయిత. అంతే కాదు కృష్ణా నది స్వగతం పేరుతో లక్షలాది మందికి జీవిక నిచ్చిన తాను ఒడ్డున ఉన్న చెంచు బిడ్డలకు ఇన్ని మంచినీళ్లయినా ఇవ్వకపోతినే అన్న మాటలతో తెలంగాణలో జరుగుతున్న సహజ వనరుల దోపిడీని మనకు గుర్తు చేస్తున్నడు రచయిత.

"నిప్పుల కొలిమి" ప్రపంచీకరణ దుష్ఫలితాలను ఎత్తి చూపినకథ. ప్రపంచీకరణలో భాగంగా సెజ్‌ల ఏర్పాటుతో ఆధిపత్యం ప్రజల బతుకుకు భరోసాను గాలికి వదిలేసి అభివృద్ధి పేరుతో ఏర్పాటు చేసిన సెజ్‌లు పాలమూరులోని పోలేపల్లిని పోలికలేని పల్లెగా మార్చిన తీరును కథనం చేసిండు రచయిత. సెజ్ దురాక్రమణలో జగదీశ్ పొలం పోయింది. రోడ్డున వడ్డడు. బతుకు తెరువు గాలికి ఊగిసలాడుతున్న దీపమై పోయింది. జగదీష్ కుటుంబం పట్నం మెరుపుల వరదల్లో కొట్టుకుపోయింది. జగదీశ్ మందుల ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డయిండు. బతుకుకు సెక్యూరిటీ లేకుండా పోయింది. కార్మికుల హక్కులపోరాటంలో గొంతుకలుపడడంతో ఉన్న ఉపాధి ఊడిపోయింది. ప్రపంచీకరణ పేర జరిగే అభివృద్ధి" "ఆకాశంబుననుండి శంభుని శిరంబందుండి " అనే భర్తృహరి పద్యంలా జగదీష్ బతుకు అగాధంలో పడింది. సమస్యలకు కార్మిక సమ్మెనే పరిష్కారమని సందేశమిస్తడు రచయిత ఈ కథలో.

"స్వేచ్ఛ ఎంత చిన్నదైనా" కథ స్వేచ్ఛయొక్క అవసరాన్ని-మనిషి వ్యక్తిత్వాన్ని నిలబెట్టేదే స్వేచ్ఛ అనే సందేశం ఇస్తడు ఈ కథలో. మనిషి అంగారక గ్రహాన్ని చూసొస్తున్నా పురుషుడి బుద్ధి సంకుచితంగానే ఉందని-పురుషుడు స్త్రీని సామాజికంగా-"కుటుంబ పరంగా బానిసగా చిన్న చూపు చూడటమే సాగుతుందన్న సత్యాన్నీ చాటిందీ కథ. మొగుడనే పురుషుడు భార్య అనే స్త్రీని బానిసగానే చూస్తున్నడు. ఈ కథలో అలాంటి మొగుడున్న ఒక స్త్రీ మొగుడు వెంటవచ్చే వీలులేక ఒక శుభకార్యానికి ఒక్కదాన్నే పంపిస్తడు. తను ఒక్కతే పోతున్నందుకు సంబర పడుతుంది ఆమె. వచ్చేటపుడు బస్ దిగినంక ఫోన్ చెయ్యి నేను వచ్చి తీసుకొస్తానని చెప్తడు కానీ ఆమె ఈ చిన్న అవకాశాన్ని తన స్వేచ్ఛకోసం వాడుకుంటది. బస్సు దిగిన సంగతి భర్తకు ఫోన్ చేయకుండా బస్సుదిగి ఒక్కతే ఇంటికి వెళ్తుంది కథలో. ఎవరి ఆజమాయిషీ లేకుండా సొంతంగా యింటికి వెళ్లడం ఆమె దృష్టిలో స్వేచ్ఛను అనుభవించడమే. స్వేచ్ఛగా పని చేసినానని మురిసిపోతుంది. ఈ సన్నివేశం ద్వారా రచయిత స్వేచ్ఛ అన్నది చిన్నదా-పెద్దదా అనికాదు. దాని విలువ అది ఇచ్చే ఆత్మ విశ్వాసాన్ని బట్టి ఉంటుందనే సత్యాన్ని చెప్పిండీ కథలో.


ఈ సంపుటిలోని మరో కథ శిఖరం. ఈ సంపుటిలోని కథలకు భిన్నమైన కథ. వికలాంగుడిని కేంద్రంగా చేసుకుని చెప్పిన కథ. ఆత్మ విశ్వాసం లేని సకలాంగుడి కంటే ఆత్మ విశ్వాసం ఉన్న వికలాంగుడు గొప్ప అనే సందేశం ఇస్తుంది ఈ కథ. సాధారణంగా వికలాంగుడు తానేమీ చేయలేనని-ఏదీ సాధించలేనని ఆత్మ న్యూనతతో ఉంటడు వికలాంగుడు. వికలాంగుడు తనలోని ఆత్మ న్యూనతను వదిలించుకొని ఆత్మ విశ్వాసంతో ముందడుగులు వేస్తే సకలాంగునికంటే ఎత్తుకు ఎదిగి శిఖరమై ని లబడతాడనే ప్రయోగాత్మక సందేశం ఇచ్చిన కథ శిఖరం. ఇందులో కథానాయకుడు వికలాంగుడు. అంధుడు. అయినా కుంగిపోకుండా ఒక ధ్యేయాన్ని సృష్టించుకొని ఆత్మ విశ్వాసంతో అడుగులు వేసి విద్యాధికుడై ఆఫ్రికాలో ఉన్నతన్యాయస్థానంలో జడ్జిగా ప్రస్తానం సాగించిన మనిషి. నిజంగనే అతడు శిఖరమే కదా. తనలో లోపం ఉందని ఏడుస్తూ కూర్చోకుండా ఆత్మ విశ్వాసంతో-పట్టుదలతో పనిచేస్తే ఎక్కలేని మెట్టు ఉండదనే సత్యాన్ని ఢంకా బజాయించి చాటిన మనిషి మన కళ్ల ముందే ఉన్నడన్న సత్యాన్ని చాటిన కథ శిఖరం.

అందుకే ఉదయ మిత్రగారి దోసెడు పల్లీలు కథా సంపుటి అందరూ చదవాల్సిన పుస్తకం. మంచి కతలు అందించిన ఉదయమిత్ర గారికి అభినందనలు. ♦

విశ్లేషణ

# హృదయభాష విచ్చుకోవాలి

ఎమ్వీ రామిరెడ్డి
9866777870




*కవి ఎక్కడా భాషాపటాటోపం ప్రదర్శించడు. సంక్లిష్ట పదబంధాలతో ఉక్కిరిబిక్కిరి చెయ్యడు. సాదాసీదా పదాలతోనే సాహితీయాత్రను కొనసాగిస్తాడు. తను రాసేది తేలిగ్గా పాఠకుడి మనసులోకి ప్రవహించాలని ఆశ. ఇట్టే అర్థం కావాలని ఆరాటం.*

పల్నాటి చరిత్ర!

ఇవాళ్టికీ ఆసక్తిని రేకెత్తించే అద్భుత ఘటనల సమాహారం. తొలి మహామంత్రి(ణి) నాయకురాలు నాగమ్మ చుట్టూ తిరిగిన యుద్ధతంత్రం. ఆ ప్రామాణిక చరిత్రలోని ద్వితీయ కోణాన్ని రెండు భాగాలుగా వెలికితీసిన అదే ప్రాంత పరిశోధకుడు వై. హెచ్. కె. మోహన్‌రావు. అంతకంటే ముందు ఆయన కవి.

పల్నాటి సీమ పరిస్థితులకు అద్దం పడుతూ 2008లో మొట్టమొదటగా ప్రచురించిన కవితాసంపుటి "కరువు కురిసిన మేఘం" తర్వాత మళ్లీ ఇన్నాళ్లకైనా విచ్చుకోవాలన్న తలంపుతో "విచ్చుకోవాలి" పేరిట ద్వితీయసంపుటి వెలువరించారు.

ప్రాథమికంగా మనిషికి తాను తిరుగాడే నేల, కలుసుకునే మనుషులు, చదువుకునే పుస్తకాలు, నేర్చుకునే అలవాట్లు, అందుబాటులో ఉండే వనరులు నేస్తాలుగా మారతాయి. ఆ మనిషిలో కవిత్వం తాలూకు బీజాలు ఉంటే, ఆ నేస్తాలు అక్షరవృక్షాలుగా ఎదుగుతాయి. ఈ నేపథ్యంలోంచే మోహన్‌రావు కవిగా ప్రాణం పోసుకున్నారు.

ఒకప్పుడు అసలైన సహజవనరు... వ్యవసాయం. దుక్కి దున్ని, నయిదిబ్బ పొలానికి తోలి, నిరుటి పైరులోంచే తీసిన విత్తనం వేసి, అరక తిప్పితే... ఆదే పండేది. పెట్టుబడి గురించి దిగులుండేది కాదు. కానీ సహజాతాలను తొక్కిపెడుతూ పడమటి గాలులు బలంగా వీచాయి. సంప్రదాయ సాగును సంపూర్ణంగా మాయం చేస్తూ, 'పేరొందిన' కంపెనీలు పెత్తందార్లుగా గట్టు మీద మకాం వేశాయి. మొత్తంగా సాగుసూత్రాలను తమ కనుసన్నల్లోకి తెచ్చుకోవటంలో పశ్చిమదేశాలు విజయం సాధించాయి. విత్తనాలు, పురుగుమందులు, ఇతరత్రా వ్యావసాయిక లేపనాలన్నీ వాళ్ల గుప్పిట్లోనే. అవే కొనాలి. అవే వాడాలి. ఫలితం... అప్పులు పెరిగాయి. దిగుబళ్లు తగ్గాయి. దిగుళ్లు పెరిగాయి. ఈ పరిస్థితులపై "పశ్చిమ పవనం" కవితలో కవి ఆగ్రహం వ్యక్తం చేస్తారు.

***"పశ్చిమ పవనమేదో***
***ప్రేతమై ప్రవేశించి, సాగును***
***వాస్తవం లాంటి కలలోకి జార్చింది***
***గారడీ 'మోర్‌గ్రో'తో***
***మట్టిబలాన్ని కొల్లగొట్టి***
***డొల్లతనాన్ని నాటి***
***మూడుపువ్వుల సాగును మసిబార్చింది"*** అంటారు. 'అది రసాయనమా లేక విషాయనమా' అంటూ చిత్రమైన ప్రశ్నతో మన మనసుల్ని బలంగా దున్నుతారు.

***"మొలకెత్తడమంటే/ మొగ్గలా మారడం కాదు***
***పువ్వులా వికసించాలి"*** అంటారు "మొలకెత్తాలి" కవితలో. అది పశ్చిమ మోసం కావచ్చు, పక్కనోడి మోసం కావచ్చు... ఆ మసిని చెరిపేసుకుంటూ చేతనమై, కేతనమై మొలకెత్తుతూనే ఉండాలంటారు.

కవికి పచ్చదనమంటే ఇష్టం. చెట్లంటే ఇష్టం. నదులంటే ఇష్టం. ప్రకృతి ప్రసాదాల పవిత్రతను కవిత్వంతో కళ్లకద్దుకుంటారు. ఆయనకు *"చెట్టును గుర్తు చేసుకున్న ప్రతిసారీ/ నది దర్శనమిస్తుంది/ తాజ్‌మహల్ జ్ఞప్తికి వస్తుంది/ కళ్లముందు అమ్మవొడి కదలాడుతుంది"*.

"హరితఛత్రం" కవితలో చెట్టును *"ప్రకృతి నిర్మిత మహా విడిది"* గా వర్ణిస్తారు. మరికొన్ని అడుగులు ముందుకేసి

*"అదృశ్యమైన అమ్మలంతా కలిసి*

*సృష్టించుకున్నదే చెట్టు"* అంటూ ఈ కవితను చెట్టంత ఎత్తుకు తీసుకెళతారు.

*"మా పల్లెమట్టికి దాపరికం తెలియదు"* అంటూ "హరిత పథం" రహస్యం విప్పుతారు.

*"నాగలి పట్టిన నవ నాయకుడే"* నిజమైన "నవ్య వైతాళికుడు" అని కీర్తిస్తారు.

అమ్మంటే కవికి ప్రాణం. అమ్మతనమంటే మహా గౌరవం. "అమ్మకు పర్యాయపదం" రాస్తూ...

*"అమ్మను అనువదిస్తే మట్టే అవుతుంది*

*అవనిలో కూడా అమ్మతనమే పరిమళిస్తుంది"* అంటూ పరవశిస్తారు.

మట్టిని నేలతల్లి అని ఎందుకంటారు?

*"అమ్మలాగే జన్మనిస్తుంది*

*జన్మ చాలిస్తే ఒడికి చేర్చుకుంటుంది"* అంటూ సరికొత్త నిర్వచనం చెబుతారు.

బిడ్డకు జన్మనివ్వటానికి తల్లిగర్భం కల్లోల సుడిగుండం అవుతుంది.

*"ఎన్ని వాంతులకు వేదికయ్యింది*

*ఎన్ని వికారాలకు భూమికయ్యింది*

*నరకయాతనను సైతం లక్ష్యపెట్టని సహన శిఖరం*

*---*

*మరణం తలుపు తట్టినా*

*మరో జననానికి పురుడు పోస్తుం"* దనీ (ఒడి ఊయలై...) సేదదీరుస్తుందనీ భరోసా ఇస్తారు.

కాస్తంత చైతన్యంతో తొణికిసలాడే బాలికల్ని సైతం అమ్మల్లా దర్శించుకుంటాడు కవి. అది సిండ్రిల్లా కావచ్చు, మలాలా కావచ్చు. వాళ్లందరినీ ''రేపటి అమ్మ''ల్లా ఊహించుకుంటారు.

కవి దృష్టిలో అమ్మంటే *"రెండక్షరాల్లో ఇమిడిన ప్రేమసాగరం/ భాషకూ భావానికీ అందని నిర్వచనం" (ముగింపులేని కావ్యం).*

*"కరుణకు సాకారం చూపమంటే*

*నా చూపుడు వేలెపుడూ*

*అమ్మవైపే తిరుగుతుంది"* అంటూ అష్టదిక్కులూ ఆమెకు ఆవృతాలుగా భావిస్తారు. అలాంటి అమ్మల్ని ఆశ్రమాల ఆదాయవనరుల్లా మార్చవద్దని హెచ్చరిస్తాడు. అక్కున చేర్చుకుని ప్రతి ఇంటా అమ్మధ్వజం ప్రతిష్ఠాపన చేయాలంటాడు.

మరోవంక, మానవజాతికి మార్గదర్శకులైన మహనీయుల్ని కవితాస్వరంతో స్మరించుకుంటారు.

*"దేహాన్ని మోయడమే కాదు*

*దానికి దేశాన్ని మోయడం కూడా తెలుసు"* నంటూ గాంధీ చేతికర్రను జాతికి ఊతకర్రగా అభివర్ణిస్తారు "చూపుడువేలు" కవితలో.

*"ఆ బక్కపలుచని రూపం గుర్తుకొస్తే చాలు*

*ఒక్కసారిగా జాతి యావత్తూ*

*స్వేచ్ఛా విహంగమై విహరిస్తుంది"* (క్రాంతిదాత).

దేశం యావత్తూ మహాత్ముడి 150వ జయంతి జరుపుకొంటున్న వేళ... పై వాక్యాల ద్వారా ఆయన్ని స్మరించుకోవటం కవి క్రాంత దార్శనికతకు నిదర్శనం.

స్వేచ్ఛను కోరుతూ కారాగారాన్ని ముద్దాడిన మయన్మార్ వేగుచుక్క ఆంగ్‌సాన్ సూకీపైనా మంచి కవిత రాశారు మోహన్‌రావు.

*"నిశ్శబ్దం కూడా శబ్ద చిహ్నమే" అంటూ మొదటి వాక్యంతోనే అగ్గి రాజేస్తారు.*

*"ఇల్లే కారాగారమైతే*

*ప్రతి వంటిల్లూ తిరుగుబాటు కేంద్రమే*

*నిశ్శబ్దం తుపానుగా మారడం*

*సాధారణ సముద్రభాషే" (స్వేచ్ఛాదిక్ సూకీ)*

'ధిక్కారానికి దిక్కులు చూపించిన' సూకీది కూడా 'మహాత్ముని అడుగుజాడే'నంటారు.

"గగనతార" కవితలో *"వర్ణసంకెళ్లు తెంచి/ 'గణాల'ను ఆకాశమార్గాల నుండి/ స్మశాన వాటికవైపు నడిపిన"* జాషువానూ కవనగళంతో కీర్తిస్తారు. ఈ కవితలో జాషువాను "సెహబాషువా" అంటూ చిత్రమైన ప్రయోగం చేశారు.

*"విస్ఫోటనం చెందిన అణువై*

*దేశరక్షణ పొదిలో శస్త్రమై"* మెరిసిన అబ్దుల్ కలామ్‌కు

# వాంగ్మూలం

- సుద్దాల. వినోద్ కుమార్
9908312949

కరోనా కవిత

*మీ గోడలు, మేడలు కట్టి*
*మా పొట్ట నింపుకుందమని*
*కట్టుబట్టలతోటి ఈడికొస్తే*
*గత్తర రోగమొచ్చి గండికొట్టె...*

*పనుల్లేక, పస్తులుండలేక*
*అయినోళ్లను ఇడిసి ఉండలేక*
*ఎవనూరు వానికని అనుకొని*
*ఊపిరి బిగబట్టి ఊరుకు కదిలినం...*

*యాడ నుంచి వొచ్చిందో ఏమో*
*ఎవ్వరినీ ఒదిలేది లేదని*
*వేటాడినట్లు వేటాడి తొక్కుకుంట*
*పైగా ఏమీ ఎరుగనట్లు*
*తొవ్వ పట్టుకొని ఎల్లిపోయిందే...*

*కష్టం చేసే కాళ్ళు చేతులు*
*విరిసి విసిరేసినట్లు పడ్డంక*
*కన్న పేగుల ఎదురు చూపులకు*
*ఉన్న ఊరి జ్ఞాపకాల పిలుపులకు*
*ఏమని చెప్పను...ఏమని చెప్పను*

*రొట్టెలపై పడిన రగుతపు మరకలు*
*పట్టాల మీద ఆగమైన మా బతుకులు*
*సమాధైన పేదరికపు రుజువులతో*
*ఔరంగాబాద్ నేడు అలరారుతోంది..*

*ఐనా మీ మేడ దిగి మీరు రారు*
*మా తునకలు మీరిప్పుడు సూడలేరు*
*పట్టింపులేని బతుకులు మావి*
*మమ్ములను పట్టించుకునే నాథులేరే*
*ఎవరికీ ఏమీ కానీ, ఏమి లేని నిర్భాగ్యులం...*
*భారతమాతకు భారమైన వలసజీవులం...*

◆

---

'జాతికేతనం' కవితలో సలామ్ చేస్తారు.

***"మూడక్షరాల ముత్తెపు మెరుపై***
***తెలుగు కవితా మంత్రమైన"*** సినారెకు "కవన మేఘం" కవితలో నివాళులర్పిస్తారు.

కవికి నాయకురాలు నాగమ్మంటే అమితమైన ప్రేమ. స్త్రీకి సొంత గొంతే లేని మధ్యయుగంలోనే ఆమె ధైర్యపవనమై వీచింది. ఆ చరిత్రను వెలికితీస్తూ నాయకురాలిపై కవి జరిపిన పరిశోధన కవిత్వంలోనూ ప్రతిఫలించింది.

***"కత్తి పట్టక మునుపే నన్ను***
***కత్తుల వంతెనపై నడిపారు***
***వంటింటి కుందేలు కానందుకే***
***ఇంటింటి శత్రువని ముద్ర వేశారు"*** (అగ్నిపునీత). ఈ వాక్యాలు చాలు మహిళా సాధికారతకు స్థలకాలాల పరిధుల్లేవని అర్థం చేసుకోటానికి.

విభిన్న అంశాలపై తనదైన శైలిలో కవితాయాత్ర సాగించారు.

***"నిన్నటి వరకూ కొండచరియపై నుండి***
***దూకే సెలయేరైన కాలం***
***నేడు అడ్డువేసిన పిల్లకాలువలా మూలుగుతుంది" (శిశిర వసంతం).***

***"ఇప్పుడంతా ఎలక్ట్రానిక్ భాషతో***
***మనుషుల మధ్య బంధాలన్నీ***
***ఇంటర్నెట్ సంబంధాలుగా మారిపోయాయి" (ముడివెయ్యాలి).***

కవి ఎక్కడా భాషాపటాటోపం ప్రదర్శించడు. సంక్లిష్ట పదబంధాలతో ఉక్కిరిబిక్కిరి చెయ్యడు. సాదాసీదా పదాలతోనే సాహితీయాత్రను కొనసాగిస్తాడు. తను రాసేది తేలిగ్గా పాఠకుడి మనసులోకి ప్రవహించాలని ఆశ. ఇట్టే అర్థం కావాలని ఆరాటం. ఆయన మాటల్లోనే చెప్పాలంటే...

***"అర్థం కావడమంటే***
***వింటున్న వాడి తల ఊయలై ఊగాలి***
***కరతాళాలు ఆకాశం అంచులు తాకాలి" (నిజంగానే...).***

వైహెచ్కె మోహన్‌రావు మరిన్ని మధురమైన కవితాస్త్రాలతో మరింత విశాలంగా విచ్చుకోవాలని నా అభిలాష.

◆

# విధ్వంస దృశ్యం



రాచపూటి రమేష్
9866727042

"ఈ రోజు అరటిపళ్ళు వద్దులే బాబు" రాధమ్మ ఇంటింటికి గంపలో అరటి పళ్ళు పెట్టుకొని తెచ్చి అమ్ముకొనే అబ్బాయికి చెప్పింది.

"అందరూ అరటిపళ్ళు వద్దంటే మా పరిస్థితి ఏమిటమ్మా" అని బాధతో వాపోయాడా అబ్బాయి. నారాయణకు ఆ అబ్బాయి పరిస్థితికి జాలి వేసింది.

పట్టణంలో కరోనా స్వైర విహారం చేస్తోంది. ఆ మహమ్మారి ధాటికి దేశమే అల్లాడుతూ వుంది. మనిషిని మనిషే నమ్మని విచిత్ర పరిస్థితి. ఎవరి నుండి, ఏ మూల నుండి వ్యాధి కమ్ముకుంటుందో తెలియని పరిస్థితి. ఎవరినీ తరువాత నిందించేందుకు లేదు.

"నేను డ్యూటీకి వెళ్తున్నా, సాయంత్రం మా స్టేషన్లోనే పడుకుంటాను లే. ఇంటికి రాను" పోలీస్ కానిస్టేబుల్ నారాయణ యూనిఫాం వేసుకుంటూ చెప్పాడు, భార్యతో.

"ఎందుకంటే, ఇంటి బయటే రెండు బకెట్లతో వేడినీళ్ళ పెట్టి వుంటాను. మీరు వచ్చి, స్నానం చేసి, బయట దండెంపై ఆరవేసి వున్న బనీను, లుంగీ కట్టుకుని ఇంట్లోకి వచ్చి, భోంచేసి పడుకోండి" భర్తతో చెప్పింది రాధమ్మ, అనునయంగా.

కరోనా కాలం! ఎడతెరపి లేని డ్యూటీలు. ఎప్పుడు మొదలైతాయో, ఎప్పుడు పూర్తవుతాయో తెలియదు. ట్రాఫిక్ ఉన్నప్పుడే డ్యూటీలు చేయడం సులభం. ఇప్పుడు ఇంకా కష్టం. కర్ఫ్యూ కాలంలో నిబంధనలు ఉల్లంఘించి బలాదూరుగా తిరిగే వారి పట్ల తమకు పై అధికారులతో తిట్లతోపాటూ, చివరికి ఈ వ్యాధి ఎవరి వల్ల సోకుతుందో అన్న భయం" అనుకున్నాడు నారాయణ.

రాయణ మాస్క్ వేసుకొని, గ్లౌస్ ధరించి, తన బైక్‌లో స్టేషన్‌కు బయలుదేరాడు. పోలీస్ స్టేషన్లో మిగిలిన కానిస్టేబుల్స్ అటెండెన్స్ రిజిస్టర్లో సైన్ చేసి డ్యూటీలకు బయలు దేరుతున్నారు. నారాయణ కూడా రైటర్ ఇచ్చిన చిన్న శానిటైజర్ సీసా శాంపుల్ డెట్టాల్ సోపు తీసుకుని తాను డ్యూటీ చేసే ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ మరో కానిస్టేబుల్ మజీబ్, నారాయణను చూసి పలకరింపుగా నవ్వాడు. నైట్ డ్యూటీ చేసిన అతనిని నారాయణ రిలీవ్ చేస్తున్నాడు.

నారాయణ ట్రాఫిక్ కూడలిలో నిలబడి కార్లు, బైకులలో వచ్చే వారిని ఆపి, వారు ఏ పని మీద వెళ్తున్నారని తెలుసుకుంటున్నాడు. అత్యవసరమైన పనుల మీద వెళ్ళేవారినీ, హాస్పిటల్స్‌కు వెళ్తున్నామని చెప్పి వెళ్ళే వారిని పంపుతూ వున్నాడు. క్వారంటైన్ కాలంలో ఇంటిలో వుండలేక బైక్ మీద షికారుగా రోడ్లపైకి వచ్చే కుర్రకారుకు కౌన్సిలింగ్ చేసి వెనక్కు పంపుతున్నాడు, బాధ్యతగా.

పూలబుట్ట పట్టుకొని చిన్నగా నడిచి వస్తున్న మంగమ్మ నారాయణను చూసి పలకరింపుగా నవ్వింది. మామూలుగా నారాయణ రోజూ వుదయం శ్రీరాముడి గుడికి వెళ్ళి, దేవుడికి దండం పెట్టుకొని వెళ్లేవాడు. కరోనా కాలంలో ఎక్కువ సేపు

డ్యూటీలు వుండడంతో వెళ్లలేకుండా వున్నాడు.

"ఏం మంగమ్మా, బంధ్ కాలంలో కూడా పూలు అమ్ముతున్నావా?" ఆమెను పలకరించాడు నారాయణ.

నోటికున్న మాస్క్ తీసి, ఆమె "ఔను బాబూ, ఒక అరగంట గుడి తెరుస్తున్నారు. ఐనా ఎవ్వరూ పూలు కొనడం లేదు. ఈ కరోనా వచ్చి మా పొట్టకొట్టింది" అని వాపోయింది, దిగులుగా.

నారాయణ బాధతో నిట్టూర్చాడు. "ఈ మహమ్మారి వలన ఎందరు చిరువ్యాపారులు, చిరుద్యోగులు, ఆటోల వాళ్ళు, రైతులు ఎలా విలవిలలాడుతున్నారో"అనుకున్నాడు. ఇంతలో మరొక కానిస్టేబుల్ శాంతయ్య వచ్చి అతడిని పలకరించి, నారాయణకు సహాయంగా డ్యూటీ చేయసాగాడు.

రోడ్డుపై వస్తున్న ఎరుపు రంగు శాంట్రో కారును ఇట్టే గుర్తుపట్టాడు నారాయణ. అది తమ వీధిలోనే నివసించే బసవయ్యది. బసవయ్యకు బజారులో పెద్ద బంగారు నగల కొట్టు వుంది. అతని కొడుకులిద్దరూ విదేశాల్లో వుద్యోగం చేస్తూ వున్నారు. కూతురు ఢిల్లీలో వుంది. ఇటీవలే బసవయ్య భార్య పోవడంతో సాంబయ్య అనే వంట వాడిని ఏర్పాటు చేసుకున్నాడు బసవయ్య. సాంబయ్య ఉదయాన్నే వచ్చి ఇంటిపనీ, వంటపనీ చేసి పదార్థాలన్నీ డైనింగ్ టేబుల్‌పై నీటుగా సర్ది వెళ్ళిపోతూ వుంటాడు. స్వతహాగా భోజన ప్రియుడైన బసవయ్య భోంచేశాక మిగిలిన పదార్థాలు ఫ్రిజ్‌లో వుంచి, రాత్రికి తింటూ వుంటాడు. సాంబయ్యకు అరకొరా జీతం ఇస్తూ వుంటాడు.

బసవయ్య కారును ఆపి, నారాయణ "ఏం బసవయ్య గారూ కర్ఫ్యూ టైంలో ఎక్కడకు బయలుదేరారు?" అని అడిగాడు, విండోలోంచి.

"ఓ నారాయణా నువ్వా, నేను హాస్పిటల్‌కు వెళు _న్నానయ్యా, నన్ను పంపించవచ్చు" అన్నాడు బసవయ్య.

"అదేమిటి సార్? ఎందుకు ఆసుపత్రికి?" అనుమానంగా అడిగాడు నారాయణ.

బసవయ్య తటపటాయించి, " ఏమీ లేదయ్యా, నిన్నటి నుండీ ఒకటే జలుబు, తుమ్ములూ, జ్వరం కూడా వస్తోంది. బాడీ అంతా నిస్సత్తువగా వుంటూ వుంది. ఇప్పుడు టీవీలో, వాట్సపులలో కరోనా మీద ఇంత ప్రచారం కదా ఎందుకైనా మంచిది, టెస్ట్ చేసుకుందామని వెళ్తున్నా" అన్నాడు.

"మంచిది సార్, ఐతే మీరు ఇలా కార్లో వెళ్ళకూడదు. అంబులెన్స్‌కు ఫోన్ చేయండి, వాళ్లు వచ్చి తీసుకెళ్తారు" అన్నాడు నారాయణ.

"మా పనివాడు అదే సాంబయ్య వెధవ ఎక్కడెక్కడ తిరిగి వస్తున్నాడో ఏమో, వాడే ఈ మాయదారి రోగాన్ని నాకు అంటించి వుంటాడని నాకు అనుమానం, సరేలే ఇంటికెళ్ళి పోయి, అంబులెన్స్‌కు ఫోన్ చేస్తాను" అని కారు రివర్స్ చేశాడు బసవయ్య.

మధ్యాహ్నం ఒంటిగంట ఔతోంది. పట్టణంలో కర్ఫ్యూ వున్నా, జనాల రద్దీ తగ్గడం లేదు. ప్రతి ఒక్కరూ తమకేదో అర్జంటు పని వుందని చెప్పేవారే, అప్పటికీ చాలామందికి సర్ది చెప్పి, నారాయణ, శాంతయ్యలు తిప్పి పంపేశారు. ప్రజలు కర్ఫ్యూ సమయంలో బయటకు రాకూడదని మైక్‌లో చెప్తూ వున్నా, జనాలు వస్తూనే వున్నారు. అంత కొంప మునిగే పనులు ఏమి వుంటాయో అర్థం కావడం లేదు నారాయణకు. అతనికి రెండు గంటలకొక సారి టీ తాగడం అలవాటు. బంద్ కారణంగా దుకాణాలన్నీ మూత పడడంతో టీ తాగడానికి అవకాశం లేకుండా వుంది. శాంతయ్యను భోజనం చేసి రమ్మన్నాడు నారాయణ. శాంతయ్య తనతో తెచ్చుకున్న టిఫిన్ బాక్సు, నీళ్ల బాటిల్ తీసుకొని, మూతపడ్డ ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లోకి వెళ్లి భోజనం చేసి వచ్చాడు. తరువాత నారాయణ కూడా అదే విధంగా చేశాడు.

బంద్ కారణంగా దుకాణాలు, ఆఫీసులూ మూతపడ్డా 'ఎమర్జన్సీ సర్వీసులైన' 'పోలీస్, ఆరోగ్యశాఖ, విద్యుత్, నీటి సరఫరా శాఖలూ, రోడ్లు శుభ్రం చేసే వారూ, డాక్టర్లూ, నర్సులూ.. ఇలాంటి వారికి తమ పనులు యధావిధిగా చేసుకోక తప్పడం లేదు. పైగా నారయణ లాంటి వారికి ఎండలో నిలబడి చేయాల్సిన డ్యూటీ.

రెండు రోజుల నుండీ నారాయణ పై అధికారులను ఒక రోజు శెలవు ఇవ్వమని అడుగుతూ వున్నాడు. అతని

మనవడు శరవణకు కంటి పక్కన కురుపు లాంటిది ఏర్పడింది. కడపలో డాక్టర్లకు చూపిస్తే, తిరుపతికి వెళ్ళి అరవింద హాస్పిటల్లో చూపించమన్నారు. అక్కడికి తీసుకువెళ్ళాలంటే ఒక రోజు శలవు పెట్టక తప్పదు. నారాయణ కొడుకు వినోద్ పంజాబ్ రెజిమెంట్లో పనిచేస్తూ వున్నాడు. అందుకే మనవడి బరువు బాధ్యతలు నారాయణపై వున్నాయి.

వినోద్ భార్య కౌసల్య ఇంటి వద్ద వుండి అత్తకు పనిలో సహాయం చేస్తూ వుంటుంది. ఆమె పెద్దగా చదువుకోలేదు. బయట వూళ్ళకు వెళ్ళి రాగల సామర్థ్యం లేదు.

వైరస్ సాకు చూపి నారాయణకు లీవు ఇవ్వడం నిరాకరిస్తూ వున్నాడు సి.ఐ. లోకనాథం. బాధ్యతలు ఎక్కువ స్టాపు తక్కువ. వీక్లీ ఆఫ్ కూడా ఇవ్వలేము అంటున్నాడు. ఎవ్వరినీ నిందించే పరిస్థితి కాదు. ప్రపంచమే అల్లకల్లోలంగా వుంది.

"ఈ లాకౌట్ ముగిసిన వెంటనే ఒక రోజు లీవు తీసుకొని శరవణను తీసుకొని తిరుపతికి వెళ్లి రావాలి" అనుకున్నాడు నారాయణ.

నాలుగు గంటల కల్లా ఎండ వేడిమికి, అధిక శ్రమకూ, తలనొప్పి మొదలైంది నారాయణకు. టీ తాగక పోవడంతో నెప్పి ఇంకా ఎక్కువైంది. ఆ సెంటర్ దగ్గర్లోనే టీ సెంటర్ నడుపుతున్న నాయర్ వున్నాడు. నాయర్ కొట్లో రోజూ రెండు సార్లు టీ తాగుతూ వుంటాడు నారాయణ. బంధన వల్ల నాయర్ తన అంగడి మైసివేసినా, పక్కనే వున్న ఇంట్లో వుంటాడు. నాయర్ ఇంట్లో వున్నాడేమో చూసి వస్తానని నారాయణ శాంతయ్యను ట్రాఫిక్ సంగతి చూసుకోమని చెప్పి వెళ్ళాడు.

నాయర్ వరండాలోనే వున్నాడు. నారాయణను చూసి "రండి సార్, రండి, మీకీ టైంకు టీ తాగడం అలవాటు కదా, అసలు నేనే సెంటర్‌కు మీకు ఫ్లాస్కులో టీ తీసుకొని వద్దామనుకున్నాను" అని నారాయణ కూర్చోవడానికి కుర్చీ వేశాడు.

"ఎండకు తలనొప్పిగా వుంది నాయర్. నీ టీ రోజూ ఈ వేళకి తాగే అలవాటు కదా" అని నాయర్‌తో అన్నాడు నారాయణ.

"రెండు నిమిషాల్లో టీ చేసుకొని వస్తాను" అన్నాడు నాయర్. నాయర్ కొడుకు బాటిల్లో తీసుకువచ్చిన చల్లటి నీరు తాగి, కాసేపు కళ్లు మూసుకొని రిలాక్స్ అయ్యాడు నారాయణ. ఈలోపు నాయర్ కప్పులో వేడి టీ తీసుకువచ్చాడు. అది తాగేంతలో ఇంట్లో వెతికి నాయర్ తలనొప్పి మాత్ర తీసుకు వచ్చాడు. నారాయణ మాత్ర వేసుకొని, నాయర్‌కు థ్యాంక్స్ చెప్పి ఇంటి బయటకు నడిచాడు.

"మీరు వెళ్లి శాంతయ్య సార్‌ను పంపండి సార్" అన్నాడు నాయర్. "అలాగే" అని నారాయణ సెంటర్ వద్దకు వెళ్లేసరికి కార్లో అక్కడ చేరుకున్న సి.ఐ., నారాయణ మీద చిందులు తొక్కుతున్నాడు.

"డ్యూటీ వదిలి ఎక్కడ పెత్తనాలు చేస్తున్నావయ్యా, రేపటి నుండీ నువ్విక్కడ డ్యూటీ చేయొద్దు. ఇందిరా కాలేజీలో 'క్వారంటైన్ సెంటర్' వుంది. అక్కడ డ్యూటీ వేస్తేనే నీకు బాధ్యత తెలుస్తుంది" అని నారాయణ చెప్పేది వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

"నేను టీ తాగడానికి వెళ్లాడని చెప్తూనే వున్నాను" అన్నాడు శాంతయ్య బాధపడుతూ. ' ఫర్వాలేదులే బాబూ" అని నారాయణ నిర్వికారంగా డ్యూటీ చేయడం ప్రారంభించాడు.

రాత్రి ఎనిమిది గంటలకు తనను రిలీవ్ చేయడానికి ఇంకో కానిస్టేబుల్ రావడంతో నారాయ డ్యూటీ దిగి, తన బైక్‌లో ఇల్లు చేరుకున్నాడు. నారాయణ భార్య ఇంటి బయట వున్న ఖాళీ స్థలంలో రెండు బకెట్లలో నీళ్లు, డెట్టాల్ బాటిలూ, సర్ఫ్ పాకెట్టు పెట్టి వుంది. నారాయణ తన బట్టలు సర్ఫ్ నీళ్లలో వుతికి, దండెంపై ఆరవేసి, స్నానం చేసి, దండెంపై వున్న లుంగీ, బనీను వేసుకొని, ఇంటి వరండాలో వేసిన చాపపై పడుకొని నిద్రపోయాడు. కానీ దోమల బాధతో సరిగ్గా నిద్రపోలేకపోయాడు.

మరుసటి రోజు వుదయం తొమ్మిదింటికల్లా నారాయణ ఇందిరా కాలేజీలో నడిపే క్వారంటైన్ సెంటర్‌కు చేరుకొన్నాడు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారింపబడ్డ ఇరవైమంది ఆ సెంటర్లో వున్నారు. కాలేజీ గేట్ వద్ద నారాయణ మరొక కానిస్టేబుల్‌తో బాటూ వుండి డాక్టర్లను, వైద్య సిబ్బందినీ వారి గుర్తింపు కార్డులు పరిశీలించి సెంటర్‌లోనికి పంపసాగారు.

## కవిత

# నేర్చుకున్న పాఠం

- వంజరి రోహిణి
9000594630

కరోనా కవిత

మరక మంచిదే అని
ప్రకటనలు చూసాం...
విపత్తు మంచిదని మాత్రం
నేను చెప్పను కానీ
అది మనిషి అస్తిత్వాన్ని
ప్రశ్నార్థకం చేస్తునే మనిషి
మనుగడ కోసం సంస్కారాన్ని
నేర్పుతోంది...
అర్ధరాత్రి దాటాక కానీ ఇంటికి
రాని సాఫ్ట్వేర్ భర్త ఇపుడు
తన ఎదురుగానే కూర్చుని
ఒద్దికగా వర్క్ ఫ్రం హోం
చేసుకుంటున్నాడు...
మందులోకి కోడికూర మంచింగ్
లేదని కట్టుకున్న దాన్ని చావగొట్టే
తాగుబోతు భర్త మజ్జిగనే మందనుకొని
పప్పుచారుతో బుద్ధిగా తింటున్నాడు...
సెలవలొచ్చినా కోచింగులంటూ
హాస్టల్లో అల్లాడే పిల్లలిపుడు
ఇంటి పట్టున పాటలో పద్యమో
నాట్యమో, చిత్రలేఖనమో
ఏదో ఓ కళకు సృజనాత్మక
హంగులద్దుతున్నారు...
వయసుడిగిన దంపతులు
ఒకరికొకరు సాయం చేసుకుంటూ
అసలు సిసలైన మిథునాన్ని
దర్శించుకుంటున్నారు...
మరో పక్క మరో కోణంలో
ధన్వంతరి వారసులు
దైవసమాన వైద్యులు
క్వారంటయిన్నే తమ నివాసంలా
కరోనా బాధితులే తమ కుటుంబ
సభ్యులనుకుంటూ వైద్యాన్ని
అందిస్తున్నారు..
మరో పక్క ఎర్రటి ఎండని లెక్క
చేయక నడిరోడ్లమీదే తమ
అన్న పానీయాలను కానిస్తూ
రోడ్డున తిరిగే తమ్ముళ్ళను అదుపు
చేయడానికి
కరోనా వ్యాప్తిని అరికట్టడానికి
కంకణం కట్టుకున్న
రక్షకభట అన్నలు
కరోనా విషపు క్రిమి విజృంభిస్తే
ఎవరికీ నష్టం...
దేశాలకి దేశాలే ఇప్పుడు
శవాల గుట్టలు అవుతున్నాయి
ఆ శవాల గుట్టలలోకి మనం
చేరుకోక ముందే మేలుకుందాం
అందరి మేలు కోరుకుందాం
ఇంటి పట్టునే ఉందాం
కరోనాని మనమంతా కలిసి
కట్టుగా తరిమి కొడదాం
కరోనా నేర్పిన సంస్కార పాఠాలను
ప్రతి రోజూ పునః శ్చరణ
చేసుకుంటూనే ఉందాం....

---

కాసేపటికి అంబులెన్స్ వచ్చేసరికి నారాయణ గేటు తెరిచాడు. అంబులెన్స్‌లోంచి బసవయ్య దిగేసరికి ఆశ్చర్యపోయి నారాయణ ఆయన వద్దకు వెళ్ళి పలకరించాడు.

"నా అనుమానం నిజమేనయ్యా, ఆ సాంబయ్య గాడు నాకు కరోనా తగిలించాడు. మూడు వారాల క్రితమే నాకు ఈ జబ్బు సోకిందని గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టరు చెప్పాడు" అని బాధపడుతూ చెప్పి, అటెండర్లతో బాటు బసవయ్య సెంటర్లోకి వెళ్లిపోయాడు.

బసవయ్య దుస్థితికి కాసేపు బాధపడినా, నారాయణ "మన చేతుల్లో ఏమీ లేదు లే" అనుకొని సమాధానపడ్డాడు. కాసేపటికి మరో అంబులెన్స్ వచ్చి ఆగింది. అందులోంచి వైద్య సిబ్బందితో పాటు దిగిన సాంబయ్యను చూసి మళ్లీ ఆశ్చర్యపోయాడు నారాయణ.

సాంబయ్య నారాయణను చూసి పలకరింపుగా నవ్వాడు.

"రెండు రోజుల్నుండీ జలుబూ, దగ్గుగా వుంటే ఉదయం ఆసుపత్రికి వెళ్ళాను సార్, రెండు వారాల ముందే నాకు కరోనా సోకిందని చెప్పారు పెద్ద డాక్టరు" అన్నాడు సాంబయ్య.

"బాధపడొద్దులే సాంబయ్యా. ట్రీట్‌మెంట్ తీసుకుంటే రెండు, మూడు వారాల్లో నయమైపోతుందిలే" అన్నాడు నారాయణ.

సాంబయ్య ద్వారా బసవయ్యకు జబ్బు సోకలేదని, యజమాని బసవయ్య ద్వారానే పనివాడు సంబయ్యకు కరోనా సోకిందనీ అర్థమైంది నారాయణకు.

"ఏదీ మన చేతుల్లో లేదు" అనుకొని నిర్వికారంగా డ్యూటీ చేయసాగాడు నారాయణ.

నివేదిక

# సాహిత్యం - సామాజిక చైతన్యం

## అంతర్జాల సదస్సు



- యడవల్లి శ్రీనివాసరావు
9490099214

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 2020, మే 28, 29 తేదీల్లో తెలుగు సాహిత్యం-సామాజిక చైతన్యం అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబ్‌నార్) ఆద్యంతం ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వివిధ యూనివర్శిటీలకు చెందదిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, కళాకారులు పెద్దఎత్తున ఇందులో పాల్గొన్నారు. మారుతున్న ప్రపంచం... పెరుగుతున్న సామాజిక విజ్ఞానం, ప్రకృత్తి, పర్యావరణం, వివిధ భాషలు అంతరించిపోతున్న వైనం ఇలా అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి.

ఆదికవి నన్నయ యూనివర్శిటీ తెలుగుశాఖ ఇప్పటివరకు 24 జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, జానపద విజ్ఞాన దినోత్సవాలు, మాతృభాషా దినోత్సవాలు వంటివి నిర్వహించింది. వీటితోపాటు శతకవి సమ్మేళనం, శత మహిళా కవిసమ్మేళనం, మహిళా అష్టావధానం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషా పరిరక్షణకు నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ విశేషంగా కృషిచేస్తోంది. కాలానికి అనుగుణంగా తాజాగా అంతర్జాల సదస్సును నిర్వహించింది. ఈ సదస్సు ఎంతో ఉపయుక్తంగా ఉందని పలువురు తెలుగు అధ్యాపకులు, పరిశోధకులు, సాహితీమిత్రులు తమ సందేశాలలో వెల్లడించారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు, తెలుగు విభాగ అధిపతి డాక్టర్ తరపట్ల సత్యనారాయణలకు అభినందనలు తెలియజేశారు. ఈ విద్యాసంవత్సరంలో నన్నయ విశ్వ విద్యాలయం తెలుగుశాఖ అంతర్జాతీయ స్థాయిలో భాషా-సంస్కృతులపై విదేశీ విద్యాలయ ఆచార్యులతో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నామని తరపట్ల సత్యనారాయణ తెలిపారు. త్వరలోనే ఈ సదస్సుకు సంబంధించిన 'సాహిత్యం-సామాజిక చైతన్యం'పై ప్రముఖుల వ్యాసాలతో ఉత్తమ వ్యాస సంకలనాన్ని తీసుకొస్తామని వివరించారు. శాస్త్ర, సాంకేతిక విద్య, వికాసంతోపాటుగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక భాషా వికాసానికి విశేషమైన ప్రోత్సాహాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అందిస్తున్నారు. రాబోయేకాలంలో జానపద విజ్ఞానం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు వారసత్వంగా ప్రతిబింబించే విధంగా కల్చరల్ మ్యూజియం స్థాపనకు కూడా కృషిచేస్తున్నారు. నన్నయ విశ్వ విద్యాలయం తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక, జానపద విజ్ఞాన పరిరక్షణకు కృషిచేస్తున్న సదస్సు కన్వీనర్ ఆచార్య డాక్టర్ తరపట్ల సత్యనారాయణ కృషి మరువలేనిది.

### వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం-పరిణామ క్రమంపై విశ్లేషణలు

వెయ్యేళ్ల తెలుగు చరిత్రలో ఎందరో ప్రముఖులు సాహిత్య రంగానికి ఎనలేని సేవలు చేశారు. నాటికీ, నేటికీ ఇంకా ఎందరో చేస్తున్నారు. ప్రస్తుతం నేటితరంలో అలాంటి వారు ఎందరో ఉన్నారు. ఆధునిక, ప్రాచీన సాహిత్యంపై సంపూర్ణ అవగాహన ఉన్న వారూ ఉన్నారు. సంఘ జీవనంలో మనిషి చుట్టూ సమాజంలో జరుగుతున్న పరిణామాలు, ప్రపంచంలో జరిగే విషయాలు, అభివృద్ధి, సాంకేతిక అంశాలు...ఇలా నిత్యం

జీవితంలో జరిగే పలు అంశాలకు సంబంధించిన అంశాలపైన వచన కవితలు చెప్పారు. భారత దేశం సంస్కృతీ, సంప్రదాయాలు, వెయ్యేళ్ల తెలుగు చరిత్ర, ప్రముఖ కవులు, రచయితల జీవిత చరిత్రల గురించి చర్చించారు. దశాబ్దాలకాలంగా సాహితీరంగంలో వివిధ వాదాల ద్వారా కొనసాగుతున్న మార్పులు, చోటుచేసుకున్న పరిణామాలు, అభివృద్ధి అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. కరోనా వైరస్ (కోవిడ్-19), మిడతల దండు, అవినీతి, ఎయిడ్స్, ప్రకృతి, ప్రేమ, అనుబంధాలు, శ్రమ సౌందర్యం, సంఘం, సమాజం, కుటుంబం, తెలుగుభాష గొప్పదనం, నిరుద్యోగం, మహిళా సమస్యలు, బాల్యవివాహాలు, వరకట్న దురాచారాలు, కులం, మతం, ప్రాంతీయ బేధాలు, ప్రపంచీకరణ తదితర అంశాలపై పలువురు తమ ప్రసంగాలు, చర్చల ద్వారా వివరించారు. తెలుగు సాహిత్యాన్ని ఇట్టే అవపోషణ పట్టేశారు. నేటికీ సమాజంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కొనసాగుతున్న కుల వివక్ష అంశాలు, మతాల పేరుతో సాగే మారణహోమాలు, అంటరానితనం, అస్పృశ్యత వంటి అనేక అంశాలపై పదునైన పదజాలంతో సంధించారు. సమాజంలో కొనసాగుతున్న సాంఘిక దురాచారాలు, కుల వివక్ష, అశ్పృశ్యత వంటి వాటిని కూకటి వేళ్లతో పెకిలించటానికి అందరం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కవిత్వమంటే కొందరికి అర్థమైతే సరిపోదనీ, పామరులకు సైతం అర్థమయ్యేలా ఉండాలని కితాబిచ్చారు. కాగితంపై రాసిన అక్షరాలను కవిత్వంగా పరిగణించాల్సి వుంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ఔత్సాహిక కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. కుటుంబ జీవనంలో ఇబ్బందులను ఎదుర్కొంటూనే సమాజ అభ్యున్నత కోసం సవాళ్లను ఎదుర్కొనటంలో నాటి మహిళా మణులు చేసిన కృషి అనిర్వచనీయమని గుర్తుచేశారు.

### సామాజిక చైతన్యమే ఇతివృత్తంగా సాగిన వెబినార్

రెండురోజుల పాటు తెలుగు సాహిత్యం - సామాజిక చైతన్యం అనే అంశంపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ తెలుగు విశ్వవిద్యాలయంలో అంతర్జాల అంతర్జాతీయ సదస్సు (వెబినార్) ఉత్సాహపూరితంగా జరిగింది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి డాక్టర్ తరపట్ల సత్యనారాయణ రెండురోజుల వెబినార్ ప్రారంభం సందర్భంగా సదస్సు ప్రాముఖ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. ఆ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఉపాధ్యక్షులుగా ఆచార్య జి.గంగారావు, గౌరవ సభ్యులుగా ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రమేష్, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ వి.పెర్సిస్, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ డాక్టర్ కె.సుబ్బారావు, కన్వీనర్‌గా డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, విద్యా విభాగం సమన్వయకర్త డాక్టర్ జి.ఎలీషాబాబు, ఆర్థిక విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.లక్ష్మీనారాయణ వ్యవహరించారు. 28-5-2020న ప్రారంభ సభకు ఆచార్య కె.రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విసి మొక్కా జగన్నాథరావు, విశిష్ట అతిథిగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, విశిష్ట ఉపన్యాసకులుగా ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జి.యోహానుబాబు, తిరువనంతపురానికి చెందిన ఫాజిల్స్ కార్యదర్శి ఆచార్య బత్తెన కృష్ణారెడ్డి హాజరయ్యారు. 29-5-2020న ముగింపుసభకు ముఖ్యఅతిథిగా నన్నయ్య తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బి.గంగారావు, విశిష్ట అతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఎం.ఎల్.వి.కె.రెడ్డి, విశిష్ట ఉపన్యాసకులుగా మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ విభాగాధిపతి ఆచార్య మాఢభూషి సంపత్‌కుమార్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి ఆచార్య ఎన్.వి.కృష్ణారావు హాజరై సందేశాలను ఇచ్చారు. సాంకేతిక సహకారం ఆర్థికశాఖ సమన్వయకర్త డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, విద్యావిభాగం సహాయాచార్యులు డాక్టర్ వరహాలదొర, వెబ్ మాస్టర్ శ్రీనివాసరావు, రాఘవ, టి.ప్రమోద్, ప్రదీప్‌శాస్త్రి అందించారు.

### వెబినార్ జరిగింది ఇలా...

ప్రాచీన సాహిత్యం-సామాజిక చైతన్యంపై ఆచార్య పి.వరప్రసాదమూర్తి, నవలాసాహిత్యం- సామాజిక చైతన్యంపై ఆచార్య జి.యోహానుబాబు, ఆధునిక కవిత్వం- సామాజిక చైతన్యంపై ఆచార్య మఢభూషి సంపత్‌కుమార్, వచన కవిత్వం-సామాజిక చైతన్యంపై ఆచార్య ఎన్.వి.కృష్ణారావు, మాధ్యమాలు-సామాజిక చైతన్యంపై డాక్టర్ ఎల్.వి.కె.రెడ్డి, జానపద విజ్ఞానం-సామాజిక చైతన్యంపై ఆచార్య బత్తిన కృష్ణారెడ్డి, 'మహిళల ఆత్మకథలు-సామాజిక చైతన్యం'పై భారతీయ భాషల అధ్యయన కేంద్రం ప్రొఫెసర్, ఢిల్లీ కేంద్రీయ విద్యాలయానికి చెందిన డాక్టర్ గంపా వెంకటరామయ్య ప్రత్యేక ఉపన్యాసాలు ఇచ్చారు. ◆

# గుర్రం జాషువా


28.09.1895 -24.07.1971

కులమతాలు గీచుకొన్న గీతల జొచ్చి
పంజరాన గట్టుబడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన గాని
నాకు తరుగులేదు విశ్వనరుడ నేను



SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 1 ▪ SANCHIKA - 10 ▪ KRISHNA ▪ JULY 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 29.06.2020



# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



పండుగలు - ప్రజాసంస్కృతం
పేజీలు 48 రూ. 40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి- అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.

## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు



పేజీలు 80
రూ.65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు - పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.

## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన



పేజీలు 32
రూ.25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు - బౌద్ధతత్వం



పేజీలు 32
రూ.25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధారించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
## లోకాయత



పేజీలు 32
రూ.25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059